నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 22.8.2025	హైదరాబాద్ HYDERABAD	పేజీలు: 14+4 Pages: 14+4	సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 78 ‖ వెల (Price) రూ.6.50

చతుర్దశి

శుక్రవారం, సూర్యోదయం: 6-00, సూర్యాస్తమయం: 6-37. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: చతుర్దశి పగలు 11-56 వరకు, తదుపరి అమావాస్య. నక్షత్రం: ఆశ్లేష రాత్రి 12-07 వరకు. వర్జ్యం: పగలు 12-59 నుంచి పగలు 2-36 వరకు. రాహుకాలం: ఉదయం 10-44 నుంచి పగలు 12-18 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-44 నుంచి పగలు 1-34 వరకు. అమృతకాలం: రాత్రి 10-39 నుంచి రాత్రి 12-16 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మూసీలో 1.5 లక్షల కోట్ల దోపిడీ



- మూసీ సుందరీకరణ ముసుగులో సర్కారు స్కెచ్
- గతంలో 16 వేల కోట్లతోనే మాస్టర్‌ప్లాన్ ఖరారు
- ఢిల్లీకి డబ్బు మూటలు పంపుతూ పదవులు కాపాడుకుంటున్న కాంగ్రెస్ నేతలు
- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

› 3

నిపుణ — పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఎరువుల గోస.. సర్కారు తమాషా!

రగులుతున్న తెలంగాణ

రైతు బతుకు అమాస!



యూరియా కొరత తీర్చలేకపోతున్న సర్కారు తీరును నిరసిస్తూ గురువారం చండూర్ చౌరస్తాలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



యూరియా పోరులో రైతు నెత్తురోడాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద గురువారం జరిగిన తోపులాటలో అజ్మీరా లక్కు మెట్లపై నుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను పోలీసులు దవాఖానకు తరలించారు.

- యూరియా కోసం అట్టుడుకుతున్న రాష్ట్రం
- ఎక్కడికక్కడ ఆందోళనలు, రాస్తారోకోలు
- యూరియా ఎందుకు ఇవ్వరని నిలదీతలు
- పోలీసులు అడ్డుకున్నా ఆగని నిరసనలు
- బస్తా కుస్తీలో పల్లెల మధ్య పంచాయితీ!
- ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితులు
- క్యూలైన్లలో సొమ్మసిల్లుతున్న అన్నదాతలు
- మరిపెడలో తోపులాట.. రైతు తలకు గాయం
- 'బ్లాక్'కు తరలుతున్న యూరియా పట్టివేత

రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నరట! ఇదీ అరికట్టాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ మాట. కొరత.. కొరత.. అని అంటుంటేనే కొరత ఏర్పడుతున్నదని అంటు న్నడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. రైతులు పొలాల్లో ఉండాలి.. బజార్లో ఎందుకున్నారని అంటున్నడు యూరియా ఇయ్య లేక రైతన్నను రోడ్డుమీద నిలబెట్టిన వ్యవసాయ మంత్రి తుమ్మల. కొరత లేదు, పత్రికలే సృష్టిస్తున్నయని మంత్రి పొన్నం అంటుంటే.. కొరత ఉన్నదని, కేంద్రం ఇస్తలేదని మంత్రి పొంగులేటి అంటున్నడు.

బస్తా యూరియా ఇప్పించలేక.. బీజేపీ, కాంగ్రెస్ ఒక రిపై ఒకరు నిందలేసుకుంటూ కాలం గడిపేస్తున్నయ్. కొరత ఉన్నదని ఒప్పుకోరు! లేదని ఇప్పించలేరు! ఇదంతా అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కలిసి ఆడు తున్న దాగుడుమూతలు! అటు బీజేపీ, ఇటు కాంగ్రె స్ కలిసి చేస్తున్న రాజకీయ క్రూర పరిహాసం. › 8



కొందరు కావాలనే ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నరు. యూరియా దొరకట్లేదని భయపెట్టడంతో రైతులు తెల్లారంగనే లైన్ కడుతున్నరు.
-సీఎం రేవంత్

కృత్రిమ కొరత సృష్టిస్తున్నదెవరో తేల్చాల్సింది ఎవరు? చర్యలు తీసు కోవాల్సింది ఎవరు? బ్లాక్ మార్కె ట్‌కు పోతున్నదని బీఆర్‌ఎస్ కూడా చెప్తున్నది కదా. అధికారంలో ఉండీ ఆపలేక.. ఎందుకీ డొల్లమాటలు?



యూరియా కొరత దేశమంతా ఉన్నది. నిజమైన రైతులు పొలంలో ఉన్నరు. బస్తాల కోసం బజార్లోకి వస్తున్నవాళ్లు రైతులు కారు.
- వ్యవసాయ మంత్రి తుమ్మల

సాగు పనుల్లో ఉండాల్సిన రైతుని బజారుకు లాగిందెవరు? బస్తా యూరియా కోసం పడిగాపులు పడేలా చేసిందెవరు? అసలు యూరియానే ఇయ్యకపోతే పొలా నికి పోయి రైతు చేసేదేంది?



రాష్ట్రం వద్ద సరిపడా యూరియా స్టాక్ పెట్టినం. ఏమైందో తెల్వదు. కొరత.. కొరత.. అంటూ మాట్లాడటం వల్లే కొరత ఏర్పడుతున్నది.
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సరిపడా యూరియా ఇస్తే.. ఇచ్చింది ఏమైందో తేల్చాలి కదా? 'కొరత..కొరత' అంటేనే ఎరువు లకు కొరత ఏర్పడితే.. మరి 'తెస్తాం.. తీరుస్తాం' అంటే సమస్య పరిష్కారమైతదా?



నమస్తే తెలంగాణ, టీ-న్యూస్ పదే పదే వార్తలు ప్రసారం చేయడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత కనిపిస్తున్నది.
-మంత్రి పొన్నం ప్రభాకర్

ఏ ఊరికి పోయినా యూరియా కరువు కనిపిస్తున్నది. అగచాట్ల ఫొటోలు, రైతుల శాపనార్థాలు అన్నీ అబద్ధమా? రైతు గోసను పట్టించుకోకుండా పత్రికలపై నెపం నెట్టేస్తే ఎలా?



యూరియా కరువుకు బాధ్యత కేంద్రానిదే! రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయాలి. పరిస్థితిని రోజుకు రెండుసార్లు సమీక్షిస్తున్నం
-మంత్రి పొంగులేటి

అడిగినంతా యూరియా ఇచ్చా మని కేంద్రం అంటున్నది. ఇవ్వలే దని మీరంటున్నరు. మీరు సరిగ్గా అడగలేదా? అడిగినా వాళ్లివ్వ లేదా? ఎవరివి డ్రామాలు! ఏమిటీ దాగుడుమూతలు?

యూరియా.. జీరో!

మార్క్‌ఫెడ్ వద్ద అడుగంటిన బఫర్‌స్టాక్

- 3 లక్షలు ఉండాల్సిన చోట 12 వేల టన్నులు మాత్రమే
- ముందస్తు నిల్వలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ వైఫల్యం › 10
- గతంలో ఒక్క మార్క్‌ఫెడ్ వద్దే కనీసం 3 లక్షల టన్నులు
- ఆర్థిక భారం తగ్గించుకునేందుకు బఫర్ స్టాక్‌కు కాంగ్రెస్ కోత
- తెలంగాణకు వచ్చిన యూరియా ర్యాక్‌లూ పక్క రాష్ట్రాలకు!

'నమస్తే తెలంగాణ'పై మంత్రి పొన్నం నిందలు

- క్షేత్రస్థాయి వాస్తవాలను, రైతు గోసను కండ్లకు కడుతుండటమే నేరమట!
- యూరియా కొరత తీర్చడానికి బదులు పత్రిక, టీన్యూస్‌పై ఉల్టా నిందలు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారంటూ అక్కసు › 8

క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్

- దేశంలోనే అత్యధిక కేసులున్న సీఎం
- ఆయనపై మొత్తం 89 కేసులు
- ఏడీఆర్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశంలోని ముఖ్యమంత్రులలో 42 శాతం మంది తీవ్రమైన నేరాలకు సంబంధించిన అభియోగాలు ఎదుర్కొంటున్నట్లు ఎన్నికల కమిషన్‌కు వారు సమర్పించిన అఫిడవిట్లను అధ్యయనం చేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) వెల్లడించింది. వరుసగా 30 రోజులు కస్టడీలో ఉన్న పక్షంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు తమ పదవులను కోల్పోయేందుకు ఉద్దేశించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఏడీఆర్ నివేదికలోని అంశాలు సంచలనంగా మారాయి. దేశంలో అత్యధికంగా నేరారోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ముఖ్యమంత్రులలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే అత్యధికంగా కేసులు ఉండడం గమనార్హం. ఎన్నికల కమిషన్‌కు ముఖ్యమంత్రులు సమర్పించిన అఫిడవిట్ల నుంచి సమాచారం తీసుకుని 2024 డిసెంబర్‌లో ఏడీఆర్ ఈ నివేదిక తయారుచేసింది.

13 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

దేశంలోని 31 మంది ముఖ్యమంత్రులలో 13 మంది ముఖ్యమంత్రులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఏడీఆర్ వెల్లడించింది. వీరిలో 10 మంది ముఖ్యమంత్రులపై హత్యాయత్నం, కిడ్నాప్, లంచం, వేధింపులు వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. ఈ 10 మంది ముఖ్యమంత్రులలో ఏడుగురు ప్రతిపక్ష పాలిత రాష్ర్టాలకు చెందిన వారు కాగా బీజేపీ మిత్ర పక్షాలకు చెందిన వారు ఇద్దరు, బీజేపీకి చెందిన ఒక వ్యక్తి ఉన్నారు. ఈ 10 మంది ముఖ్యమంత్రులపై ఉన్న నేరారోపణలు రుజువైతే గరిష్ఠ స్థాయిలో ఐదేళ్ల అంతకు మించి శిక్ష పడే అవకాశం ఉంది. ఎన్నికల నేరాలు, ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చడం, దాడులు, హత్యాయత్నాలు, కిడ్నాప్, అత్యాచారం వంటి తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. 28 రాష్ట్ర అసెంబ్లీలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ముఖ్యమంత్రులకు సంబంధించి 2024 డిసెంబర్‌లో ఏడీఆర్ విశ్లేషించిన వివరాల ప్రకారం తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేరారోపణలు అత్యధికంగా ఉన్న టాప్ 10లో మొదటి స్థానంలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న రేవంత్ రెడ్డిపై మొత్తం 89 కేసులు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నేరారోపణలకు సంబంధించి 72 కేసులు ఉన్నాయి.



ఎవరెవరిపై కేసులున్నాయంటే..

అత్యధిక కేసులున్న ముఖ్యమంత్రుల జాబితాలో రెండవ స్థానంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్(డీఎంకే) ఉన్నారు. ఆయనపై మొత్తం 42 కేసులు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నేరాలకు చెందిన కేసులు 11 ఉన్నాయి. ఈ జాబితాలో మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు(టీడీపీ) ఉన్నారు. ఆయనపైన మొత్తం 19 కేసులు ఉన్నాయి. తీవ్రమైన నేరాభియోగాలు 32 ఉన్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాలుగవ స్థానంలో ఉన్నారు. ఆయనపై మొత్తం 13 కేసులు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నేరారోపణలు 6 ఉన్నాయి. 5వ స్థానంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్(జేఎంఎం) ఉన్నారు. ఆయనపై మొత్తం 5 కేసులు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నేరారోపణలు 7 ఉన్నాయి. ఆరవ స్థానంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్(బీజేపీ) ఉన్నారు. ఆయనపై మొత్తం 4 కేసులు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నేరారోపణలు 2 ఉన్నాయి. జాబితాలో 7వ స్థానంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు(కాంగ్రెస్)పై మొత్తం 4 కేసులు ఉన్నాయి. 8వ స్థానంలో ఉన్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్(సీపీఎం)పై మొత్తం 2 కేసులు ఉండగా ఈ రెండూ తీవ్రమైన నేరారోపణలకు సంబంధించినవే. జాబితాలో 9వ స్థానంలో సిక్కిం ముఖ్యమంత్రి పీఎస్ తమాంగ్(ఎస్‌కేఎం) ఉన్నారు. ఆయనపై ఒకే కేసు ఉంది. 10వ స్థానంలో ఉన్న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్(ఆప్)పై ఒకే కేసు ఉంది.

ఆ రహదారుల్లో ఫాస్టాగ్ వార్షిక పాస్ చెల్లదు

- రాష్ర్టాలు, స్థానిక సంస్థల టోల్‌ప్లాజాల వద్ద చెల్లదని అధికారుల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా వాహనదారులకు కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. వ్యక్తిగత వాహనదారులకు మాత్రమే ఈ వార్షిక పాస్ లభిస్తుంది. వాణిజ్య వాహనాలకు లభ్యం కాదు. రూ.3 వేలతో కొనుగోలు చేసే ఈ పాస్ టోల్‌ప్లాజాకు సగటున రూ.15తో ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుంది. ఏఏ రోడ్లకు వర్తిస్తుందన్న దానిపై గందరగోళం ఏర్పడటంతో అధికారులు దీనిపై వివరణ ఇచ్చారు. ఈ ఫాస్టాగ్ కేవలం జాతీయ రహదారులకు మాత్రమే వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే 1159 టోల్‌ప్లాజాల వద్ద పాస్ చెల్లుతుంది. అదే సమయంలో రాష్ర్టాలు, స్థానిక సంస్థలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ వేలు, రహదారులపై ఉండే టోల్ ప్లాజాల వద్ద ఇది చెల్లదు. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టు కాబట్టి, అక్కడ ఈ పాస్ చెల్లదు. ప్రయాణించే మార్గంలో టోల్‌ప్లాజాలు ఎవరి పరిధిలోకి వస్తాయో తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

బీజేపీ నా భావజాల శత్రువు

- ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి
- ఫాసిస్టు శక్తులతో ఎన్నటికీ నేను చేతులు కలపను
- మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి
- ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా తమిళనాడులో బీజేపీ గెలవదు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యనే పోరు
- తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్ స్పష్టీకరణ



పరపత్తిలో జరిగిన టీవీకే రాష్ట్ర సమావేశంలో ప్రసంగిస్తున్న విజయ్, సభకు భారీగా హాజరైన జనం

మధురై, ఆగస్టు 21: బీజేపీ తన భావజాల శత్రువని తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ ప్రకటించారు. ఫాసిస్టు శక్తులతో చేతులు కలిపే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. తమిళనాడులోని మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిపైన మదురై జిల్లాలోని పరపత్తిలో గురువారం జరిగిన పార్టీ రాష్ట్ర సమావేశంలో విజయ్ ప్రసంగించారు. ఎన్ని కుతంత్రాలు చేసినా తమిళనాడులో బీజేపీ గెలవడం అసంభవమని జోస్యం చెబుతూ కమలంపై నీరు నిలవదని చమత్కరించారు. తమిళనాడులో ఏపార్టీతో పొత్తుపెట్టుకున్నప్పటికీ బీజేపీ గెలిచే అవకాశం లేదని ఆయన పరోక్షంగా అన్నాడీఎంకేని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు తరచు శ్రీలంక నేవీకి చిక్కి బందీలుగా మారుతున్న ఘటనలను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి వారి వెతలు పట్టవని ఆరోపించారు. కచ్చతీవును భారత్ తిరిగి స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇవ్వాలని ప్రధాని మోదీని కోరారు.

ఆర్‌ఎస్‌ఎస్‌కి బానిసగా ఉండబోం

ఆర్‌ఎస్‌ఎస్‌కి బానిసగా తమ పార్టీ ఉండబోదని విజయ్ స్పష్టం చేశారు. లౌకిక ఫ్రంట్ అని చెప్పుకుంటున్న మరో గ్రూపు ప్రజలను మోసం చేస్తోందని ఆయన పరోక్షంగా డీఎంకే సారథ్యంలోని ఇండియా కూటమిని ఉద్దేశించి ఆరోపించారు. ప్రతిపక్షాలు తమిళనాడు అస్తిత్వాన్ని తగ్గిస్తున్నాయని మండిపడ్డారు. ఏ కూటమిలో చేరి తమ అస్తిత్వాన్ని కోల్పోబోమని, తాము ఆత్మాభిమానంతో పోరాటం సాగిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని చిన్న పార్టీలు తనతో కలసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

డీఎంకే మా రాజకీయ విరోధి

అధికార డీఎంకేని తన రాజకీయ విరోధిగా విజయ్ ప్రకటించారు. తనను తాను సింహంతో పోల్చుకుంటూ పార్టీ కార్యకర్తలను సింహం పిల్లలుగా సంబోధించారు. ఒంటరిగా ఎలా నిలబడాలి, ఎంత నిబ్బరంగా ఉండాలో సింహానికే తెలుసునని, అడవిలో ఎన్నో గుంట నక్కలు, ఇతర జంతువులు ఉన్నాయని, అయితే ఒకే ఒక సింహం ఉంటుందని విజయ్ చెప్పారు. ఎంత ఆకలి మీదున్నా సింహం గడ్డి తినదని, ఆకలి మీదున్న సింహం దేన్నయినా వేటాడితే దొరికేదాకా వదలదని చెప్పారు.

మధురై తూర్పు నుంచి పోటీ

ఎనిమిది నెలల్లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యనే ప్రత్యక్ష పోరు ఉంటుందని విజయ్ చెప్పారు. తాను మధురై తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు విజయ్ ప్రకటించారు. మధురై పరిసరాల్లో ఉన్న మరి కొన్ని అసెంబ్లీ స్థానాలకు కూడా టీవీకే అభ్యర్థులు కొందరి పేర్లను ఆయన సమావేశంలో ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలలో టీవీకే పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రతే తమ పార్టీ మొదటి ప్రాధాన్యతని ఆయన ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేని ఇంటికి పంపిస్తామని ఆయన వ్యాఖ్యానించారు.

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు

పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు లోక్‌సభ బుధవారమే ఆమోదం తెలుపగా, గురువారం రాజ్యసభలో ఎటువంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ గేములకు ప్రజలు బానిసలు కాకుండా నిరోధించడంతోపాటు మనీలాండరింగ్, ఆర్థికపరమైన మోసాలు, ఆత్మహత్యలను నివారించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధిస్తూ ఈ బిల్లు తీసుకువచ్చింది.ఈ కార్యకలాపాల కోసం బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు నిధుల బదిలీ వంటి కార్యకలాపాలు చేపట్టకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. వరుస అంతరాయాలు, వాయిదాలు, వాకౌట్ల మధ్య నెలరోజులపాటు జరిగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో 12 బిల్లులు, రాజ్యసభలో 15 బిల్లులు ఆమోదం పొందాయి. జూలై 21న ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ మినహాయించి మరే అంశం చర్చకు నోచుకోలేదు. సమావేశాలు ప్రారంభమైన తొలి రోజుల్లో ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాలు చర్చకు పట్టు పట్టిన కారణంగా, తర్వాత బీహార్‌లోని ఎస్‌ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు డిమాండు చేయడంతో సభలో చర్చకు తావు లేకుండా పోయింది. చాలా బిల్లులు విపక్ష సభ్యుల నిరసనల మధ్యే మూజువాణి ఓటుతో ఆమోదం పొందగా కొన్ని బిల్లులు ప్రతిపక్షాలు స్వల్ప చర్చతో ఆమోదం పొందాయి.

ఉప రాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి నామినేషన్



న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బీ సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీ పడనున్నారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ తదితరులు వెంటరాగా, బీ సుదర్శన్ రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాల్ని రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

రైళ్ల టాయిలెట్లలో నీటి కొరతపై లక్షకు పైగా ఫిర్యాదులు

2022-23 ఆర్థిక ఏడాదిపై కాగ్ నివేదిక

న్యూఢిల్లీ: రైళ్లలోని మరుగుదొడ్లు, వాష్ బేసిన్లలో నీటి కొరతకు సంబంధించి 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేకు 1,00,280 ఫిర్యాదులు అందాయని కాగ్ నివేదిక పేర్కొంది. ఈ నివేదికను బుధవారం పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ ఫిర్యాదుల్లో 33,937 కేసుల్లో వాటిని పరిష్కరించడానికి అనుకున్న సమయం కంటే ఎక్కువ సమయం తీసుకున్నారని నివేదిక వెల్లడించింది. 2018-19 నుంచి 2022-23 మధ్య కాలానికి సంబంధించి 'సుదూర దూరం ప్రయాణించే రైళ్లలో శుభ్రత, పారిశుధ్యం' పేరిట వెలువరించిన ఆడిట్ రిపోర్ట్.. ప్రజారోగ్యం, భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైళ్లలో అత్యుత్తమ పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని నొక్కి చెప్పింది.

గవర్నర్ పనిచేయకపోతే జోక్యం వద్దా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని కేంద్రం వాదన

న్యూఢిల్లీ: శాసనసభ ఆమోదించిన బిల్లులపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా గవర్నర్లు నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం వల్ల శాసనసభ ఉనికిలో లేకుండా పోతుందని, అటువంటి పరిస్థితిలో జోక్యం చేసుకోవడానికి న్యాయస్థానాలకు అధికారం లేదా అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్రపతికి నివేదించిన బిల్లుల ఆమోదానికి నిర్దిష్టమైన కాలవ్యవధిని సుప్రీంకోర్టు నిర్దేశించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను ధర్మాసనం గురువారం ప్రశ్నించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వలేదని సొలిసిటర్ జనరల్ వాదించగా సీజేఐ గవాయ్ స్పందిస్తూ గవర్నర్ తన బాధ్యతలను నిర్వర్తించని పక్షంలో న్యాయస్థానానికి జోక్యం చేసుకునే అధికారం లేదా అని ప్రశ్నించారు. బిల్లును ఆమోదిస్తారా లేక తిరస్కరిస్తారా అన్న విషయం జోలికి తాము పోవడం లేదని, తాము ప్రశ్నించేదల్లా శాసనసభ ఆమోదించిన బిల్లుపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచితే ఏం చేయాలని సీజేఐ ప్రశ్నించారు. దీనికి తుషార్ మెహతా జవాబిస్తూ అటువంటి పరిస్థితులు ఉత్పన్నమైనపుడు రాజకీయంగా పరిష్కారాలు కనుగొనాలే కాని న్యాయపరంగా కాదని వాదించారు. వీటికి పరిష్కారాలు రాజకీయంగా ఉంటాయని, ప్రజాస్వామిక రాజకీయ ప్రక్రియ ద్వారా ఇటువంటి కేసులు పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. అసెంబ్లీలో మెజారిటీ సభ్యులు ఆమోదించిన బిల్లుకు ఆమోదం తెలియచేయకుండా గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం వల్ల శాసనసభ ఉనికి లేకుండా పోతుందని సీజేఐ ప్రశ్నించారు. ఈ సమస్యకు పరిష్కార వేదిక న్యాయస్థానం కాదని తుషార్ మెహతా అన్నారు. రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించాలంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుందని లేదా రాజకీయంగా పరిష్కరించుకోవలసి ఉంటుందని ఆయన చెప్పారు.



టీసీఎస్ లేఆఫ్‌లపై ఉద్యోగుల నిరసన

- 40 వేల మందిని తొలగిస్తున్నట్టు ఆరోపణలు
- 2% మందిపైనే ప్రభావమన్న సంస్థ



న్యూఢిల్లీ: టెక్ కంపెనీల్లో లేఆఫ్‌ల ప్రవాహం కొనసాగుతున్న వేళ టీసీఎస్ మరోమారు వార్తల్లోకి ఎక్కింది. 30 వేల నుంచి 40 వేల మందిని తొలగించినట్టు వార్తలు రావడంతో ఐటీ ఉద్యోగుల సంఘం 'యునైట్' చెన్నైలో ఆందోళనకు దిగింది. అయితే, టీసీఎస్ మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. అవి తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తోసిపుచ్చింది. తమ సిబ్బందిలో 2 శాతం మందిపై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని స్పష్టం చేసింది. తొలగింపు వార్తల తర్వాత యూనియన్ ఆఫ్ ఐటీ అండ్ ఐటీఈఎస్ ఎంప్లాయీస్ (యునైట్) ఈ వారం చెన్నైలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించింది. కనీసం 12,000 మంది మిడ్‌లెవల్, సీనియర్ లెవల్ ఉద్యోగులను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా తొలగిస్తున్నారని, చివరికి ఈ సంఖ్య 40,000కు చేరుకోవచ్చని ఆరోపించింది. నిరసనకారులు 'చీఫ్ ఆఫ్ కార్పొరేట్ గ్రీడ్ (కార్పొరేట్ అత్యాశకు అధిపతి)', 'చీఫ్ ఆఫ్ క్రూయెల్టీ' (క్రూరత్వానికి అధిపతి) వంటి నినాదాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు. కంపెనీ 24.3 శాతం ఆపరేటింగ్ ప్రాఫిట్ మార్జిన్, రూ. 45,588 కోట్ల డివిడెంట్ చెల్లింపులను ఉటంకిస్తూ తొలగింపుల అవసరాన్ని 'యునైట్' ప్రశ్నించింది.

18 ఏండ్లు దాటిన వారికి అస్సాంలో నో ఆధార్

సీఎం హిమంత బిశ్వ శర్మ మంత్రివర్గం నిర్ణయం

గువాహటి : వయోజనులకు కొత్త ఆధార్ కార్డుల జారీని నిలిపివేయాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని కేబినెట్ గురువారం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, తేయాకు తోటల ప్రజలకు ఒక ఏడాది మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది. చొరబాటుదారులు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించుకోవడాన్ని నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే 18 ఏళ్ల వయసు పైబడినవారికి ఆధార్ కార్డులను జారీ చేసే అధికారాన్ని జిల్లా కమిషనర్లకు కల్పించినట్లు పేర్కొంది. సీఎం శర్మ మాట్లాడుతూ, నిరుడు బంగ్లాదేశీ చొరబాటుదారులను పట్టుకునేందుకు నిరంతరం కృషి చేశామన్నారు. ఏడుగురు చొరబాటుదారులను బుధవారం తిప్పి పంపించేశామని చెప్పారు. చొరబాటుదారులందర్నీ పట్టుకోగలమని చెప్పలేమని, భారత పౌరులుగా మారడాన్ని నిరోధించడం కోసం జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

యూపీలో రైతులపై విరిగిన లాఠీ

ఎరువుల కోసం రోడ్డెక్కిన అన్నదాత

లక్నో, ఆగస్టు 21: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో తలెత్తిన ఎరువుల కొరత రాష్ట్రవ్యాప్తంగా సంక్షోభానికి దారితీసింది. అనేక జిల్లాలలో రైతులు నిరసనలకు దిగడంతో ఆందోళన చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు గురువారం లాఠీచార్జీ చేశారు. అయోధ్య నుంచి బారాబంకీ వరకు, బలరాంపూర్ నుంచి దేవరియా వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల కొరత ఏర్పడడంతో వేలాదిమంది రైతులు ఎర్రటి ఎండలో ఎరువుల కోసం దుకాణాల వద్ద బారులుతీరి నిలబడి చివరకు రిక్తహస్తాలతో వెనుదిరుగుతున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ఎరువులు దక్కకపోవడంతో అనేక చోట్ల రైతులు పట్టలేని ఆగ్రహంతో ఆందోళనకు దిగుతున్నారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జీ చేస్తున్నారు.

వివాహితులకు సంపూర్ణ స్వేచ్ఛ అసాధ్యం!

పూర్తి స్వాతంత్ర్యం కావాలంటే పెళ్లి చేసుకోకండి : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : వైవాహిక బంధంలో ప్రవేశించిన వారు ఆ బంధాన్ని కొనసాగిస్తూ, తన భర్త లేదా భార్య నుంచి తనకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉందని చెప్పడం అసాధ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనకు సంపూర్ణ స్వేచ్ఛ కావాలని ఎవరైనా కోరుకుంటే, వారు వైవాహిక బంధంలో ప్రవేశించకూడదని చెప్పింది. విడిపోయిన భార్యాభర్తల కేసుపై విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ దంపతులిద్దరికీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లి అంటే ఇద్దరు ఒకచోటకు చేరడమని, పెళ్లి చేసుకుని కూడా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటున్నానని ఎలా చెప్పగలరని ధర్మాసనం ప్రశ్నించింది. పిల్లల ప్రయోజనం కోసం దంపతులిద్దరూ సయోధ్య కుదుర్చుకోవాలని హితవు పలికింది. ఈ కేసులో భర్త సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. భార్య హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యారు. తన భర్తకు వివాదాన్ని పరిష్కరించుకోవడం ఇష్టం లేదని భార్య ఆరోపించారు. ఆయన కేవలం పిల్లల కస్టడీ, సందర్శన హక్కులను మాత్రమే వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. తాను సింగపూర్‌నకు వెళ్లకపోవడానికి కారణం తన భర్త గతంలో ప్రవర్తించిన తీరు అని చెప్పారు. తనకు పోషణ భత్యం అందలేదని తెలిపారు. అందుకే తాను ఒంటరి తల్లిగా జీవనోపాధి కోసం ప్రయత్నిస్తున్నానని చెప్పారు. తదుపరి విచారణ వచ్చే నెల 16న జరుగుతుందని కోర్టు తెలిపింది. సయోధ్య కుదుర్చుకోవడం కోసం విడాకుల ప్రొసీడింగ్స్‌ను నిలిపి ఉంచడానికి భర్త అంగీకరించారు.

చెంప దెబ్బ కొట్టాడని టీచర్‌పై కాల్పులు

ఉత్తరాఖండ్‌లో విద్యార్థి దుశ్చర్య

డెహ్రాడూన్: చెంపదెబ్బ కొట్టిన ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థి తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన బుధవారం ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గురునానక్ స్కూల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడైన గగన్‌దీప్ సింగ్ కోహిల్ గత వారం ఓ విద్యార్థిని చెంప దెబ్బ కొట్టారు. బుధవారం ఇంటర్వెల్ సమయంలో ఆయన తరగతి గదిని వీడి వెళుతున్నప్పుడు నిందితుడు తన టిఫిన్ బాక్స్‌లోంచి తుపాకీ తీసి ఆయన వెనకవైపు కాల్పులు జరిపాడు. ఆ తర్వాత పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇతర టీచర్లు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధిత టీచర్ మెడకు తూటా వల్ల గాయమైంది. ఆయనకు వెంటనే శస్త్ర చికిత్స చేసి దాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తుపాకీని సీజ్ చేశారు. నిందితుడికి అది ఎలా లభించిందన్న విషయమై దర్యాప్తు చేస్తున్నారు.



రాజస్థాన్‌లో డైనోసార్ శిలాజం!

180 మిలియన్ ఏండ్ల నాటిదిగా గుర్తింపు

జైసల్మేర్: రాజస్థాన్‌లోని మేఘ గ్రామంలో డైనోసార్లు సంచరించినట్టు కొందరు పరిశోధకులు గుర్తించారు. దాదాపు 180 మిలియన్ సంవత్సరాల క్రితం జురాసిక్ యుగం నాటి వెన్నెముక గల జంతు జాతి శిలాజాన్ని వీరు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ జైసల్మేర్ భౌగోళిక చరిత్రపై కొత్త వెలుగును నింపడమే కాకుండా పరిశోధన, పర్యాటక రంగాలకు కొత్త మార్గాలను తెరుస్తుందని భావిస్తున్నారు. 'ఇది వెన్నెముక గల జంతు జాతి శిలాజం..వెన్నెముక మొత్తం భాగాలను ఇందులో చూడవచ్చు' అని సీనియర్ హైడ్రో-జియాలజిస్ట్ నారాయణ దాస్ ఇనాఖియా తెలిపారు.

రీల్స్ మత్తు.. మెదడు చిత్తు!

- అతిగా చూడటం మద్యపానం, జూదంతో సమానం
- మెదడుపై ప్రతికూల ప్రభావం
- తాజా అధ్యయనం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత జనం తమ పక్కనున్న వారితోకంటే కంప్యూటర్ లేదా సెల్‌ఫోన్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. టిక్‌టాక్ యాప్ అందుబాటులోకి వచ్చిన తరువాత చిన్నచిన్న వీడియోలు (రీల్స్) షూట్ చేసి జనాలపైకి వదలడం ప్రారంభమైంది. చైనాకు చెందిన ఆ యాప్‌ను భారత్‌లో నిషేధించిన అనంతరం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఈ రీల్స్ ప్రతిరోజు వేలు, లక్షల సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటిలో కొన్ని విజ్ఞానాన్ని, వినోదాన్ని, ఆధ్యాత్మికతను అందిస్తుండగా ఎక్కువ సంఖ్యలో అశ్లీలం, హింసను ప్రేరేపించేవిగానే ఉంటున్నాయి. అవి ఏ రకమైనవి అయినా వాటిని చూడటం ఇప్పుడు నెటిజనులకు ఓ వ్యసనంగా మారిపోయింది. ఆ వ్యసనం మద్యం వల్ల కలిగే అంతటి దుష్ప్రభావానికి దారి తీస్తున్నదని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రీల్స్ చూడటం వల్ల కేవలం సమయం మాత్రమే హరించుకుపోవడం లేదని, మెదడుపై అది తీవ్ర దుష్ప్రభావాన్ని కలుగజేస్తున్నదని న్యూరోసైంటిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. మెదడుపై ఆల్కహాల్ (మద్యం) వల్ల కలిగే దుష్ప్రభావం వంటిదే ఈ లఘు వీడియోల వల్ల కూడా కలుగుతుందని పేర్కొంటున్నారు. ఈ వీడియోలకు వ్యసనపరులుగా మారటం వల్ల మనిషిలో ప్రేరణ, కేంద్రీకరణ, జ్ఞాపకశక్తిపై కూడా దీర్ఘకాలిక ప్రభావం పడుతుందని భారత్‌లోని న్యూరాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

ప్రపంచ ఆరోగ్య ముప్పుగా రీల్స్

దీనిపై తియాంజిన్ నార్మల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కియాంగ్ వాంగ్ నేతృత్వంలో జరిగిన ఓ అధ్యయన నివేదికను ఇటీవల న్యూరాల్మేజ్ పత్రికలో ప్రచురించారు. ఈ అధ్యయనం ప్రకారం.. మద్యం సేవించినప్పుడు లేదా జూదం ఆడినప్పుడు మెదడులోని ఏ సర్క్యూట్‌లైతే ప్రేరేపితమవుతాయో, షార్ట్ వీడియోలు చూసినప్పుడు కూడా అదే ప్రభావం ఉంటుందని తెలిపింది. 'రీల్స్‌కు వ్యసనపరులుగా మారటం నేడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించింది. చైనీయులు ప్రతిరోజు సగటున 151 నిమిషాలపాటు రీల్స్ చూస్తున్నారు. ఈ రీల్స్ వల్ల శ్రద్ధ లోపిస్తున్నది, నిద్రకు భంగం వాటిల్లుతున్నది, మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నది' అని వాంగ్ వివరించారు. ఈ రీల్స్ వల్ల ఏకాగ్రత, నైపుణ్యత, జ్ఞాపకశక్తి దెబ్బతింటున్నదని మరికొన్ని పరిశోధనలు వెల్లడించాయి.

అతి ఏదైనా ప్రమాదమే

పరిమితి లేకుండా రీల్స్ చూడటం వల్ల అంతిమంగా మెదడు దెబ్బతింటుందని, అందువల్ల పరిమితి విధించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అయితే ఆ పరిమితి ఎంత అనేది నిర్దిష్టంగా చెప్పలేమని డాక్టర్ బహ్రానీ అన్నారు. స్క్రీన్ టైం అది కంప్యూటర్ అయినా, సెల్‌ఫోన్ అయినా రోజుకు రెండు లేదా మూడు గంటలు మించకూడదని చెప్పారు. అంతకుమించితే అది మెదడుకు విషంగా మారుతుందని హెచ్చరించారు. నేడు జనం క్రమంగా డిజిటల్ మత్తులోకి వెళ్తున్నారని, దానిని అరికట్టకపోతే, ఇది డిజిటల్ వెర్రి/పిచ్చి స్థితికి చేరుతుందని, ఇది నిద్రలేమికి, జ్ఞాపకశక్తి లోపానికి కారణమవుతుందని వివరించారు. రీల్స్ మొదట్లో వినోదాత్మకంగానే ఉంటాయని, కానీ అవి మన మెదడు పని తీరును మార్చేస్తాయని చెప్పారు.





మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 22.8.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4

సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 78 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఘోష్ రిపోర్టు చెల్లదు

కాళేశ్వరంపై ఏకపక్షంగా విచారణ.. నివేదికతోపాటు కమిషన్ ఏర్పాటు జీవోనూ రద్దు చేయాలి

రాజకీయ దురుద్దేశంతోనే కమిషన్ ఏర్పాటు.. హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్

రిపోర్ట్‌పై ముందుగా అసెంబ్లీలో చర్చిస్తారా, లేక చర్యలకు ఆదేశిస్తారా?.. ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

- వ్యక్తి ప్రతిష్ట దెబ్బతినేలా కమిషన్ వ్యవహారం
- సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా రిపోర్ట్
- వ్యక్తిగత నిర్ణయాలే కారణమని తేల్చేముందు ఎలాంటి నోటీసులనూ కమిషన్ ఇవ్వలేదు
- సాక్షుల క్రాస్ ఎగ్జామిన్‌కూ అవకాశమివ్వలేదు
- నిర్దోషిత్వం నిరూపించుకునే చాన్స్ ఇవ్వలేదు
- సాక్షిపై అభియోగాలను ఎలా మోపుతారు?
- నివేదికను అసెంబ్లీలో పెట్టకుండా.. దానిలోని వివరాలను సీఎం ఎలా బహిర్గతం చేస్తారు?
- శిక్ష విధించే అధికారమేదీ కమిషన్‌కు లేదు
- జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోండి
- నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలేవీ తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వండి
- బీఆర్ఎస్ తరపు న్యాయవాదుల వాదన
- రిపోర్టుపై శాసనసభలో చర్చించాక చర్యలా?
- చర్యలకు ఆదేశించాక సభ ముందుపెట్టరా?
- ప్రభుత్వం నేడు వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

కాళేశ్వరం కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ న్యాయపోరాటానికి దిగింది. జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన ఏకపక్ష నివేదికపై హైకోర్టు తలుపు తట్టింది. కమిషన్ ఏర్పాటులోనే రాజకీయ కుట్ర దాగి ఉన్నదని, గత ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఏకపక్షంగా విచారణ సాగిందని బీఆర్ఎస్ ఇప్పటికే విమర్శిస్తున్నది. ఈ నేపథ్యంలో గురువారం హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కమిషన్ ఏర్పాటు జీవోను, దాని నివేదికను రెంటినీ రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ ప్రారంభించింది.



ప్రభుత్వానికి ఘోష్ కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత అందులోని అంశాలకన్నా, కమిషన్ విచారణ తీరు ఎక్కువ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే క్రమంలో కమిషన్ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఇప్పటికే అటు రాజకీయ, ఇటు న్యాయవర్గాల్లో విస్తృతచర్చ సాగుతున్నది. కాంగ్రెస్ సర్కారు రాజకీయ దురుద్దేశంతోనే కమిషన్‌ను ఏర్పాటు చేసిందనేది సుస్పష్టం. అయితే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌కు భిన్నంగా విచారణ సాగిందని పలువురు న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు.



> కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై జస్టిస్ పినాకీ చంద్రఘోష్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించిన తరువాత చర్యలపై నిర్ణయం తీసుకుంటారా? లేక నివేదికపై చర్యలకు ఆదేశాలు జారీ చేశాక అసెంబ్లీలో చర్చిస్తారా? ఇది ఎంతో కీలకం. దీనిపైనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల పిటిషన్ ఆధారపడి ఉన్నది. - హైకోర్టు ధర్మాసనం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించిన తరువాత చర్యలపై నిర్ణయం తీసుకుంటారా లేక నివేదికపై చర్యలకు ఆదేశాలు జారీ చేశాక అసెంబ్లీలో చర్చిస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఇది ఎంతో కీలకమని, దీనిపైనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్ ఆధారపడి ఉన్నదని గుర్తుచేసింది. హైకోర్టు ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేమని, ప్రభుత్వ వివరణ తెలుసుకొని చెప్పడానికి రెండుమూడు రోజుల గడువు కావాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోరారు. ఇది కీలక విషయమని, ప్రభుత్వ వివరణ తెలుసుకుని శుక్రవారం జరిగే విచారణలో తెలియజేయాలని హైకోర్టు తేల్చిచెప్పింది. విచారణను మంగళవారానికి వాయిదా వేయాలన్న ఏజీ అభ్యర్థనను తోసిపుచ్చింది.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పినాకిచంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. కమిషన్ విచారణ పూర్తిచేసి గత నెల 31న రాష్ట్ర › 5వ పేజీలో



ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టులో బీఆర్ఎస్ అఫిడవిట్ వివరంగా.. › 4,5పేజీల్లో

ప్రాణత్యాగానికి సిద్ధపడిన నేతపై నిందలా?

'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలన్న చిరకాల కలను సాకారం చేసేందుకు ప్రాణత్యాగానికి సిద్ధపడిన కేసీఆర్‌పై నిందలు మోపుతారా? అన్ని నిర్ణయాలనూ నాటి సీఎంగా ఉన్న కేసీఆర్ ఒక్కరే తీసుకున్నారని చెప్పడం ఏకపక్షం. వేరే వాళ్ల భుజస్కంధాలపై తుపాకీ పెట్టి కాల్పులు జరిపినట్టు కమిషన్ రిపోర్టు ఉంది. మంత్రివర్గం, ఇంజినీర్ల కమిటీల నివేదికల మేరకు నిర్ణయాలు తీసుకుంటే కేసీఆర్ ఒక్కరే అన్ని నిర్ణయాలు తీసుకున్నారని వేటి ఆధారంగా చెప్తారు? కమిషన్ నివేదికను సంక్షిప్తం చేసి 60 పేజీల నివేదికను అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. మీడియాకు కూడా ఆ నివేదిక చేరింది. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాలే అందుకు సాక్ష్యం. ఆ కథనాలను పరిశీలన చేయండి. సీఎం సారథ్యంలో జరిగిన సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆ నివేదికలోని వివరాలను వెల్లడించడంలో ఆంతర్యం ఏమిటి? జ్యుడీషియల్ కమిషన్‌కు ఉన్న నిర్వచనం రామనాథన్ అయ్యర్ నిఘంటువులో విపులంగా ఉంది. విచారణ పూర్తిచేసి బాధ్యులను గుర్తించడం మాత్రమే కమిషన్ పని అని ఆ నిఘంటువులో చాలా స్పష్టంగా ఉంది. కమిషన్ మొత్తం 119 మంది సాక్షులను విచారించింది. అందులో చిట్ట చివరి వ్యక్తి కేసీఆర్. ఆయనకు ముందు వచ్చిన సాక్షులు కేసీఆర్, హరీశ్‌లకు వ్యతిరేకంగా అభియోగాలు చేసి ఉంటే సెక్షన్ 8—బీ, సెక్షన్ 8—సీ కింద పిటిషనర్లకు క్రాస్‌ఎగ్జామ్ చేసేందుకు ఎందుకు అనుమతివ్వలేదు. రాజకీయంగా దెబ్బతీయడం, తెలంగాణ సాధనకు ఉద్యమించిన నేత ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి' అని కేసీఆర్ తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు పేర్కొన్నారు.

తూచ్... ఢిల్లీకి వెళ్లలే!

- సుదర్శన్‌రెడ్డి నామినేషన్‌కు హాజరుకాని రేవంత్
- అధిష్ఠానం పిలవలేదా? బీజేపీకి భయపడ్డారా?
- ప్రభుత్వ, రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చ

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి గురువారం నాటి తన ఢిల్లీ టూర్ రద్దు చేసుకోవడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. వాస్తవానికి ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి బీ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం హాజరు కావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఢిల్లీ టూర్ షెడ్యూల్ కూడా ఖరారైంది. వెళ్లడానికి › 10వ పేజీలో



మాట తప్పిన సర్కారుకు
తడాఖా చూపిస్తాం

ఇక తాడోపేడో తేల్చుకునే దాకా వదలబోము: ఉద్యోగ జేఏసీ

- అక్టోబర్ 12న ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపడుతాం
- సెప్టెంబర్ 1న ఓపీఎస్ కోసం పెద్దఎత్తున ధర్నా
- మమ్మల్ని రోడ్డు మీదకు లాగితే ఆపేవారెవరూ ఉండరు
- రేవంత్ ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల జేఏసీ హెచ్చరిక

› 3

ప్రభుత్వోద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

- ఆరోపణలు వస్తే 3 నెలల్లో విచారణ జరగాలి
- గరిష్ఠంగా 6 నెలల్లో తుది నిర్ణయం తీసుకోవాలి
- 15 రోజుల్లో చార్జ్‌మెమో ఇవ్వాలని ఆదేశం
- ఉద్యోగులపై ఆరోపణలకు ప్రభుత్వం గడువు
- మార్గదర్శకాలు విడుదల చేసిన చీఫ్ సెక్రటరీ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం గురువారం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ జీవో ఎం.ఎస్. నం.175 ఆధారంగా పలు గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఈ › 10వ పేజీలో

'ఇచ్చంపల్లి'తో తెలంగాణ
మునుగుడే!

ఎగువన గోదావరిని ఎత్తిపోయలేం.. దిగువన నీటిని వాడుకోలేం!



- నీళ్లకు కేంద్రం ముందు మోకరిల్లాల్సిందే
- ఇక ఎల్లకాలం ఆయకట్టు ఎండిపోవుడే
- బరాజ్ కడితే 23 వేల ఎకరాలు మునక
- 9 గ్రామాల్లోని 21,575 మందికి నష్టం
- కాలువ కోసం మరో 18,065ఎకరాలు
- ఎత్తు పెంచితే మూడురెట్లు అధిక ప్రభావం
- ఇంత చేసినా తెలంగాణకు దక్కేది శూన్యం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): గోదావరి నదిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతున్నది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి బరాజ్‌కు మొగ్గు చూపుతున్నది. మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతులు చేసి వాడుకోవాల్సింది పోయి ఇచ్చంపల్లి బరాజ్ నిర్మాణం చేపడితే తెలంగాణకు శాశ్వతంగా తీరని నష్టం వాటిల్లుతుందని సాగునీటి రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు తీరని విఘాతం ఏర్పడుతుందన్నారు. ప్రాజెక్టు › 2వ పేజీలో



మదురై జిల్లా పరపత్తిలో గురువారం జరిగిన టీవీకే బహిరంగసభకు హాజరైన అశేషజనవాహిని

బీజేపీ నా భావజాల శత్రువు

- ఫాసిస్టు శక్తులతో ఎన్నటికీ చేతులు కలపను
- ఆర్ఎస్ఎస్ ముందు మనం ఎందుకు తలవంచాలి
- ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా బీజేపీ గెలవదు
- తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయ్
- తమిళ బాధితులు, వారి వెతలు మోదీకి పట్టవు
- తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్ ధ్వజం

› 11

27వరకు మోస్తరు వర్షాలు

- **హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తేతెలంగాణ): రుతుపవన ద్రోణి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 27 వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పలు జిల్లాల్లో కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది. గురువారం పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. శుక్రవారం మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని తెలిపింది. గడిచిన 24గంటల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనథ్‌లో అత్యధికంగా 2.95 సెం.మీ, ములుగు జిల్లా వాజేడులో 2.55 కన్నాయిగూడెంలో 2.33, గట్టులో 1.61 సెం.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలలో 1.60 సెం.మీ వర్షపాతం నమోదైంది.

బిడ్డర్ల ఈఎండీ మొత్తాన్ని జప్తు చేయాలి

- **సీఎస్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి లేఖ**

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రైస్‌మిల్లుల్లోని ధాన్యం తరలించేందుకు టెండర్లు దక్కించుకున్న బిడ్డర్లు విఫలమైనందున ఈఎండీ మొత్తాన్ని జప్తు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పౌరసరఫరాలశాఖ అధికారులు సెంట్రల్ నిబంధనలకు విరుద్ధంగా కొంత మొత్తాన్నే మాత్రమే జప్తు చేసి.. ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రూ.385 కోట్లల్లో రూ.60 కోట్లను స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు లేఖ రాశారు. నిబంధనల ప్రకారం టెండర్లు దక్కించుకున్న బిడ్డర్లు 90రోజుల్లో ధాన్యం ఎత్తాల్సి ఉంటుందని ప్రస్తావించారు. కానీ గడువు ముగిసి 475 రోజులైనా ధాన్యాన్ని తరలించకపోవడంతో ప్రజాధనానికి గండిపడుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ అసెంబ్లీలో లేవనెత్తినా.. ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకున్నదని గుర్తుచేశారు.


కేసీఆర్ అద్భుత సీఎం!

ఆయన ప్రతిభకు ప్రాధాన్యమిస్తారు • అక్కడ లంచాలకు ఆస్కారం లేదు

- **అందుకే తీవ్ర పోటీలో కూడా మాకు అవకాశం**
- **సచివాలయం ఓ అత్యద్భుత నిర్మాణం**
- **అది కేసీఆర్ విజన్‌కు నిదర్శనం**
- **ఆర్కిటెక్ట్ పొన్నీ ఎం కాన్సెసావో**



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన విజన్ ఉన్న వ్యక్తి అని, ఆయన సీఎంగా ఉన్నప్పుడు తెలంగాణకు అత్యద్భుతమైన సచివాలయాన్ని అందించారని ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ పొన్నీ ఎం కాన్సెసావో కొనియాడారు. కేసీఆర్ ప్రతిభను నమ్మే వ్యక్తి అని, ఆయన సర్కారులో లంచాలకు ఆస్కారం లేదని ఆమె పేర్కొన్నారు. అందుకే దేశంలోని ప్రఖ్యాత ఆర్కిటెక్ట్‌లతో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ సచివాలయానికి డిజైన్లు రూపొందించే అవకాశం తమకు దక్కిందని చెప్పారు. ఆస్కార్ అండ్ పొన్నీ ఆర్కిటెక్ట్స్ సహ వ్యవస్థాపకురాలు, సచివాలయానికి డిజైన్లు రూపొందించిన ముఖ్య ఆర్కిటెక్ట్ పొన్నీ ఎం కాన్సెసావో తాజాగా మీడియా దిగ్గజం జెన్నిఫర్ ఆరుల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ పాలనను ప్రశంసలతో ముంచెత్తారు. తెలంగాణకు అద్భుతమైన సచివాలయాన్ని నిర్మించే అవకాశం లభించడం, ముఖ్యంగా కేసీఆర్ వద్ద పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. దేవుడి దయవల్ల తమకు ఈ భాగ్యం లభించిందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. 'తెలంగాణ సచివాలయం సుమారు రూ. 1200 కోట్ల ప్రాజక్టు. దాదాపు 10-12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనాన్ని రెండేళ్లలో పూర్తిచేశాం. కేసీఆర్ వంటి గొప్ప ముఖ్యమంత్రితో పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నా. నేను ఇంతటి గొప్ప సచివాలయానికి ప్రిన్స్‌పల్ ఆర్కిటెక్ట్‌గా డిజైన్లు ఇచ్చి, నిర్మించే భాగ్యం లభించిన ఏషియాలోనే మొదటి మహిళను కావడం గర్వంగా ఉంది. ఈ విషయం నాకు మీడియా ద్వారా తెలిసింది. నేను ఎంతో గర్వంగా ఫీలవుతున్నా. తెలంగాణ సచివాలయం ఎంతో అందమైన, గొప్ప నిర్మాణంగా పేరుగాంచింది. డిజైన్ల రూపకల్పనకు బెస్ట్ ఆఫ్ ది బెస్ట్స్ ఆర్కిటెక్ట్‌ను ఎంపికచేసేందుకు దేశంలోని 20-30మంది ప్రముఖ ఆర్కిటెక్ట్‌లను పిలిచారు. ఇది ఎంతో ఒత్తిడితో కూడిన పోటీ. అందులో నన్ను ఎంపికచేయడం ఎంతో లక్కీగా భావిస్తున్నా' అని పొన్నీ పేర్కొన్నారు.



కేసీఆర్ ప్రతిభకు ప్రాధాన్యమిస్తారు

తీవ్రమైన పోటీలో కాంట్రాక్టు దక్కించుకునేందుకు లంచం ఇవ్వాల్సిరాలేదా? ఎలా మేనేజ్ చేశారు? అని పొన్నీని ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని ఆమె స్పష్టంచేశారు. ఆర్కిటెక్ట్‌ల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరిగిందని, దీని క్రెడిట్ అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకి ఇవ్వక తప్పదని పేర్కొన్నారు. ఆయన ప్రతిభను నమ్మే గొప్ప వ్యక్తి అని కితాబిచ్చారు. ప్రభుత్వ భవనాలను సహజంగా మూస పద్ధతిలో నిర్మిస్తారని, కానీ అప్పటి సీఎం కేసీఆర్ మాత్రం తమ రాష్ట్రానికి సకల సౌకర్యాలతో, అన్ని ప్రభుత్వ శాఖలు ఒకేచోట ఉండే విధంగా ఓ అద్భుతమైన విజన్‌తో సచివాలయాన్ని నిర్మించారని చెప్పారు. నిర్మాణాలను ఎప్పటికప్పుడు తానే స్వయంగా పర్యవేక్షించేవారని పేర్కొన్నారు. అంతేకాదు, డిజైన్ల దగ్గర్నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు అన్ని బాధ్యతలు చూసేందుకు ఓ ఉన్నతస్థాయి సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వాధినేతగా అన్ని అంశాలనూ ఆయన ఎంతో శ్రద్ధగా పరిశీలించేవారని గుర్తుచేశారు. కేసీఆర్ పర్యవేక్షణలో, టెక్నికల్ కమిటీ ఆధ్వర్యంలో తాము పనిచేసినట్టు తెలిపారు. కేసీఆర్ ఎంతో శ్రద్ధతో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ, ఏ లోటూ లేకుండా భవనాన్ని అత్యాధునిక పద్ధతిలో నిర్మించాలనే సంకల్పంతో ఈ డిజైన్‌ను ఎంపిక చేశారని చెప్పారు.

స్టేట్ ఆఫ్ ఆర్ట్ బిల్డింగ్‌గా సచివాలయం

గతంలోని పాత సచివాలయంలో 40కిపైగా భవనాలు ఉన్నప్పటికీ అందులో ఫైర్ సేఫ్టీ సహా అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని పొన్నీ పేర్కొన్నారు. ఒక క్రమపద్ధతిలో కాకుండా ఒక్కో శాఖ ఒక్కో భవనంలో ఉండేదని పేర్కొన్నారు. దీంతో మంత్రులు, అన్ని శాఖల విభాగాధిపతులు, అన్ని శాఖల కార్యాలయాలు ఒకే గూటికింద ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ నూతన సచివాలయానికి అంకురార్పణ చేశారని వివరించారు. ఆయన విజన్‌కు అనుగుణంగా సచివాలయ డిజైన్లను రూపొందించినట్టు పేర్కొన్నారు. అన్ని శాఖలు ఒకే భవన సముదాయంలో ఉండే విధంగా సచివాలయాన్ని నిర్మించామని, అది ఒక అద్భుతమైన స్టేట్ ఆఫ్ ఆర్ట్ బిల్డింగ్‌గా పేరుగాంచిందని పొన్నీ వివరించారు.

తెలంగాణ ప్రత్యేకతకు నిదర్శనం: కేటీఆర్

తెలంగాణ సచివాలయం ఓ ప్రాజక్టు మాత్రమే కాదని, అది తెలంగాణ ప్రత్యేక గుర్తింపును ప్రతిబింబించే ఓ మైలురాయి వంటిదని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గొప్ప దార్శనికతతో ప్రణాళికలు రూపొందించి, సాంకేతిక కమిటీ మార్గదర్శకత్వంలో దాన్ని నిర్మించినట్టు ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. నిర్మాణం సరిగ్గా జరుగుతుందా, లేదా అని నిర్ధారించుకోడానికి కేసీఆర్ స్వయంగా అనునిత్యం పర్యవేక్షించే వారని తెలిపారు. కేసీఆర్ వ్యక్తిత్వం, ఆయన విజన్ గురించి తన అనుభవాలను పంచుకున్నందుకుగాను ఆర్కిటెక్ట్ పొన్నీ ఎం కాన్సెసావోకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

'ఇచ్ఛంపల్లి'తో మునుగుడే!

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ప్రయోజనాలను కేంద్రం తుంగలో తొక్కుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కేంద్రం భావిస్తున్నది. ఇందులో భాగంగా ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్ నిర్మించి, అక్కడి నుంచి జలాలను కావేరి బేసిన్‌కు తరలించాలని సన్నాహాలు చేస్తున్నది. ఇచ్ఛంపల్లి వద్ద 95 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ను నిర్మిస్తే నీటినిల్వ సామర్థ్యం 59.33 టీఎంసీలు ఉండగా, లైవ్ స్టోరేజీ 20టీఎంసీలకే పరిమితం అవుతుందని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు చెప్తున్నారు. ఈ నిర్మాణంతో దాదాపు 23 వేల ఎకరాలు ముంపునకు గురవుతుందని, మంథని నియోజకవర్గం పరిధిలోని 9 గ్రామాలు మునిగిపోతాయని, 21,575 మంది నిర్వాసితులు అవుతారని లెక్కగట్టారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే. ఇక నీటి తరలింపు కోసం తెలంగాణ అదనంగా వేలాది ఎకరాలను కోల్పోవాల్సి ఉంటుంది. ఇచ్ఛంపల్లి బరాజ్ నుంచి మొదట నీటిని నాగార్జునసాగర్‌కు మళ్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇచ్ఛంపల్లి నుంచి వరంగల్, ఖమ్మం, నల్లగొండ మీదుగా నాగార్జునసాగర్ వరకు 315.81 కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉంటుంది. దీని నిర్మాణానికి 18,661ఎకరాలను సేకరించాల్సి వస్తుందని అంచనా. ఇవన్నీ దేవాదుల, ఎస్సారెస్పీ, సాగర్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన ఆయకట్టు భూములే. ఈ రకంగానూ తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోనున్నది. మధ్యలో 2 రిజర్వాయర్లను ప్రతిపాదిస్తున్నారు. వీటికోసం మరో 20వేల ఎకరాల వరకు సేకరించాల్సి ఉంటుంది.

ఎత్తు పెంచితే తెలంగాణ చిత్తే!

గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్దేశిత నీటి లక్ష్యాలు నెరవేరాలన్నా, ఎగువన కాళేశ్వరం ప్రాజెక్టు నీటి అవసరాలు తీరాలన్నా ఇచ్ఛంపల్లి వద్ద కనీసం 30 నుంచి 40 టీఎంసీల వరకు లైవ్ స్టోరేజీ సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మేరకు బరాజ్‌ను నిర్మిస్తే ఇప్పుడున్న అంచనాలకు మూడింతలకుపైగా భూమి ముంపునకు గురవుతుందని.. ముంపు గ్రామాల సంఖ్య, నిర్వాసితుల సంఖ్య కూడా పెరుగుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు 112 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ను నిర్మిస్తే 91 వేల ఎకరాల పట్టా భూములు, 23వేల ఎకరాల అటవీభూమి, 65 గ్రామాలు ఆగమవుతాయన్నారు. 118 మీటర్లతో నిర్మిస్తే 1.51లక్షల ఎకరాల పట్టాభూములు, 72వేల ఎకరాల అటవీ భూమి, 74గ్రామాలు ముంపునకు గురవుతాయని హెచ్చరిస్తున్నారు. 115మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మిస్తే తెలంగాణలో 53,352 ఎకరాలు మునగడంతోపాటు దక్షిణకాశీగా పేరొందిన కాళేశ్వరం దేవాలయం మెట్ల వరకు ముంపు వస్తుంది. సిరోంచ పట్టణం చుట్టూ నీరు నిలిచి ఉంటుంది. నిజాం జమానాలో గుట్టపై కట్టిన గెస్ట్‌హౌస్ తప్ప ఏదీ మిగలదు. మహదేవపూర్, మంథని పట్టణాల దగ్గరికి నీరు చేరనుంది. చెన్నూర్‌కు ముంపు తప్పదు. 51 గ్రామాలు ముంపుకు గురయ్యే ప్రమాదమున్నది. గోదావరిఖని సింగరేణికి సైతం ముంపు తప్పదని తెలంగాణ ఇంజినీర్లు తేల్చిచెప్తున్నారు.

దక్కే ప్రయోజనాలు శూన్యం

గోదావరి-కావేరి రివర్ లింక్ ప్రాజెక్టుతో ఇటు ముంపు విషయంలోనూ, అటు జలాల వినియోగంలోనూ తెలంగాణకు తీవ్రంగా నష్టం వాటిల్లనున్నది. అయినా ఈ ప్రాజెక్టు ద్వారా ఒనగూరే ప్రయోజనాలు నామమాత్రమే. నికరంగా తెలంగాణకు 45, ఏపీకి 44, తమిళనాడుకు 38, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 16 టీఎంసీలను అందించాలని కేంద్రం ప్రతిపాదించింది. అంటే తెలంగాణ వాటా కేవలం 27 శాతం. కృష్ణా నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాహాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

ఎగువన ఎత్తిపోసుకోలేం!

మేడిగడ్డకు బదులు ఇచ్ఛంపల్లి ఎత్తుపెంచి అక్కడి నుంచే గోదావరి జలాలను తెలంగాణ వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ కొత్త వాదన ఎత్తుకున్నది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వంతపాడుతున్నది. వినడానికి ఇది బాగానే ఉన్నా, ఆచరణలో మాత్రం కష్టసాధ్యమని ఇంజినీర్లు చెప్తున్నారు. గోదావరికి వరద వచ్చినప్పుడు, తెలంగాణకు జల అవసరాల సమయంలో నీటిని ఎత్తిపోసుకోవడం మేడిగడ్డ బరాజ్ ప్రధాన ఉద్దేశం. అంటే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఏ ఆయకట్టుకు ఎక్కడ నీళ్లు తక్కువ పడినా అప్పుడు మోటర్లు ఆన్ చేసి ఎత్తిపోసుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ఇచ్ఛంపల్లి బరాజ్ రివర్ లింక్ ప్రాజెక్టు కాబట్టి జాతీయ ప్రాజెక్టుగానే ఉంటుందని, నిర్వహణ మొత్తం కూడా కేంద్రం చేతుల్లోనే కొనసాగుతుందన్నారు. అలాంటప్పుడు మన ఆయకట్టు అవసరాలకు ఎప్పుడంటే అప్పుడు ఎత్తిపోసుకునేందుకు వీలుండదని అంటున్నారు.

దిగువన వాడుకోలేం!

ఇచ్ఛంపల్లి దిగువన దుమ్ముగూడెం వరకు గోదావరి జలాలను సైతం తెలంగాణ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దుస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇచ్ఛంపల్లి దిగువన దేవాదుల కోసం 38 టీఎంసీలు, సమ్మక్కసాగర్ బరాజ్ నుంచి 47టీఎంసీలు, ప్రస్తుతం నిర్మిస్తున్న సీతమ్మసాగర్ నుంచి 67టీఎంసీలు, మోడికుంట 1.5 టీఎంసీలు ఇలా మొత్తంగా 153.5 టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులకు ఎగువన ఉన్న ఇచ్ఛంపల్లి నుంచే నీరు విడుదల కావాల్సి ఉంటుంది. జీసీ లింక్ ప్రాజెక్టు కేంద్రం పరిధిలో ఉంటుంది. కాబట్టి కేంద్ర అనుమతిస్తేనే ఇచ్ఛంపల్లి నుంచి దిగువకు జలాలు వస్తాయి. ప్రతి చుక్కకూ కేంద్రం ఎదుట తెలంగాణ మోకరిల్లాల్సిన దుస్థితి నెలకొంటుందని స్పష్టంగాతెలియజేస్తున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్ఛంపల్లి ప్రతిపాదనలను మానుకొని, మేడిగడ్డను రిపేర్ చేయించాలని కోరుతున్నారు.

గోదావరి నీటి లభ్యతపై స్పష్టత లేదు

- **జలాల మళ్లింపునకు ఛత్తీస్‌గఢ్ ససేమిరా**
- **ఆ రాష్ట్రం వినియోగించుకోని జలాలే తరలిస్తామంటున్న కేంద్ర ప్రభుత్వం**
- **బనకచర్ల లింక్‌కు ఏపీ కసరత్తు**
- **ప్రస్తుతం పరిస్థితి అంతా తారుమారు**
- **గోదావరి కావేరి లింక్‌పై తర్జనభర్జన**
- **నేడు రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ కన్సల్టేషన్ సమావేశం**



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తేతెలంగాణ): ఓ వైపు గోదావరిలో మిగులు జలాలే లేవని సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ తేల్చిచెబుతున్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీల జలాలనే తరలించేలా గోదావరి కావేరి (జీసీ) లింక్ ప్రాజెక్టును రూపొందించారు. తన వాటా జలాల మళ్లింపునకు ఛత్తీస్‌గఢ్ ససేమిరా అంటున్నది. ఇప్పుడు కొత్తగా మిగులు జలాలు ఉన్నాయంటూ పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఏపీ దూకుడుగా ముందుకు సాగుతున్నది. మొత్తంగా గోదావరిలో నీటిలభ్యతపై స్పష్టత కరువైంది. జీసీ లింక్‌పై పూర్తిగా సందిగ్ధత నెలకొన్నది. అనేక సాంకేతిక అంశాలపై బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం అన్ని రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ (నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ) కన్సల్టేషన్ మీటింగ్‌ను నిర్వహించనుండటం ఆసక్తిగా మారింది.

గోదావరి జలాల్లో మిగులన్నదే లేదు

బచావత్ ట్రిబ్యునల్ పూర్వ మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీ, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు చేసుకు న్న అంతర్రాష్ట్ర ఒప్పందాలనే 'ట్రిబ్యునల్ అవార్డు' గా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 75శాతం డిపెండబులిటీ అంటే కనీసం 4 ఏండ్లలో 3ఏండ్లపాటు నీటిలభ్యత ఉండటంతోపాటు, ఆయకట్టు రైతులకు విజయవంతంగా నీరందించగలిగేలా ఉండాలి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) లెక్కల ప్రకారం గోదావరి బేసిన్‌లో 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా సర్‌ప్లస్ వాటర్ ల భ్యత లేనేలేదు. 75 శాతం డిపెండబులిటీ ప్రకారం గోదావరిలో 3396.9 టీఎంసీల ప్రవాహాలు ఉండ గా, సగటు ప్రవాహాలు 4535.1 టీఎంసీలు. 75 శాతం కంటేపైగా ఉండే సగటు నీళ్లు కేవలం 1138.2 టీఎంసీలు మాత్రమే. ఇవి కూడా ట్రిబ్యునల్ కేటాయించిన మేరకు జలాలను ఎగువ రాష్ట్రా లు వినియోగించుకోకపోవడం వల్ల, ఆ మేరకు నీటి నిల్వ సామర్థ్యాలను పెంచుకోకపోవడం వల్లనే దిగువకు వెళ్తున్నాయి. ఆ విధంగా ఛత్తీస్‌గఢ్ దాదాపు 400 టీఎంసీలను, తెలంగాణ సైతం కాళేశ్వరం, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్, దేవాదుల తదితర ప్రాజెక్టులకు కేటాయించిన దాదాపు 400టీఎంసీల జలాలను పూర్తిగా వినియోగించుకోవడం లేదు. మహారాష్ట్ర, ఒడిశా సైతం కేటాయింపుల మేరకు జలాలను వినియోగించుకోవడం లేదు. బేసిన్ రాష్ట్రాలన్నీ నికర కేటాయింపుల మేరకు జలాలను వినియోగించుకుంటే 75శాతం డిపెండబులిటీ కింద దిగువన గోదావరిలో మిగులు జలాలన్నవే ఉండబోవు. ఇదే విషయాన్ని సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ గతంలోనే అధ్యయనం చేసి చెప్పాయి. కేంద్రం మాత్రం జాతీయ దృక్పథంతో గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఛత్తీస్‌గఢ్ తన వాటాలో వినియోగించుకోని 148 టీఎంసీల జలాలను కావేరికి తరలిస్తామని ప్రతిపాదనలు చేసింది. అంతవరకుబాగానే ఉన్నా ఇప్పటివరకు ఆ రాష్ట్రం నుంచి కేంద్రం ఎలాంటి అంగీకారం తీసుకోలేదు. ఇదిలావుంటే ఛత్తీస్‌గఢ్ సైతం తన వాటా జలాల మళ్లింపును వ్యతిరేకిస్తున్నది. వాటా జలాల వినియోగానికి ప్రాజెక్టుల కోసం ప్రతిపాదన లు చేస్తున్నది. ఈ విషయాన్ని కేంద్రానికి సైతం ఇటీవలే తెలియజేసింది. దీంతో ప్రస్తుతం జీసీ లింక్ ప్రాజెక్టు సందిగ్ధంగా మారింది. ఇదిలావుంటే కేంద్ర సంస్థల వాదనలకు భిన్నంగా గోదావరిలో మిగులు ఉన్నదంటూ చెబుతూ ఏపీ పోలవరం బనకచర్ల ప్రాజెక్టును తెరమీదకు తీసుకువచ్చింది. గోదావరిలో మిగులు జలాలే లేవని, జీసీ లింక్ ప్రాజెక్టు చేపడితే పోలవరానికి నీటిలభ్యత ఉండబోదని అభ్యంతరాలు వ్యక్తంచేసిన ఏపీనే ఇప్పుడు పీబీ లింక్‌ను చేపట్టడం కొసమెరుపు. గోదావరి నదిలో నీటి లభ్యతపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా కేంద్రం పట్టించుకున్న దాఖలాలేదు. గోదావరిలో నీటి లభ్యత ఎంత ఉంది? ట్రిబ్యునల్ ఆయా రాష్ట్రాలకు ఇప్పటికే చేసిన నీటి కేటాయింపులను మినహాయించగా అందుబాటులో ఉండే అదనపు జలాలు ఎన్ని? వాటిని వినియోగించుకోవచ్చా? లేదా? అన్నదానిపై స్పష్టతనివ్వాలని, ఆ తరువాతే నదుల అనుసంధానంపై దృష్టి సారించాలని రాష్ట్రాలు చేస్తున్న డిమాండ్లను పెడచెవిన పెడుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తన వాటా జలాలను వినియోగించుకుంటే జీసీ లింక్ భవిష్యత్ ఏమిటని గత టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో నిపుణులు సైతం ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జీసీ లింక్‌పై రాష్ట్రాలతో కన్సల్టెన్సీ మీటింగ్‌లో కూలంకషంగా చర్చించాలని నిర్ణయించారు.

ప్రగతి ఎజెండా నుంచి మరోసారి పోలవరం తొలగింపు

- **27నాటి సమావేశం నేడే**

హైదరాబాద్, ఆగస్టు21 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ నేతృత్వంలో నిర్వహించనున్న ప్రగతి సమావేశ ఎజెండా నుంచి పోలవరం ప్రాజెక్టు అంశాన్ని మరోసారి తొలగించారు. అంతేకాదు 27న నిర్వహించాలని నిర్ణయించిన సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకే ఏర్పాటు చేస్తూ రీ షెడ్యూల్ చేశారు. ఈ మేరకు రాష్ట్రాలకు కేంద్రం సమాచారం అందించింది. పోలవరం ప్రాజెక్టు ముంపుతోపాటు, పునరావాసం తదితర అంశాలపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలు అభ్యంతరాలను వ్యక్తంచేస్తున్నాయి. ఆయా అంశాలపై ప్రధాని మోదీ ఆధ్వర్యంలో గత మే 28న నిర్వహించిన ప్రగతి సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. ఎజెండాను చేర్చారు. ఆ తరువాత జూన్ 25వ తేదీకి వాయిదా వేశారు. అప్పుడు కూడా చివరి నిమిషంలో ఎజెండా అంశాల్లోంచి రెండోసారి సైతం తొలగించారు. తాజాగా ఈనెల 27వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు కూడా మళ్లీ తొలగించారు.

నేడు రాష్ట్రాలతో కన్సల్టేషన్ మీటింగ్

జీసీ లింక్ ప్రాజెక్టుపై శుక్రవారం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలతో 6వ కన్సల్టెంట్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్‌డబ్ల్యూడీఏ ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు సమాచారమిచ్చింది. ప్రాజెక్టుపై రాష్ట్రాలు లేవనెత్తుతున్న సాంకేతిక అంశాలపై చర్చించనున్నది. ఈ భేటీలో బేసిన్‌లోని తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలు పాల్గొననున్నాయి. ఇప్పటికే 5సార్లు కన్సల్టేషన్ సమావేశాలను నిర్వహించినా ఏకాభిప్రాయం కుదరలేదు.

బనకచర్ల ఏపీకి భారమే

- **చంద్రబాబు పేరు కోసమే ఆ ప్రాజెక్టు**
- **మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మాజీ మంత్రి డీఎల్ రవీంద్రరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల వల్ల ఏపీకి ఎలాంటి ప్రయోజనం ఉండదని, అది రాష్ట్రానికి ఆర్థిక భారంగా మారుతుందన్నారు. చంద్రబాబుకు పేరు రావాలనే ఉద్దేశంతోనే బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నారన్నారు. రాయలసీమకు రూ.3వేల కోట్లతో రాజోలు నుంచి నీళ్లిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, దీనికి డబ్బులు లేనప్పుడు రూ.80వేల కోట్లతో బనకచర్లను ఎలా పూర్తి చేస్తారని డీఎల్ రవీంద్రరెడ్డి ప్రశ్నించారు. ఏపీలో కనీసం పారసిటమాల్ మాత్రలు కూడా పంపిణీ చేసే పరిస్థితి లేదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని రవీంద్రరెడ్డి విమర్శించారు.

లోకం పోకడ



నిద్రలో నడిచే అలవాటు కాదు అక్కా యూరియాకు బయల్దేరాడు!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34.0°c	24.0°c
ఆదిలాబాద్	32.5°c	22.0°c
వరంగల్	32.0°c	23.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
మెదక్	31.0°c	24.1°c
నల్లగొండ	31.0°c	23.0°c
నిజామాబాద్	30.4°c	23.3°c
హైదరాబాద్	29.8°c	21.8°c
రంగారెడ్డి	29.6°c	20.3°c
మహబూబ్‌నగర్	29.0°c	22.0°c


ఫిరాయింపు ఎమ్మెల్యేలకు త్వరలో నోటీసులు!

- **న్యాయనిపుణులతో చర్చల అనంతరం స్పీకర్ నిర్ణయం**

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చేందుకు స్పీకర్ సిద్ధమైనట్టు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయ సలహా తీసుకున్న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో జూలై 25న తీర్పును వెలువరించిన న్యాయస్థానం మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించినట్టు సమాచారం. ఆ మేరకు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కృష్ణమోహన్‌రెడ్డి, దానం నాగేందర్, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, సంజయ్‌కుమార్, మహిపాల్‌రెడ్డిపై అనర్హత వేటువేయాలని బీఆర్‌ఎస్ కోరింది. వారందరికీ నోటీసులు ఇచ్చి, వివరాలు తీసుకున్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా వీరిలో కొందరు తాము కాంగ్రెస్‌లో చేరలేదని ప్రకటించారు.

స్పీకర్ నుంచి నోటీసులు అందలేదు: తెల్లం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ.. తనకు ఎటువంటి నోటీసులు రాలేదని చెప్పారు. భద్రాచలంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగానే ఉన్నట్టు తెలిపారు. అటువంటి పరిస్థితి వస్తుందని అనుకోవడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భద్రాచలం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు.



భూ నిర్వాసితులకు వాట్సాప్ ద్వారా నోటీసులు

- **బెదిరింపులకు పాల్పడుతున్న అధికారులు**

మక్తల్, ఆగస్టు 21 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు రెవెన్యూ అధికారులు వాట్సాప్ ద్వారా నోటీసులు జారీ చేసిన ఉదంతం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాచ్‌వార్‌లో వెలుగుచూసింది. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌తోపాటు నారాయణపేట నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం రైతుల నుంచి భూములు సేకరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.14లక్షల పరిహారం ఇస్తే తీసుకోబోమని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి న్యాయమైన పరిహారం ఇస్తేనే తమ భూములు ప్రభుత్వానికి ఇస్తామని తేల్చిచెప్పారు. భూములు కోల్పోతున్న రైతులు భూసేకరణకు సంబంధించిన నోటీసులు తీసుకోకపోవడంతో వారిని అనేక రకాలుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గురువారం కాచ్‌వార్‌కు వెళ్లి రైతుల వ్యక్తిగత వివరాలు సేకరించి వారి మొబైల్ ఫోన్‌కు అధికారులు వాట్సాప్ ద్వారా బలవంతంగా నోటీసులు అందజేశారు.

ఘోష్ నివేదికను రద్దు చేయండి

రాజకీయ కుట్రతోనే కమిషన్ నియామకం • నిబంధనలకు విరుద్ధంగా అధికారాలు • పూర్తిగా ఏకపక్షంగా సాగిన కమిషన్ విచారణ

సాక్షిగా పిలిచి తప్పు చేసినట్టు తేల్చడం ఏమిటి

మా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా నివేదిక

- కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టానికి తూట్లు
- సెక్షన్ 8బీ, 8సీ కింద నాకు అవకాశం ఇవ్వలేదు
- క్రాస్ ఎగ్జామినేషన్ లేకుండానే దోషులుగా తేల్చారు
- పూర్తి నివేదిక ఇవ్వాలని కోరితే ప్రభుత్వం స్పందించలేదు
- బీఆర్ఎస్ ప్రభుత్వమే లక్ష్యంగా పీపీటీతో సర్కారు దాడి
- హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు వేర్వేరుగా పిటిషన్లు
- క్యాబినెట్ ఆమోదంతోనే రీడిజైనింగ్ చేశామని స్పష్టం
- రాష్ట్రంలో సాగు పెంపు కోసమే కాళేశ్వరం చేపట్టాం
- ఒకప్పుడు కరువు, వలసలతో తల్లడిల్లిన తెలంగాణ
- కాళేశ్వరంతో 'దేశానికే ధాన్యాగారం'గా మారింది
- పిటిషన్‌లో పేర్కొన్న మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు





హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక పూర్తి రాజకీయ నివేదికలా ఉన్నదని, దానిని రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు హైకోర్టును కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలో భాగంగా న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కమిషన్ చట్టవిరుద్ధంగా విచారణ జరిపిందని, తమను సాక్షులుగా పిలిచి, క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశమే ఇవ్వకుండా ఏకపక్షంగా నివేదికను సమర్పించిందన్నారు. పూర్తి నివేదికను ఇవ్వాలని తాము కోరినా స్పందించకుండా, మీడియాకు లీకులు ఇస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రస్తుత ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నదన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని, మీడియాలో తమపై దుష్ప్రచారం చేయకుండా కట్టడి చేయాలని మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ జరిగింది.

కంటితుడుపుగానే ప్రాణహిత-చేవెళ్ల

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్ నిర్మాణంలో డిజైనింగ్, ప్రణాళికల్లో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను రద్దు చేయాలని పిటిషన్లలో కోరారు. కమిషన్ జరిపిన విచారణ తీరును తీవ్రంగా తప్పుపట్టారు.

> రాజకీయ కుట్రతోనే కమిషన్ నియామకం జరిగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ కీర్తిని కించపర్చాలన్న దురుద్దేశంతోనే కమిషన్ ఏర్పాటైందని తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ ఏడాది జూలై 31న ఇచ్చిన నివేదికలో మాజీ సీఎం కేసీఆరే స్వయంగా ప్రాజెక్ట్ ప్రదేశాలను ఎంచుకున్నారని, క్యాబినెట్ ఆమోదం లేకుండా పరిపాలనా ఆమోదాలు ఇచ్చారని పేర్కొనడాన్ని కేసీఆర్ సవాల్ చేశారు.

కాంట్రాక్టర్లకు అనుకూలంగా, అదనపు పనులు మౌఖిక ఆదేశాల ద్వారా అప్పగించారని కమిషన్ ఎత్తిచూపడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో కంటితుడుపు చర్యగానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించారే తప్ప మరేమీ లేదని తేల్చిచెప్పారు. వాస్తవానికి ఆ ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పిందని, అంతర్ రాష్ట్ర సమస్యలు, నీటి లభ్యత లేకపోవడం తదితర కారణాలతో ప్రాజెక్టు ముందుకు సాగలేదన్నారు.

అన్ని రకాల అనుమతులతోనే కాళేశ్వరం

2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్ ద్వారా సర్వే చేయించి, ఆ నివేదిక ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌లతో కూడిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణం చేయాలనే నిర్ణయానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. రీ డిజైనింగ్, పేరు మార్పునకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సెంట్రల్ వాటర్ కమిషన్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ, సంబంధిత సంస్థల నుంచి అనుమతులు ఉన్నాయన్నారు. రికార్డు సమయంలోనే ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫలితంగా సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చుకోగలిగామన్నారు. ఒకప్పుడు కరువు, రైతుల ఆత్మహత్యలు, వలసలకు ఆలవాలమైన తెలంగాణ ప్రాంతం అతి తక్కువ సమయంలోనే 'దేశానికే ధాన్యాగారం'గా ఎదిగిందని పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం

భారీ వర్షాలు, ఇతర సాంకేతిక కారణాలతో మేడిగడ్డ ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగిపోయిందన్నారు. దీనిపై మీడియాలో వచ్చిన వార్తలు, కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారంతో బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. బరాజ్‌లో నిరంతరం పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయడం వల్ల నిర్మాణానికి నష్టం జరిగిందని, ప్రణాళిక నుంచి నిర్మాణం వరకు అనేక ఆర్థిక, విధానపరమైన లోపాలు జరిగాయని, ఇవి రాజకీయ నాయకత్వం నిర్ణయాల వల్ల జరిగాయని కమిషన్ నివేదికలో పేర్కొనడాన్ని తప్పుబట్టారు. ఇది తమ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలా ఉందని కేసీఆర్, హరీశ్ రావు పేర్కొన్నారు. కమిషన్ నివేదిక ప్రతిని పిటిషనర్లకు అందజేయకుండానే ప్రభుత్వం మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నదని, దురుద్దేశపూరితంగా సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని వెల్లడించారు. తక్షణమే జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్‌లో కోరారు. ఆధారాలు లేకుండా కేసీఆర్ సారథ్యంలోని గత ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రతోనే కమిషన్ ఏర్పాటు జరిగిందన్నారు. ఈ కుట్రలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో సాగు పెంపు కోసమే..

3బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1531 కిలోమీటర్ల కాలువలు, 38 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 530 మీటర్ల ఎత్తిపోతల వ్యవస్థతో 240 టీఎంసీల నీటి వినియోగం కోసమే ప్రాజెక్టు నిర్మాణం చేసినట్టు పిటిషన్‌లో వివరించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నీటిపారుదల సామర్థ్యం, సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు రాష్ట్ర తాగునీటి, పారిశ్రామిక అవసరాల కోసమేనని వెల్లడించారు. అధికార పార్టీ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఏదో ఒక సాకుతో ప్రాజెక్టుకు అడ్డంకులు కల్పించిందని, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేసి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలుకు ప్రయత్నించిందని వివరించారు. డిజైనింగ్, ఇంజినీరింగ్ అన్నీ చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని వివరించారు. మేడిగడ్డ బరాజ్ వద్ద ఒక్క పిల్లర్ కుంగిపోడంతో మొత్తం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపైనే అధికార కాంగ్రెస్ పెద్దలు దుష్ప్రచారం ప్రారంభించారని తెలిపారు. పలు కోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉన్న నివేదికను ఆధారంగా చేసుకుని.. సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఈ నెల ఆగస్టు 4న నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పక్షపాతంతో, ముందస్తు వ్యూహంతో తమ పరువుకు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని కోర్టుకు నివేదించారు.

క్రాస్ ఎగ్జామిన్‌కు ఆస్కారం ఇవ్వలేదు

విచారణ కమిషన్లు కేవలం వాస్తవాలను గుర్తించి నిజనిర్ధారణ నివేదికలు మాత్రమే ఇవ్వాలని పిటిషన్‌లో వివరించారు. ఆ సిఫార్సులు పరిపాలన, చట్టపరమైన చర్యలకు దోహదపడాలేగానీ గత పాలకుల ప్రవర్తనను లక్ష్యంగా చేసుకోడానికి కాదని తెలిపారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ - 1952 ప్రకారం కమిషన్‌కు వాస్తవాలు కనుగొనే అధికారం మాత్రమే ఉందని, దోష నిర్ధారణ చేసే అధికారంగానీ, పలానా వ్యక్తి తప్పు చేశారని శిక్ష విధించే అధికారంగానీ లేదన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించిందన్నారు. చట్టంలోని సెక్షన్ 8-బీ, 8-సీ ప్రకారం, ఒక వ్యక్తి ప్రవర్తనపై దర్యాప్తు చేపట్టినా లేదా ఆ వ్యక్తి ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉన్నప్పుడు ఆ వ్యక్తికి ముందుగానే నోటీసు ఇవ్వాలనే ప్రాథమిక న్యాయ సూత్రాన్ని కమిషన్ తుంగలోకి తొక్కిందన్నారు. ఆ వ్యక్తి సాక్ష్యాలు సమర్పించే అవకాశం ఇవ్వాలని, ఇతర సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేసే హక్కు కల్పించాలని, ఇవేమీ లేకుండా కమిషన్ ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా నివేదికలో తమపై పలు అభియోగాలు మోపిందన్నారు.

> కమిషన్ నివేదిక గురించి మీడియాకు పదే పదే చెప్పడం, పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ఇవ్వడం వంటివి చేయడం కేవలం గత పాలకుల ప్రతిష్టను ప్రజల్లో చులకన చేయడమేనని వివరించారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే కమిషన్ నివేదికను రద్దు చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారమూ చెల్లదు

కమిషన్‌కు శిక్ష విధించే అధికారం/బాధ్యత లేదని రామకష్ణ దాల్మియా కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు చెప్పిందని ఈ సందర్భంగా ఉదహరించారు. కిరణ్ బేడీ కేసులో ఎంక్వయిరీస్ ఆఫ్ కమిషన్ యాక్ట్ లోని 8-బీ అనే సెక్షన్‌ను విధిగా అమలు చేయాలని కూడా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. స్టేట్ ఆఫ్ బీహార్ వర్సెస్ ఎల్ కే అద్వానీ కేసులో కూడా సుప్రీంకోర్టు, కమిషన్ విచారణ చేపట్టాక ఏ వ్యక్తి ప్రతిష్ట అయినా దెబ్బతినే అవకాశముంటే విచారణ దశలోనే ఆ వ్యక్తి వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలనే హక్కు కాలరాయకూడదని చెప్పిందని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకుని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం గత ఏడాది మార్చి 14న జారీ చేసిన జీవో 6ను, కమిషన్ జూలై 31వ తేదీన సమర్పించిన నివేదికను రద్దు చేయాలని కోరారు.

> నివేదికను ఆధారంగా చేసుకుని జరుగుతున్న ప్రచారాని ్న కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. తమపై చేసిన తీవ్ర వ్యాఖ్యలు, మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారం న్యాయప్రక్రియకు విరుద్ధమని, తుది తీర్పు వెలువడే వరకు కమిషన్ నివేదిక అమలును నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు.

ఎన్నికల్లో ఇదొక రాజకీయ అస్త్రం

శాసనసభకు 2023లో జరిగిన ఎన్నికలప్పుడు కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసమే తనపై దుష్ప్రచారం చేసిందని కేసీఆర్ ఆరోపించారు. 2023లో భారీ వరదలు, ఇతర సాంకేతిక కారణాల వల్ల మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగిపోయిందని, అదేమీ నిర్మాణ లోపం కాదని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం కేసీఆర్ వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నారని, ప్రాజెక్టు ఖర్చులు పెరిగాయని, అధికారిక ప్రక్రియను అమలు చేయలేదనే కమిషన్ చేసిన ఆరోపణలు, అభియోగాలు తన ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని వివరించారు. విచారణ కమిషన్ తన వాదన వినకుండా, తనపై నేరపూరిత వ్యాఖ్యలు చేయడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో వెల్లడించారు. తనను కేవలం సాక్షిగా పిలిచి, అభియోగాలు మోపడం ద్వారా కమిషన్ మోసగించిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఇవన్నీ జరిగాయని వివరించారు.

పిటిషన్‌లోని ముఖ్యాంశాలు..

కాళేశ్వరం కమిషన్ రిపోర్టును సవాల్ చేసేందుకు పిటిషన్‌లో పేర్కొన్న ప్రధాన కారణాలు..

1) కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణంలో జరిగిన నిర్లక్ష్యం, అవకతవకలు, లోపాలపై విచారించి, బాధ్యులను గుర్తించేందుకు 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం- 1952' మేరకు 2024 మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిషన్ సుప్రీం కోర్టు గత తీర్పులను ఉల్లంఘించి విచారణ జరిపి, నివేదికను సమర్పించింది. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, ఏకపక్షం, రాజ్యాంగ వ్యతిరేకం.

- కమిషన్ 2025 జూలై 31న నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఆగస్టు 4న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇచ్చారు. అందులో నాకు (కేసీఆర్) వ్యతిరేకంగా, అవమానకరంగా, పరువుకు భంగం కలిగించేలా, పక్షపాతంగా, చట్టవిరుద్ధమైన తీరులో మాట్లాడారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టంలోని 8బీ, 8సీ సెక్షన్ల కింద నాకు నోటీసులు ఇవ్వకుండానే, నాకు వ్యతిరేకంగా, ఉద్దేశపూర్వకంగా, చట్టవిరుద్ధంగా, కుట్రపూరితంగా, పక్షపాతంతో, ముందస్తు ప్రణాళికతోనే కమిషన్ నివేదికను సమర్పించింది. అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. కాబట్టి ఆ నివేదికను రద్దు చేయాలి.
- కమిషన్ నివేదిక కాపీని నాకు అందించకుండానే బహిర్గతం చేయడం వల్ల నా ప్రతిష్టకు భంగం కలిగింది. దీనిని బట్టి ప్రతివాదుల చర్య ఏకపక్షమని, చట్ట విరుద్ధమని స్పష్టంగా వెల్లడవుతున్నది. ముందస్తు కుట్రలో భాగంగా జరుగుతున్న ఈ ప్రక్రియ రాజ్యాంగం కల్పించిన సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే.

2) నేను ప్రస్తుతం తెలంగాణ శాసనసభ సభ్యుడిని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని. పలుమార్లు వరుసగా శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికయ్యాను. 2014 నుంచి 2023 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశాను. నా సారథ్యంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే రాజకీయ వ్యూహంలో భాగంగానే విచారణ కమిషన్ ఏర్పాటయింది. ప్రజానిధుల దుర్వినియోగం అనే ఆరోపణలపై 'న్యాయ విచారణ' చేపడుతున్నామని చెప్పి, ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కాబట్టి కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను ఖండిస్తున్నాను.

3) మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు 'కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్'లో భాగం. వాటిని తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదల, కమాండ్ ఏరియా సామర్థ్యం, తాగు నీటిని అందించే సామర్థ్యం పెంచేందుకే మా ప్రభుత్వం నిర్మించింది. నిబంధనలకు, విధానాలకు లోబడి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించి, అమలు చేసింది.

4) తెలంగాణ దక్కన్ పీఠభూమిలోని ఎత్తయిన ప్రాంతం. సముద్ర మట్టానికి సగటున 500- 600 మీటర్ల ఎత్తులో ఉంటుంది. పాక్షిక శుష్క వాతావరణం, వర్షపాతం తక్కువగా నమోదయ్యే భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులు ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో దిగువ భాగంలో ప్రవహిస్తున్నాయి. దీంతో ఎత్తయిన ప్రాంతంలోని తెలంగాణ భూములకు భూమ్యాకర్షణ శక్తిని ఉపయోగించి నదీ జలాలను తరలించడం, కాల్వల ద్వారా సాగునీరు అందించడం అసాధ్యం. ఈ భౌగోళిక పరిస్థితుల వల్లే తెలంగాణను దేశంలోనే అత్యంత కరువు పీడిత దుస్థితి ప్రాంతాల్లో ఒకటిగా మార్చాయి. అంతేకాదు వివిధ రాజకీయ శక్తుల కారణంగా హైదరాబాద్ ప్రావిన్స్ 1956 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలవంతంగా విలీనం చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైంది. ఆంధ్ర పాలకుల నుండి రాజకీయ సంకల్పం, నిబద్ధత లేకపోవడం వల్ల తెలంగాణకు ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు అందలేదు.

> నీటిపారుదల ప్రాజెక్టులు లేకపోవడం, వర్షపాతం తక్కువగా ఉండటం వల్ల నీటి కొరత తీవ్రంగా ఉండేది. అందుబాటులో ఉన్న భూగర్భ జలాల్లోనూ అత్యధిక మోతాదులో ఫ్లోరైడ్‌తో ఉంది. దాని ఫలితంగా తరతరాలుగా ప్రజలు వైకల్యాలతో బాధపడుతున్నారు. ఫలితంగా తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

5) తెలంగాణలో రైతు బాధలు, అభివృద్ధిలో అసమానతల కారణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్యమం మొదలైంది. దీంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంత ప్రయోజనాల కోసం పాటుపడుతున్నట్టు ప్రజలను ఏమార్చడంతోపాటు రాజకీయ ప్రచారం, కంటితుడుపు చర్యల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు 2007లో ప్రకటించింది. తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మించి 160 టీఎంసీల గోదావరి నదీ జలాలను ఎత్తిపోసి 7 తెలంగాణ జిల్లాలకు సాగు నీరు అందిస్తామని నమ్మబలికింది. అయితే ఆ ప్రాజెక్టు డిజైన్‌పై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. పైగా మిగులు జలాలు అందుబాటులో లేని ప్రాంతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రూపొందించారు. వీటికితోడు అనేక అంతర్ రాష్ట్ర సమస్యలు, జల సంబంధ, పర్యావరణ కారణాలు, వల్ల తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణం అసాధ్యమని తేలిపోయింది.

6) ప్రాణహిత-చేవెళ్ల అనేది అంతర్ రాష్ట్ర ప్రాజెక్టు. తమ్మిడిహట్టి దగ్గర పూర్తి రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) 152.00 మీటర్ల ఎత్తుతో, 5.09 టీఎంసీల సామర్థ్యంతో బరాజ్ నిర్మించాలి. అయితే ఆ ఎఫ్ఆర్ఎల్‌తో బరాజ్‌ను నిర్మిస్తే తమ రాష్ట్రంలోని భూములు మునుగుతాయని మహారాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నది. పునరావాస సమస్యలు తలెత్తుతాయి కాబట్టి ముంపును తగ్గించేందుకు బరాజ్ ఎఫ్ఆర్ఎల్‌ను 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించాలని మహారాష్ట్ర కోరింది. ఈ అంతర్ రాష్ట్ర సమస్యలను పరిష్కరించాలనే నిబద్ధత గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేకపోవడంతో ప్రాజెక్టు అమలుకు నోచుకోలేదు. కాగితాలకు, రాజకీయ ప్రచారానికి పరిమితం అయ్యింది.

7) తర్వాత ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రం వేరయ్యింది. కొత్త రాష్ట్రం, ఉరకలేసే ఉత్సాహం, ప్రేరణతో బీఆర్ఎస్ పాలన మొదలైంది. రైతుల బాధలు, తాగునీటి కొరత, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి నీటి అవసరాలను తీర్చడానికి, నీటిపారుదల రంగంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది. ఇందులో భాగంగా 2015 ఫిబ్రవరి 17న తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. రెండు ప్రభుత్వాల మధ్య ఏర్పాటైన అంతర్‌రాష్ట్ర బోర్డు సమావేశంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని పట్టుబట్టింది. 152 మీటర్ల స్థాయిలో ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోబోమని తేల్చిచెప్పింది. మరోవైపు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) 18.02.2015, 04.03.2015 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వానికి లేఖలు రాసింది. ఇందులో తమ్మిడిహట్టి బరాజ్ నిర్మించాలనుకున్న ప్రాంతంలో ఏడాది పొడవునా 160 టీఎంసీల మేరకు మిగులు జలాలు ఉండవని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ప్రయోజనం నెరవేరాలంటే ప్రత్యామ్నాయ స్థలాన్ని అన్వేషించాలని సూచించింది.

8) ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ప్రదేశాలతోపాటు మొత్తంగా ప్రాజెక్టు నిర్మాణంపైనే అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ నివేదిక ప్రకారం అంతర్ రాష్ట్ర సమస్యలు తగ్గాలన్నా, నీటి లభ్యత పెరగాలన్నా ప్రాజెక్టును రీ డిజైన్ చేయడం, నిర్మాణ ప్రాంతాన్ని మార్చడం తప్ప మరో మార్గం లేదని అర్థమైంది. ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలనే మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. ఈ నేపథ్యంలో బరాజ్ నిర్మాణానికి తమ్మిడిహట్టికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి సిఫార్సు చేసేందుకు మెస్సర్స్ వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (వాప్కోస్), కేంద్ర ప్రభుత్వ సేవలు కావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కోరింది. ఈ విజ్ఞప్తిని సైతం మంత్రివర్గం ఆమోదించింది. దీంతో వాప్కోస్ సంస్థ లైడార్ వైమానిక సర్వే నిర్వహించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద ప్రత్యామ్నాయ ప్రదేశాలను ప్రతిపాదించింది.

9) వాప్కోస్ నివేదిక, తమ్మిడి హట్టి దగ్గరున్న పరిస్థితులను పరగణనలోకి తీసుకుని ప్రాజెక్టును మరోచోట నిర్మించాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదించింది. ప్రాజెక్టు పేరును 'కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ 'గా మార్పు చేసింది. పనులు వేగంగా జరగడం, అవసరమైన నిధులను సమకూర్చుకునే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్' అనే ఎస్‌పీవీ (స్పెషల్ పర్పస్ వెహికిల్) ఏర్పాటుచేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ వద్ద ఒక బరాజ్, అక్కడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మధ్య అన్నారం, సుందిళ్ల వద్ద మరో రెండు బరాజ్‌లను నిర్మించాం. ఆ బరాజ్‌ల మధ్య నిలిచిన నీటిని కాలువలు, సొరంగాలు, ఎత్తిపోతల, జలాశయాలు, డిస్ట్రిబ్యూటర్ నెట్ వర్క్ ద్వారా తెలంగాణలోని 13 జిల్లాల్లో విస్తరించి ఉన్న కమాండ్ ఏరియాకు తరలించాలని, తద్వారా 18,25,700 ఎకరాల వ్యవసాయ భూమికి సాగు నీరు అందజేయాలని సంకల్పించాం. దీంతోపాటు హైద్రాబాద్-సికింద్రాబాద్ నగరాలకు అనేక ఇతర పట్టణాలు, మున్సిపాలిటీలకు తాగునీటి కష్టాలను తీర్చేందుకు 40 టీఎంసీలు, రాష్ట్ర పారిశ్రామిక అవసరాలకు 16 టీఎంసీలను కేటాయించాం. గతంలో ప్రతిపాదించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో నీటిసామర్థ్యం 11.43 టీఎంసీలు మాత్రమే కాగా, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో నీటి సామర్థ్యం 147.71 టీఎంసీలకు పెరిగింది. మొత్తంగా.. తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే మహారాష్ట్రతో అంతర్ రాష్ట్ర సమస్యలతోపాటు ఆశించిన స్థాయిలో నీటి లభ్యత ఉండదనే కారణాల వల్లే కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంప్రాజెక్టును రీ డిజైన్ చేయాల్సి వచ్చింది.

> 10) కాళేశ్వరం ప్రాజెక్టును అమలు చేయడానికి కేంద్ర జల సంఘం, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సాంకేతిక సలహా కమిటీ మొదలైన వాటితో సహా కేంద్ర ప్రభుత్వం/తెలంగాణ ప్రభుత్వంలోని వివిధ విభాగాలు/ఏజెన్సీల నుంచి అవసరమైన అన్ని అనుమతులను సాధించాం.

సాధించిన అనుమతులు వివరాలు..

డైరెక్టరేట్	అనుమతి మంజూరు
హైడ్రాలజీ	30.10.2017
ఇంటర్‌స్టేట్	03.11.2017
కేంద్ర భూగర్భ జలశాఖ	21.11.2017
కేంద్ర అటవీ,కన్సల్టెన్సీ	24.11.2017
పర్యావరణశాఖ	22.12.2017
కన్‌స్ట్రక్షన్ మెషనరీ ఇరిగేషన్ ప్లానింగ్	13.04.2018
కాస్ట్ అప్రయిజల్	01.05.2018
అగ్రికల్చర్ మినిస్ట్రీ	11.05.2018
సెంట్రల్ సాయిల్, మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్	21.05.2018
టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ)	14.06.2018

11) పై వివరాలను పరిశీలిస్తే అప్పటి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి చట్టాలను, నియమాలను ఉల్లంఘించలేదని స్పష్టమవుతుంది. బరాజ్ స్థలాలతో సహా అన్ని ప్రాజెక్ట్ స్థలాలను పూర్తిగా పరిశీలించి, మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి, ఇతర ప్రమాణాలను పాటించాం. కాబట్టే సంబంధిత ఏజెన్సీలు ప్రాజెక్టు అమలుకు అనుమతులు ఇచ్చాయి.

12) రాజ్యాంగంలోని ఆర్టికల్166 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. ముఖ్యమంత్రిగా నా నేతృత్వంలోని మంత్రివర్గం సలహాలు, సూచనల మేరకు సంబంధిత అన్ని విభాగాలతోసహా అప్పటి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు రీడిజైన్ నిర్ణయం తీసుకున్నది. బిజినెస్ రూల్స్ ప్రకారం నిర్ణయాలన్నీ రాష్ట్ర గవర్నర్ పేరిట తీసుకున్నాం. మంత్రి మండలి సలహాలు, సూచనల ప్రకారం గవర్నర్ కార్యనిర్వాహక నిర్ణయం తీసుకున్నారు. కాబట్టి దానికి మంత్రులందరి సమష్టి బాధ్యత ఉంటుంది. ఏకవ్యక్తి బాధ్యత ఉండదు, ఉండకూడదన్నది ప్రాథమిక సూత్రం.

> 13) సంబంధిత విభాగాలు/ఏజెన్సీల నుంచి అన్ని అనుమతులు పొందిన తర్వాతే అప్పటి తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రారంభించింది. మంత్రివర్గం ఆమోదం పొందిన తర్వాతే సాంకేతిక నిపుణులు, కన్సల్టెంట్లు, ఇంజినీర్లు కలిసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌ల రూపకల్పన, వివిధ ప్యాకేజీల్లోని పనులకు ప్రణాళిక (డ్రాయింగ్) రచించారు.

14) డ్రాయింగ్‌లను అప్పటి ప్రభుత్వం ఆమోదించిన తర్వాత, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌ల నిర్మాణంతో సహా అన్ని పనుల కోసం గ్లోబల్ టెండర్స్‌ను ఆహ్వానించింది. బిడ్డింగ్‌లో పాల్గొని, ఎల్- 1గా నిలిచిన సంస్థలు, ఏజెన్సీలకే వర్క్ ఆర్డర్లు, కాంట్రాక్టులు ఇచ్చారు. 2017- 2018 సంవత్సరంలో పనులు మొదలయ్యాయి. ప్రభుత్వ చొరవతో రికార్డు సమయంలోనే వివిధ ఏజెన్సీలు పనులు పూర్తి చేశాయి. అయితే ప్రాజెక్టు ఆపరేషన్, నిర్వహణ ఆయా ఏజెన్సీల పరిధిలోనే ఉంటుంది. నిర్దేశిత గడువు వరకు ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ వంటివి ఆయా ఏజెన్సీలే చేయాల్సి ఉంటుంది.

15) మేడిగడ్డ బరాజ్ నుంచి నీటిని విజయవంతంగా వివిధ జలాశయాలకు మళ్లించి, రికార్డు సమయంలోనే రైతులకు సాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చాం. తద్వారా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు విజయవంతమైంది. కరువు, రైతు ఆత్మహత్యలు, బలవంతపు వలసలు, ఫ్లోరోసిస్ వంటి సమస్యలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ ప్రాంతాన్ని ఈ ప్రాజెక్టు వల్ల అతి తక్కువ సమయంలోనే అత్యధిక వరి సాగుతో 'దేశానికే అన్నం గిన్నె', 'దేశ ధాన్యాగారం' అనే స్థాయికి తీసుకొచ్చాం.

> కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని అమలు చేయడం వల్లే ఈ మార్పు సాధ్యం అయ్యి ంది. మేడిగడ్డ, అనా ్నరం, సుందిళ్ల బరాజ్‌లు అంతర్భాగంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు 'తెలంగాణ జీవనాడి' అని నిస్పందేహంగా చెప్తున్నాం. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో అధిక నీటి అవసరాలను ఈ ప్రాజెక్టే తీర్చుతున్నది.

16) 2023 వర్షాకాలంలో అధిక వర్షపాతం, ఇతర వివిధ సాంకేతిక కారణాల వల్ల మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్‌లో ఉన్న 20వ నంబర్ పిల్లర్ కుంగిపోయింది. ఇది దురదృష్టకర సంఘటన. బరాజ్ రూపకల్పన, ఇంజనీరింగ్‌తో, ఎవరి నియంత్రణ లేకుండా, ఎలాంటి సంబంధం లేని ఇతర సాంకేతిక కారణాల వల్లే ఇది జరిగింది. ఈ సంఘటనను నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఒక అవకాశంగా మలుచుకున్నది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై తప్పుడు ప్రచారం చేసింది. మొత్తం ప్రాజెక్టే కుంగిపోయినట్టుగా కాలుకు బలపం కట్టుకుని దుష్ప్రచారం చేసింది. పలు మీడియాల్లో సైతం ఇదే రకమైన కథనాలు ప్రచురితం/ప్రసారం అయ్యాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చాలా స్వల్ప తేడాతో అధికారానికి దూరమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లి అప్రతిష్టపాలు చేయడంతోపాటు ఆనాటి ప్రభుత్వం అమలు చేసిన కీలకమైన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుత (కాంగ్రెస్) ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను నియమించింది.

> 17) కాళేశ్వరం ప్రాజెక్టుకు మంత్రి మండలి ఆమోదం లేదని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌ల నిర్మాణానికి నాడు సీఎం హోదాలో ఉన్న నేను (కేసీఆర్) ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నానన్న కమిషన్ అభియోగాలు అవాస్తవం. నన్ను అప్రతిష్టపాలు చేసే కుట్ర ఇది. బరాజ్‌లపై కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ఏజెన్సీలు ఒక్క అభ్యంతరాన్ని కూడా లేవనెత్తలేదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

18) కమిషన్ విచారించాల్సిన అంశాలు ఇలా ఉన్నాయి.

- మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణంలో నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలు.
- బరాజ్‌ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కాంట్రాక్టు ఒప్పందాన్ని అమలు చేయడంలో ఏజెన్సీలు, ఆయా విభాగాల నిర్లక్ష్యం.
- కాంట్రాక్టులను అప్పగించడంలో కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటించారా? అవకతవకలు జరిగాయా? వంటివి పరిశీలించడం.
- మూడు బరాజ్‌ల నిర్వహణలో సంబంధిత ఏజెన్సీలు, విభాగాల నిర్లక్ష్యం ఫలితంగా నిర్మాణానికి పెద్ద ఎత్తున నష్టం జరగడం.
- నాణ్యత నియంత్రణ - పర్యవేక్షణ అంశాల్లో ఏజెన్సీలు/కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల నిర్లక్ష్యం.
- నిబంధనలకు విరుద్ధంగా గడువు పొడిగింపు, తప్పుల తడకగా పని పూర్తి చేయడం, బ్యాంక్ గ్యారెంటీలను ముందస్తుగా విడుదల చేయడం, ఇతర అంశాల్లో ఏజెన్సీలు/కాంట్రాక్టర్లకు అనుచిత ప్రయోజనాలు కల్పించారేమో విచారణ జరపడం, అలాంటి అధికారులను గుర్తించి బాధ్యులను చేయడం.
- పైన పేర్కొన్న అంశాలతోపాటు ఆర్థిక అంశాల్లో విచారణ సందర్భంగా లోపాలు గమనిస్తే, బాధ్యులను గుర్తించడం.
- ప్రభుత్వం తరువాత సూచించే అంశాలు

(తరువాయి 5వ పేజీలో)

అన్యాయ కమిషన్‌పై హైకోర్టులో దావా



ఘోష్ నివేదికను రద్దు చేయండి

(4వ పేజీ తరువాయి)

19) కమిషన్ నుంచి నాకు 20.05.2025 తేదీన సమన్లు అందాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల ప్రణాళిక, కాంట్రాక్టుల అప్పగింత, రూపకల్పన, నిర్మాణం, ప్రారంభోత్సవం సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్నందున నా వాదనలు వినడానికి సిద్ధంగా ఉన్నట్టుగా అందులో తెలిపింది. సాక్ష్యాలుగా ఏవైనా పత్రాలు/రికార్డులు ఉంటే సమర్పించవచ్చని సూచించింది. 5.06.2025న విచారణకు హాజరు కావాలని కమిషన్ కోరింది. వివరణ నిమిత్తం హాజరుకావాలన్న ఆ నోటీసు తప్ప మరే విధమైన ఇతర సమన్లు నాకు అందలేదు. విచారణను 05.06.2025 నుంచి 11.05.2025 లేదా మరేదైనా తేదీకి వాయిదా వేయాలని కమిషన్‌ను కోరాను. ఆ మేరకు కమిషన్ రీషెడ్యూల్ చేసింది.

20) ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తిగా నా చిత్తశుద్ధిని, సమగ్రతను, నిజాయతీని నిరూపించుకునే క్రమంలో కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యాను. కమిషన్ విచారణ ప్రశ్నలు-జవాబుల మాదిరిగా సాగింది. 20.05.2025 నాడు కమిషన్ జారీ చేసిన సమన్లలోగానీ, ప్రశ్నలు అడిగిన సమయంలోగానీ నేను చెప్పే విషయాలు న్యాయ పరిధిలోకి వస్తాయని గానీ, ఈ విచారణ నా ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని గానీ ఏ దశలోనూ పేర్కొనలేదు.

21) జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ 31.07.2025 తేదీన తన నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్టు మీడియాలో వచ్చిన వార్తలను గమనించిన తర్వాతే నాకు తెలిసింది. ఈ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, నీటిపారుదల శాఖ కార్యదర్శికి అందజేశారని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారని వార్తలు వచ్చాయి. అంతేతప్ప కమిషన్ నివేదికను నాకుగానీ, ఇతరులకు గానీ ఇవ్వలేదు. మీడియాకు అయినా పూర్తి నివేదికను అందజేయలేదు. కానీ అధికారులు ఆ నివేదిక ఆధారంగా ఒక ప్రెస్‌నోట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేశారు. 04.08.2025 తేదీన 'కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బరాజ్‌లపై జ్యుడీషియల్ కమిషన్ అందించిన నివేదికపై ప్రజెంటేషన్' అనే శీర్షికతో పత్రికా ప్రకటన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విడుదలైంది. ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి ఇతర మంత్రులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ, నాకు అపకీర్తి, పక్షపాతం ఆపాదిస్తూ పరువు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో పూర్తి నివేదిక కాపీ ఇవ్వాలని నేను 08.08.2025న సీఎస్‌కు లేఖ రాయగా, ఇప్పటివరకు ఇవ్వలేదు.

22) ముఖ్యమంత్రి, మంత్రుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, ప్రెస్‌మీట్‌లో చెప్పిన విషయాల ఆధారంగా మీడియాలో నాపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించాలి. పక్షపాతంతో దారుణంగా, దుర్మార్గంగా, ద్వేషపూరితంగా జరిగిన ఈ దాడి.. నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నది.

23) ప్రభుత్వం విడుదల చేసిన పీపీటీని గమనిస్తే.. విచారణ కమిషన్, కమిషన్ చైర్మన్ విచారణ నిర్వహించిన తీరు ఏకపక్షంగా, దురుద్దేశపూర్వకంగా ఉన్నది. అలా చేయడం నిబంధనలకు వ్యతిరేకం. ప్రాథమిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నది. 'న్యాయ' కమిషన్ సహేతుకతను దెబ్బతీసింది. పీపీటీ ప్రకారం కమిషన్ 13.04.2024న బాధ్యతలు స్వీకరించింది. 27.04.2024న అఫిడవిట్ రూపంలో ఆధారాలతో ఫిర్యాదులను ఆహ్వానిస్తూ పబ్లిక్ నోటీసు జారీ చేసింది. మొత్తం110 మంది అఫిడవిట్లు దాఖలు చేశారు. కమిషన్119మంది సాక్షులను విచారించింది. వారిలో నాతోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఇతరులు ఉన్నారు.

24) పీపీటీలో కమిషన్ నాపై అనేక విమర్శలు చేసింది. ఇందులో కొన్ని నా పరువును దిగజార్చేలా ఉన్నాయి. ఇందులో కొన్ని..

- మూడు బరాజ్‌ల ప్రణాళిక, నిర్మాణం, పూర్తి, నిర్వహణలో జరిగిన చట్టవిరుద్ధ చర్యలు, అవకతవకలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేసీఆరే బాధ్యత వహించాలి. నిర్మాణంలో అవకతవకలు, బరాజ్‌లు దెబ్బతినడానికి ఆయన ప్రమేయం, ఆదేశాలే కారణం.
- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదన దశ నుంచి 01.03.2016న నిర్మాణానికి పరిపాలనా అనుమతులు జారీ చేసే వరకు అధికార దుర్వినియోగం జరిగింది. ఇది ప్రభుత్వ నిర్ణయం కాదు, వ్యక్తుల నిర్ణయం.
- అప్పటి ముఖ్యమంత్రి తన వ్యక్తిగత నిర్ణయం మేరకు మేడిగడ్డ వద్ద బరాజ్‌ను నిర్మించాలని ముందుగానే మొగ్గు చూపారు. దీనికి అధికారులు సహాయం చేశారు.
- మేడిగడ్డ వద్ద, అన్నారం, సుందిల్ల వద్ద బరాజ్ నిర్మాణంపై అప్పటి ముఖ్యమంత్రిదే అంతిమ నిర్ణయం. 21.1.2015 నాటి జీవో 28 ద్వారా ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు.
- రూ.2,591 కోట్లతో మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతించేందుకు పరిపాలనా అనుమతుల నిమిత్తం 1.3.2016 తేదీన జారీ చేసిన జీవో ఆర్టీ నెంబర్ 231, 232, 233ను మంత్రివర్గం ముందుంచలేదు. నాటి నీటిపారుదలశాఖ మంత్రి, సీఎం ఆదేశాల ప్రకారం జీవోలు జారీ అయ్యాయి.
- నాటి సీఎం, మంత్రి మాత్రమే ఈ నిర్ణయాలు తీసుకోవడానికి ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేవు. మంత్రివర్గం ఆమోదించలేదు కాబట్టి వాస్తవాలు క్యాబినెట్ దృష్టికి వెళ్లలేదు.
- 9.12.2017న జరిగిన సమీక్షా సమావేశంలో ఒప్పందాల పరిధిలో లేని అదనపు పనులను ప్రస్తుత ఏజెన్సీలకు అప్పగించాలని నాటి సీఎం ఆదేశించారు.
- ముఖ్యమంత్రి మౌఖిక ఆదేశాలకు అనుగుణంగా కాంట్రాక్టర్ పని పరిధిలోని కాఫర్ డ్యామ్, గైడ్ బండ్స్ నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై భారీగా అదనపు భారం పడింది. డీపీఆర్‌తో సంబంధం లేకుండా ఆర్‌ఈ-1లో రూ.369 కోట్ల విలువైన పనులు చేర్చారు. ఇది ప్రజాధనాన్ని మళ్లించి ఏజెన్సీకి అయాచిత లబ్ధి చేకూర్చడమే.
- పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు జలాశయాలు నిండుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నాటి సీఎం ఆదేశించడం, బరాజ్‌ల నిర్వహణ లోపం వల్లే బరాజ్ ఫెయిల్యూర్‌కు కారణమని నిర్ధారణ జరిగింది. నాటి సీఎం రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన 3 బరాజ్‌లను రక్షించాలనే నిజాయతీ, నిబద్ధత ఆయనలో కొరవడింది. సీఎం ప్రభుత్వ అధిపతిగా కాకుండా, పరిపాలనా కార్యనిర్వాహకుడిగా వ్యవహరించారు.
- 3 బరాజ్‌ల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో నాటి సీఎం జోక్యమే ప్రస్తుత అవకతవకలు, దుస్థితికి కారణం. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలనే యోచన నుంచి పరిపాలనా అనుమతులు, ప్రాజెక్టు నిర్మాణం వరకు నిర్ణయాలు తీసుకున్న ఏకైక వ్యక్తి నాటి సీఎం. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పడం వాస్తవం కాదు. అక్కడ నిర్మాణం చేపట్టకపోవడం సరైన నిర్ణయం కాదు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల వద్ద బరాజ్ నిర్మాణ నిర్ణయం పూర్తిగా నాటి సీఎందే.

25. పైన పేర్కొన్న వ్యాఖ్యల ఆధారంగా కమిషన్ 31.07.2025న సమర్పించిన నివేదికలో బాధ్యులను నిర్ధారించింది. నాటి సీఎం కేసీఆర్, అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను బాధ్యులుగా తేల్చింది. మొత్తంగా ప్రాజెక్టులో విధానపరమైన, ఆర్థికపరమైన అవకతవకలు బాహాటంగా కనబడ్డాయని, తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా నిర్దేశించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను వ్యక్తిగత, రాజకీయ నాయకత్వం అవసరాలతో నడిపారని కమిషన్ పేర్కొన్నది. ప్రణాళిక, సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక క్రమశిక్షణల తీవ్ర వైఫల్యం కారణంగా ప్రజాధనానికి భారీగా నష్టం జరిగినట్టుగా నివేదిక చెప్తున్నది. 3 బరాజ్‌ల నిర్మాణంలో అవినీతి, అక్రమాలు జరగడంతో ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపిస్తూ, ముగ్గురు ప్రజాప్రతినిధులను బాధ్యులను చేసింది.

26) కమిషన్ పైన చేసిన వ్యాఖ్యలను, ఆరోపణలను పరిశీలిస్తే నాపై ఉద్దేశపూర్వకంగా అభియోగాలు మోపినట్టు స్పష్టం అవుతున్నది. నేను రాష్ట్ర ప్రయోజనాలకు పాటుపడటం లేదని, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నానని నివేదికలో పొందుపరిచారు. ఇది చట్టవిరుద్ధమే కాకుండా, న్యాయపరంగా చిక్కులు తెచ్చేదిగా ఉన్నది. నా వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా పక్షపాత ధోరణితో ఉన్నది.

27) కమిషన్, దాని చైర్మన్ స్వతంత్రంగా వ్యవహరించలేదు. ప్రస్తుత రాష్ట్ర పాలకవర్గం చేసిన దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నట్టుగా ఉన్నది. కమిషన్ నివేదిక పక్షపాతం, దురుద్దేశాలతో నిండింది. నివేదిక ముందస్తుగా రూపొందించారన్నట్టుగా ఉన్నది. నాటి సీఎంగా నేను, మంత్రిగా హరీశ్‌రావు సమర్పించిన ఆధారాలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. మేము ఇచ్చిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకునే ఉద్దేశం లేకుండానే, ఊహాత్మకంగా మాత్రమే సమన్లు ఇచ్చినట్టు అనిపిస్తున్నది.

28) కమిషన్ /చైర్మన్ రాజకీయ నాయకులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా విచారణ నిర్వహించారు. నివేదిక నిజాయతీగా లేదు. దురుద్దేశం, పక్షపాతంతో కూడిన నివేదికను ఆదిలోనే హైకోర్టు కొట్టేయాలి.

29) నీటిపారుదలశాఖ 14.3.2024 తేదీన జారీ చేసిన జీవో 6ను తక్షణమే కొట్టేయాలి. ఎందుకంటే, నోటిఫికేషన్‌ను పరిశీలిస్తే.. అవకతవకలు, అక్రమ పద్ధతుల ద్వారా ప్రజాధనం దుర్వినియోగ ఆరోపణలపై న్యాయ విచారణకు కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టుగా ఉన్నది. ఈ లెక్కన విచారణలో గుర్తించిన లోపాల్లో ఆర్థిక అవకతవకలకు ఎవరు బాధ్యులో కమిషన్ నిర్ణయించింది.

30) విచారణ కమిషన్‌కు 'న్యాయ' అధికారాలను మంజూరు చేయడం అభ్యంతరకరం. లోపాలకు బాధ్యులను నిర్ధారించే అధికారాన్ని కమిషన్‌కు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదలశాఖ కార్యదర్శి తమ అధికార పరిధిని అతిక్రమించారు. చట్టవిరుద్ధంగా లభించిన ఈ అధికారాలతో కమిషన్ నాతో సహా అనేక మంది వ్యక్తులను బాధ్యులుగా నిర్ధారించింది. పైగా సంస్థలకు చెల్లించిన నిధులను రికవరీ చేయాలని కూడా కోరింది.

31) విచారణ కమిషన్ల చట్టం-1952 ప్రకారం కమిషన్లు ఎంపిక చేసిన అంశంపై విచారణలో నిజనిర్ధారణ మాత్రమే చేయాలి. ఎవరినీ బాధ్యులుగా నిర్ధారించరాదు. ఈ చట్టం కింద ఏర్పాటయ్యే కమిషన్ విచారణ పరిధి ఏమిటో సుప్రీంకోర్టు పలుమార్లు చాలా స్పష్టంగా తేల్చింది. ఫలానా వ్యక్తి అలా చేశారు? ఇలా చేశారంటూ బాధ్యులుగా నిర్ణయించడం ద్వారా వ్యక్తి/వ్యక్తుల హక్కులకు భంగం కలిగించకూడదు. కమిషన్ చట్టంలోనూ ఇదే విషయం స్పష్టంగా ఉన్నది.

32) రామ్ కృష్ణ దాల్మియా వర్సెస్ జస్టిస్ ఎస్ఆర్ టెండుల్కర్ మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని మార్గదర్శకాలకు కమిషన్ నివేదిక తిలోదకాలు ఇచ్చింది. కమిషన్ వాస్తవాలను కనుగొనవచ్చు గానీ శాసన లేదా కార్యనిర్వాహక చర్యల దిశగా కమిషన్ అడుగులు ఉండకూడదని సుప్రీంకోర్టు తేల్చింది. 'కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవాలో లేదో ప్రభుత్వ పరిధిలోని అంశం. సాక్షి నుంచి సేకరించి.. వివరాలను నివేదికలో పొందుపర్చాలేగానీ, దాని ఫలితాలను నమోదు చేయకూడదు. అది విచారణకు అనుబంధంగా పరిగణించడం అవుతుంది. ఇలా చేయడానికి వీల్లేదు. విచారణలో తేలిన అంశాలపై కమిషన్ సొంత అభిప్రాయాలను వ్యక్తం చేయకూడదు. విచారణ కమిషన్‌కు న్యాయపరమైన అధికారాలు లేవు. కమిషన్ ఎదుట ఎవరైనా హాజరై ప్రకటన చేస్తే, చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం, భవిష్యత్తులో ఏమైనా సివిల్ /క్రిమినల్ కేసుల్లో సాక్షులుగా పరిగణించకూడదు. విచారణ కమిషన్‌కు పరిహారం లేదా శిక్షలను విధించే అధికారం ఉండదు' అని సుప్రీంకోర్టు పేర్కొన్నది.

33) పీవీ జగన్నాథరావు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఒడిశా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో, విచారణ కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఉద్దేశాన్ని స్పష్టంచేసింది. చట్టంలోని సెక్షన్ 3 కింద నియమించబడిన కమిషన్ చేయాల్సిన విచారణ లక్ష్యాలను వివరించింది.

34) కమిషన్ జ్యుడీషియల్ బాడీ కాదు. కానీ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో కమిషన్‌ను జ్యుడీషియల్ బాడీగా పేర్కొన్నది. ఇది విచారణ కమీషన్ల చట్టం ప్రకారం చెల్లదు. పైగా విచారణ జరిపి బాధ్యులను నిర్ధారించాలని జీవోలో పేర్కొన్నారు. కానీ కమిషన్‌కు అలాంటి అధికారం లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. బాధ్యులను గుర్తించడం, శిక్షలు వేయడం కమిషన్ పని కాదని, కోర్టు పని అని స్పష్టంచేసింది.

35) భవిష్యత్‌లో లోటుపాట్లు లేకుండా ఏం చేయాలో ప్రభుత్వానికి కమిషన్ సిఫార్సు చేయాలి. అంతేగానీ ఫలానా వాళ్లు తప్పు చేశారంటూ నేరుగా ఆరోపణలతో నివేదిక ఇవ్వడానికి వీల్లేదు. సాక్షులు ఏం చెప్పారో నివేదికలో పొందుపర్చకుండా ఫలానా వ్యక్తులు బాధ్యులని కమిషన్ తేల్చుతూ నివేదిక ఇవ్వడం చట్టవ్యతిరేకం.

36) ప్రజాజీవితంలో ఉన్నందున విచారణ కమిషన్ ఎదుట హాజరై సాక్ష్యం చెప్పాను. కానీ కమిషన్ చట్టబద్ధమైన విధానాన్ని పాటించలేదు. కాబట్టి కమిషన్‌ను ఏర్పాటు చేసిన జీవోను కొట్టేయాలని కోరుతున్నాను.

37) కమిషన్ 31.07.2025వ తేదీన ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా అభియోగాలు ఉన్నాయి. ఈ నివేదిక అవహేళన, అవమానకర ఆరోపణలతో నిండి ఉన్నదని 04.08.2025 తేదీన జరిగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వెల్లడించింది. తమ్మిడిహట్టి బరాజ్ స్థలాన్ని మేడిగడ్డకు తరలించడంలో నేను ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నానని నివేదికలో ఉన్నట్టు ప్రజంటేషన్‌లో తెలిపారు. పరిపాలనా అనుమతులు క్యాబినెట్ ద్వారా కాకుండా వ్యక్తిగత స్థాయిలో తీసుకున్నట్టుగా ప్రకటించింది. మౌఖికంగా ఆదేశాలు ఇచ్చానంటూ కమిషన్ తప్పుగా పేర్కొంది.

38) నేను ముఖ్యమంత్రిగా ఉండగా అవకతవకలు జరిగాయంటూ నన్ను అప్రతిష్టపాలు చేసేలా నివేదిక ఉన్నది. నా ఖ్యాతికి మచ్చ తెచ్చే ప్రయత్నం జరిగింది. ప్రజలకు చేదోడు వాదోడుగా ఉన్న నేతకు రాజకీయంగా కళంకం తీసుకొచ్చేలా, సమాజంలో అపకీర్తిని ఆపాదించేలా ప్రయత్నం జరిగింది. ఒకవేళ అవకతవకలను గుర్తిస్తే విచారణ కమిషన్ చట్టంలోని 8-బీ, 8-సీ సెక్షన్ల కింద నోటీసు ఇవ్వాలి. కానీ అలా జరగలేదు. ఎవరైనా సాక్షులు లేదా సమాచారంలో వచ్చిన అభియోగాలకు వివరణ కోరలేదు. అలాంటి సాక్షిని క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు అవకాశం ఇవ్వలేదు. రెండు సెక్షన్లను కమిషన్ అమలు చేయకుండా నా ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరిగింది.

39) విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ ప్రకారం.. ఒక వ్యక్తి ప్రవర్తనపై సందేహాలు ఉంటే కమిషన్ విచారణ అవసరమని భావించినప్పుడు నోటీసు జారీ చేయాలి. విచారణ నివేదికతో వ్యక్తి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం వాటిల్లే అవకాశం ఉండకూడదు. అదే పరిస్థితి ఉంటే కమిషన్ ఆ వ్యక్తికి విచారణలో తన వాదన వినిపించడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి సహేతుకమైన అవకాశమివ్వాలి. అదే చట్టంలోని 8సీ సెక్షన్ ప్రకారం అలాంటి అభియోగాలు చేసిన వారిని క్రాస్ ఎగ్జామ్ చేసేందుకు వీలు కల్పించాలి. సెక్షన్ 8బీలో నిర్దేశించిన వ్యక్తిని, ఇతరులను కమిషన్ అనుమతితో క్రాస్‌ఎగ్జామిన్ చేసేందుకు వీలు కల్పించకుండానే కమిషన్ నివేదిక సమర్పించింది.

40) కమిషన్ విచారణ సందర్భంగా తేలిన అంశాలతో ఎవరి ప్రతిష్ఠ అయినా దెబ్బతినే అవకాశం ఉంటే, చట్ట ప్రకారం వారికి కమిషన్ నోటీసులు జారీ చేసి, అభియోగాలపై విచారణ జరపాలి. వారికి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వాలి. విధిగా అమలు చేయాల్సిన ఈ నిబంధనను కమిషన్ పట్టించుకోలేదు.

41) కిరణ్ బేడి వర్సెస్ కమిటీ ఆఫ్ ఎంక్వయిరీస్ కేసులో నోటీసు ఇవ్వకపోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఢిల్లీ హైకోర్ట్ బార్ అసోసియేషన్‌కు చెందిన కేసులో 8బీ సెక్షన్ అమలు చేయకపోవడం వల్ల వ్యక్తి పరువు దెబ్బతింటుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

42) సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పులను హైకోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. సెక్షన్ 8బీ ప్రకారం విచారణకు అవకాశమివ్వకుండానే కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలి. 20.05.2025 తేదీన కమిషన్ జారీ చేసిన సమన్లు పరిశీలిస్తే, సెక్షన్ 5(2) కింద సాక్షిగా మాత్రమే పరిగణించి విచారణకు పిలిచింది. నాకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నాయనే విషయాన్ని నోటీసులో ఎక్కడా పేర్కొనలేదు. ఇదే అంశంపై నోటీసు కూడా ఇవ్వలేదు. నాకు వ్యతిరేకంగా సాక్ష్యాలిచ్చిన వాళ్లను క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు అవకాశం ఇవ్వలేదు. పైగా,కమిషన్ విచారణ చేసిన వారిలో నేనే (కేసీఆర్) చివరి వ్యక్తిని. అప్పటికి ఇతర సాక్షులు ఎలాంటి అభియోగాలు చేశారో కమిషన్‌కు తెలిసి కూడా 8బీ, 8సీ సెక్షన్ల కింద నోటీసులు ఇచ్చి విచారణ చేయలేదు. దీనిని బట్టి కమిషన్ దురుద్దేశం బహిర్గతం అవుతున్నది. కమిషన్ నివేదికపై ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి 60 పేజీలకు నివేదికను కుదింపు చేయించింది. దాని ఆధారంగా సీఎం, నీటిపారుదల మంత్రి ఇతరులు మాకు వ్యతిరేకంగా మీడియా ఎదుట 14.8. 2025వ తేదీన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మేము తప్పు చేసినట్టు కమిషన్ నివేదిక ఇచ్చిందని పాలక పెద్దలు తేల్చిచెప్పడాన్ని తీవ్రంగా పరిగణించాలి. మా ప్రతిష్ఠకు తీవ్ర భంగం వాటిల్లేలా సీఎం ప్రకటనలు చేయడం ద్వారా కమిషన్ నివేదికపై ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందో అర్థమవుతున్నది. సుప్రీంకోర్టు తీర్పులను గమనంలోకి తీసుకుని, ప్రభుత్వానికి అందిన కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి. కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో6ను రద్దు చేస్తూ తుది తీర్పు వెలువరించాలి.

43) కమిషన్ పరిశీలించిన చిట్టచివరి సాక్షి నేనే(కేసీఆర్). అప్పటికే సాక్ష్యాలను క్రోడీకరించి నివేదిక రూపకల్పన చేసే దశలో కమిషన్ ఉంది. అయినా నాపై వచ్చిన అభియోగాలపై క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు కమిషన్ నాకు అవకాశం కల్పించలేదు. కాబట్టి కమిషన్ దురుద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నన్ను కమిషన్ తప్పుదారి పట్టించింది.

44) కమిషన్ నివేదిక ఆధారంగా సీఎం, మంత్రి మీడియా సమావేశంలో చెప్పిన సమాచారం కారణంగా మాకు వ్యతిరేకంగా మీడియాలో పెద్దఎత్తున దుష్ప్రచారం జరిగింది. ముందస్తు వ్యూహంతో నివేదికలోని విషయాలను మీడియాలో వచ్చేలా ప్రభుత్వం కుట్ర చేసింది.

45) కమిషన్ విచారణ సాకుతో సమర్పించిన నివేదికను రద్దు చేయాలి. నివేదికను పూర్తిగా పక్కన పెట్టడమే ఏకైక మార్గం. లేకపోతే మా హక్కులు పూర్తిగా హరించుకుపోతాయి. రాజ్యాంగంలోని 226 అధికరణం కింద హైకోర్టు జోక్యం చేసుకుని మా హక్కులను కాపాడాలి. చట్టవ్యతిరేక నివేదికను రద్దు చేయాలి.

46) తుది ఉత్తర్వులు జారీ చేసేలోగా నివేదిక అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి. నివేదిక ప్రతి కోసం కమిషన్‌కు లేఖ రాస్తే ఇవ్వలేదు. నివేదిక అందుకున్న ప్రభుత్వం అధికారులతో సంక్షిప్తం చేసి మాపై దాడి చేసి, సంక్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టింది. సాక్షాత్తు సీఎం సారథ్యంలోనే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏకపక్ష దాడి జరిగింది. కాబట్టి కోర్టు తక్షణమే జోక్యం చేసుకుని మాకు రక్షణ కల్పించాలి. మీడియా ట్రయల్ జరగకుండా చర్యలు తీసుకోవాలి. పిటిషన్ పెండింగ్‌లో ఉండగా కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలి. తుది తీర్పులో కమిషన్ ఏర్పాటు జీవో6ను, కమిషన్ నివేదికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించాలి.

ఘోష్ రిపోర్టు చెల్లదు

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వానికి 650 పేజీల నివేదికను సమర్పించింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన బెంచ్ గురువారం విచారణ జరిపింది. దాదాపు రెండున్నర గంటలకు పైగా జరిగిన విచారణలో పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఏకపక్షంగా ఉన్నదని, సాక్షిగా విచారణకు పిలిచి వివరాలు కోరితే పిటిషనర్లు ఆ మేరకు తెలియజేశారని వివరించారు. ఇతర సాక్షులు లేదా పత్రాల ద్వారా పిటిషనర్లకు వ్యతిరేకంగా అభియోగాలు ఉన్నాయని కమిషన్ భావిస్తే, విచారణ కమిషన్ చట్టం-1952లోని సెక్షన్ 8-బీ కింద పిటిషనర్లకు నోటీసు ఇవ్వాలన్న నిబంధనను జస్టిస్ పీసీ ఘోష్ ఉల్లంఘించారని తెలిపారు. పిటిషనర్లకు వ్యతిరేకంగా ఎవరైనా సాక్ష్యం చెప్పి ఉంటే వాళ్ల సమక్షంలో కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదని అన్నారు. కమిషన్ విచారణకు పిలిచిన చిట్టచివరి సాక్షి మాజీ సీఎం కేసీఆర్ అని, నిజంగానే కమిషన్ వద్ద ఆయనకు వ్యతిరేకంగా అభియోగాలు ఉంటే, వాటిపై కేసీఆర్‌ను ప్రశ్నించాలని అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ముందస్తు పథకం ప్రకారం ఆరోపణలు చేస్తూ వచ్చిందని చెప్పారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక కుట్ర ప్రకారం అడుగులు వేసిందని అన్నారు. అప్పటికే భారీ వర్షాల కారణంగా మేడిగడ్డ రిజర్వాయర్‌లోని ఒకే ఒక్క పిల్లర్ కుంగితే, దీనిని సాకుగా తీసుకుని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఏదేదో జరిగిపోయిందని చెప్పి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు.

కమిషన్ తీరు చట్టవిరుద్ధం

మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన జ్యుడీషియల్ కమిషన్ తీరు చట్ట వ్యతిరేకంగా ఉన్నదని కేసీఆర్ తరఫు న్యాయవాదులు చెప్పారు. రాజకీయ ఉద్దేశంతో కమిషన్ ఏర్పాటు జరిగిందని అన్నారు. దీనివెనుక గత బీఆర్‌ఎస్ ప్రభుత్వకీర్తిని కించపర్చాలన్న రాజకీయ కుట్ర ఉన్నదని తెలిపారు. వాస్తవానికి గోదావరి జలాలతో తెలంగాణలోని భూములకు సాగునీరు అందిస్తామంటూ 2007లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ప్రణాళిక రూపకల్పన జరిగినప్పటికీ మహారాష్ట్రతో తలెత్తిన అంతర్‌రాష్ట్ర సమస్యలు, నీటి కొరత కారణంగా ఆ ప్రాజెక్టులో కదలిక లేకపోయిందని చెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ ద్వారా జరిపించిన సర్వే నివేదికను అధ్యయనం చేసి.. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల వద్ద బరాజ్‌ల నిర్మాణాలతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టాలని అప్పుడు సీఎంగా ఉన్న పిటిషనర్ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దీనికి సెంట్రల్ వాటర్ కమిషన్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీల నుంచి అధికారిక అనుమతులు లభించాయని చెప్పారు. కానీ కమిషన్ ఇచ్చిన నివేదికలో మాజీ సీఎం కేసీఆరే స్వయంగా ప్రాజెక్ట్ ప్రదేశాలను ఎంపిక చేశారని పేర్కొనడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. క్యాబినెట్ ఆమోదం లేకుండా పరిపాలనా అనుమతులు పొందారని నివేదికలో పేర్కొనడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా, అదనపు పనులకు మౌఖిక ఆదేశాలిచ్చారనే విషయంలో కూడా వాస్తవం లేదని చెప్పారు. మూడు బారాజ్‌లలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయించడం వల్ల మేడిగడ్డకు నష్టం వచ్చిందనేది అభూతకల్పన అని అభివర్ణించారు. ప్రణాళిక నుంచి నిర్మాణం వరకు అనేక ఆర్థిక, విధానపర లోపాలు చోటు చేసుకున్నాయని, పిటిషనర్లు ఇద్దరూ వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయాలే అందుకు కారణమని కమిషన్ తేల్చే ముందు వారికి నోటీసులు ఇవ్వలేదని న్యాయవాదులు తెలిపారు. కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేయాలని, ఎవరు తప్పు చేశారో, ఎవరు ఒప్పు చేశారో తేల్చే అధికారం దానికి లేదని అన్నారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8-బీ- 8-సీ ప్రకారం, ఒక వ్యక్తి తీరును తప్పుపడుతూ ఆరోపణలు ఉంటే ఆ వ్యక్తికి నోటీసులు ఇచ్చి క్రాస్ ఎగ్జామిన్ చేయాలని సుప్రీంకోర్టు పలు కేసుల్లో తీర్పులు చెప్పిందని గుర్తుచేశారు. కమిషన్ పనితీరు సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా, ప్రాథమిక న్యాయసూత్రాలను ఉల్లంఘించేదిగా ఉన్నదని చెప్పారు. పిటిషనర్లకు వ్యతిరేకంగా అభియోగాలు ఉండి ఉంటే వారికి నిర్దోషులుగా నిరూపించుకొనే అవకాశం ఇవ్వాలని అన్నారు. కమిషన్‌కు శిక్ష విధించే అధికారం లేదని రామకృష్ణ దాల్మియా కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పిందని అన్నారు. కిరణ్‌బేడి కేసులో 8-బీ సెక్షన్ కింద నోటీసు ఇవ్వలేదని సుప్రీంకోర్టు తప్పుపట్టిందని తెలిపారు. వ్యక్తి ప్రతిష్ఠ దెబ్బతినేలా విచారణ కమిషన్ వ్యవహారం ఉండరాదని ఎల్‌కే అద్వానీ-బీహార్ మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందన్నారు. వేర్వేరు కేసులలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వానికి కమిషన్ 650 పేజీల నివేదిక ఇస్తే దానిని 60 పేజీలకు కుదించారని తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకుని సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో పిటిషనర్లు దారుణమైన తప్పులు చేశారని తేల్చడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. కమిషన్ నివేదికను మంత్రివర్గం ఆమోదం తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని, సభ నిర్ణయానికి అనుగుణంగా నివేదికపై తదుపరి చర్యలు ఉండాలని, అయితే, సీఎం ముందుగానే నివేదికలోని కీలక విషయాలను బహిర్గతం చేశారని తప్పుపట్టారు. ప్రజాజీవితంలో ఉన్న పిటిషనర్ల ప్రతిష్ఠను దెబ్బతీయాలన్న కుట్ర దాగి ఉన్నదని అన్నారు. తక్షణమే హైకోర్టు స్పందించి పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తుది తీర్పులో కమిషన్ నివేదికను రద్దు చేయాలని, కమిషన్ ఏర్పాటు జీవో-6ను కూడా రద్దు చేయాలని కోరారు.

కాళేశ్వరంతో రాష్ట్రమే మారిపోయింది

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం సమర్థంగా, విజయవంతంగా జరిగిందని, దీంతో వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా నిలిచిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు చెప్పారు. జంటనగరాలు, అనేక పట్టణాలకు తాగునీటి సదుపాయం లభించిందని తెలిపారు. మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1531 కిలోమీటర్ల కాలువలు, 38 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 530 మీటర్ల ఎత్తిపోతల వ్యవస్థతో 240 టీఎంసీల నీటి వినియోగం కోసమే ప్రాజెక్టును నిర్మించారని వివరించారు.

నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతాం

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కమిషన్ ముందున్న సమాచారం ఆధారంగా సెక్షన్ 8-బీ, 8-సీ కింద నోటీసు ఇవ్వాలో లేదో కమిషన్ నిర్ణయిస్తుందని అన్నారు. మేడిగడ్డ రిజర్వాయర్ దెబ్బతిన్నదని, ప్రమాదకరంగా మారిందని చెప్పారు. కమిషన్ నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని, శాసనసభ సమగ్రంగా చర్చిస్తుందని, పిటిషనర్లు ఇద్దరూ అదే సభలో సభ్యులుగా కూడా ఉన్నారని తెలిపారు. సభలో చర్చించాక నివేదికపై ఏ విధంగా ముందుకు వెళ్లాలో తుది నిర్ణయం ఉంటుందని, ఈలోగా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. రెండు వ్యాజ్యాలను కొట్టివేయాలని, లేనిపక్షంలో తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేస్తామని చెప్పారు. వాదనల అనంతరం ద్విసభ్య ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

రాష్ట్రానికి హైకోర్టు సూటి ప్రశ్నలు

'జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో పెట్టి చర్చ చేస్తారా? లేక చర్యలు తీసుకున్నాక చర్చ చేస్తారా? ఈ కేసులో ఈ రెండు ప్రశ్నలే అత్యంత కీలకం. దీనిపై వచ్చే మంగళవారం ప్రభుత్వం వివరణ ఇస్తామంటే కుదరదు. రేపే అంటే శుక్రవారమే చెప్పాలి. ఇంతకీ నివేదిక ఏ దశలో ఉంది? పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావుకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్-1952లోని 8బీ సెక్షన్ కింద నోటీసులు ఇవ్వలేదా? వారిద్దరూ సాక్షులుగానే కమిషన్ ఎదుట హాజరయ్యారా? కమిషన్ యాక్ట్‌లోని 5(2) సెక్షన్ కింద అంటే సాక్షిగా హాజరుకావాలని వాళ్లకు కమిషన్ నోటీసు ఇచ్చిందా? క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు సెక్షన్ 8-సీ నోటీసు కూడా ఇవ్వలేదా? ఇంతకీ అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహిస్తారు? కమిషన్ రిపోర్టు అధికారికంగా విడుదల చేశారా? నివేదిక మీడియాలో ప్రచురణ-ప్రసారం అయ్యిందా? రిపోర్టు పబ్లిక్ డొమైన్‌లో ఉందా? ఆ మీడియాకు రిపోర్టు ఎలా చేరింది?' అంటూ విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

సుప్రీం మార్గదర్శకాలకు తిలోదకాలు

'**కాళేశ్వరం** ప్రాజెక్టుపై సాక్షిగా హాజరుకావాలని 5(2) సెక్షన్ కింద జస్టిస్ ఘోష్ కమిషన్ నోటీసు ఇచ్చింది. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో సాక్షిపై నిందలు మోపారు. ప్రభుత్వం సంక్షిప్తం చేయించిన 60 పేజీల నివేదికలో పలు అభియోగాలు ఉన్నాయి. సాక్షిపై ఎలా అభియోగాలు మోపుతారు? సెక్షన్ 8-బీ, 8-సీ కింద నోటీసులు ఇచ్చి ఆరోపణలు చేసిన వాళ్లను క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు ఎందుకు అవకాశం ఇవ్వలేదు. ఎల్‌కే అద్వాణీ, కిరణ్‌బేడి కేసులలో సాక్షులను ప్రశ్నించే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్దిష్ట మార్గదర్శకాలు చేసింది. అందుకు విరుద్ధంగా కమిషన్ చర్యలున్నాయి. సహజ న్యాయసూత్రాలకు తిలోదకాలిచ్చింది' అని హరీశ్‌రావు తరపు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదించారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఈ చట్టం ఎవరికి చుట్టం!

కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంలో కాంగ్రెస్ పట్టా పుచ్చుకుంటే, బీజేపీ పీహెచ్‌డీ చేసింది. అయితే మోదీ, కాదంటే ఈడీ అనే మాట ఊరికే రాలేదు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ సర్కార్ ఉపయోగించే సాధనాల్లో ఈడీ కేసులు పెట్టడమనేది ప్రముఖంగా ఉండటమే ఇందుకు కారణం. ఇప్పుడు అదే పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు ఓ విచిత్రమైన చట్టాన్ని పార్లమెంట్ ముందుంచింది. ప్రధాని, సీఎం, మంత్రులు ఇలా ఎవరైనా, ఏదైనా కేసులో అరెస్టయి నెలరోజులు జైలులో ఉండాల్సి వస్తే వారి పదవులను ఉన్నపళంగా ఊడగొట్టేందుకు ఈ చట్టం తెస్తున్నట్టు చెప్పుకొంటున్నది. సంబంధిత మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గందరగోళం మధ్య పార్లమెంటులో ప్రవేశపెట్టారు. విపక్షాల తీవ్ర అభ్యంతరాలతో వాటిని జేపీసీకి పంపారు. పెద్ద రాజకీయ దుమారానికి కారణమైన బిల్లుల్లో ఏముందో పరిశీలిస్తే విస్మయం కలుగక మానదు. ప్రధాని, కేంద్రమంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, మంత్రులు తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలతో అరెస్టయి జైలుకు వెళ్తే వారిని ఆ పదవుల నుంచి తొలగించే చట్టాన్ని కొత్త చట్టాలు సమకూరుస్తాయని కేంద్రం అంటున్నది. ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల జైలుశిక్ష పడేందుకు అవకాశమున్న నేరారోపణలపై 30 రోజులు కస్టడీలో గడిపితే, 31వ రోజు వారిని తొలగించేందుకు ఈ బిల్లులు వీలు కల్పిస్తున్నాయి. విడుదలయ్యాక తిరిగి పదవుల్లో నియమించవచ్చనీ తెలియజేస్తున్నాయి.

రాజకీయాలను నేర, అవినీతి రహితం చేయాలనే సదుద్దేశంతో బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లులను తెస్తున్నదంటే ఎవరూ నమ్మడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతూ విపక్ష నేతలను ముప్పుతిప్పలు పెడుతున్న బీజేపీ హయాంలో కేసులు పెరిగితే అవి కంచికి చేరి శిక్షలు పడిన సందర్భాలు బహుతక్కువ అని గణాంకాలు ఉద్ఘోషిస్తున్నాయి. అనేక సందర్భాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలపై, ముఖ్యంగా ఈడీపై కోర్టులు మండిపడ్డాయి. జార్ఖండ్ సీఎం హేమంత్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. నేరం రుజువయ్యేవరకు శిక్ష విధించరాదనేది సహజ న్యాయ సూత్రం. కానీ, కేవలం ఆరోపణలు ఎదుర్కొంటూ నెలరోజులు జైల్లో గడిపితే పదవి ఊడగొట్టడమనే నిరంకుశ చట్టం అవసరమా? అనేది అసలు ప్రశ్న.

కేవలం విపక్ష ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెట్టి, తాత్కాలికంగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆయా ప్రభుత్వాల ముఖ్యులను అరెస్టు చేసి నెలల తరబడి జైళ్లలో పెట్టడం బీజేపీ హయాంలో రివాజుగా మారింది. తన పక్షం అయినవారు కేసులున్నా రాత్రికి రాత్రే కడిగిన ముత్యాలు అయిపోవడమూ చూస్తున్నాం. ఈ చరిత్ర అంతా కండ్ల ముందే ఉంటే, ఇప్పుడు ప్రధాని సహా అందరినీ చట్ట పరిధిలోకి తెస్తున్నామని కేంద్రం గడుసుతనం చూపిస్తున్నది. అయిదేండ్లకు పైగా శిక్ష పడే క్రిమినల్ కేసులో ఉన్న వ్యక్తి ప్రధాని పదవిలోకి వస్తారా? ఒకవేళ వస్తే గిస్తే ఆయనపై తగిన చర్య తీసుకునేందుకు ఇప్పుడున్న చట్టాలు సరిపోవా? అనేది మరో ప్రశ్న. ఇది పిల్లికి రొయ్యల మొలతాడు కట్టడం తప్ప మరోటి కాదని చెప్పక తప్పదు.

ఎవుసం ఏట్లకు.. షాత మంట్లకు



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

వద్దనుకున్న దృశ్యాలే మళ్లీ మళ్లీ కనిపిస్తున్నాయి. పాత పీడకలలు వాస్తవ రూపం దాల్చి కండ్లముందు తిరుగాడుతున్నాయి. ఎరువుల కోసం రైతులు ఇక్కట్లు పడకూడదని, కరెంటు కోసం అగచాట్లు పడకూడదని తెలంగాణ సమాజం కోరుకున్నది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలోని ప్రధాన ఆకాంక్ష కూడా ఇదే. కానీ, జరుగుతున్నదేమిటి? యూరియా కోసం రైతుల పడిగాపులు. పెద్ద పెద్ద క్యూ లైన్లు. తోపులాటలు, తొక్కిసలాటలు, పోలీసుల కాపలా, తెల్లవారకముందే వరుసలో నిల్చోవడం, నిలబడే సత్తువ లేక చెప్పులను పెట్టడం.. ఒక్కటేమిటి.. చూసేవారికి కడుపు తరుక్కుపోతున్నది. జడివానలో తడుస్తూ నిల్చోవాల్సి రావడం అన్నింటికన్నా దారుణం.

ఇంత కష్టపడితే చివరికి దక్కేది ఒకే ఒక్క బస్తా. ఏదో రేషన్ ఇచ్చినట్టుగా విదిలింపు. దీని కోసం యుద్ధం చేయాల్సినంత పరిస్థితి. తెలంగాణ ఏర్పడ్డాక రైతుల కష్టాలు తీరి, ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్ రాష్ట్రంగా ఎదిగిన తర్వాత కూడా రైతులకు పాత కష్టాలు ఎదురయ్యాయంటే అందుకు కారణం ప్రస్తుత పాలకులే. ముందుచూపు కొరవడినందు వల్లనే ఇన్ని అవస్థలు పడాల్సి వస్తున్నది. ఏటా మే-జూన్ నెలల్లో వ్యవసాయం పనులు ప్రారంభం కాకముందే ఎరువులను సమకూర్చుకోవాలి. కానీ, ఈ ఏడాది అలా జరగలేదు.

రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా కేంద్రం యూరియాను కేటాయిస్తుంది. అయితే, సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకం. వర్షాలు, నీటి నిల్వలను గమనించి, పంటల సాగు విస్తీర్ణం ఎంత ఉంటుందో అంచనా వేయాలి. దానికి అనుగుణంగా యూరియా ఎంత అవసరమో, ఏయే నెలల్లో దాన్ని పంపించాల్సిన అవసరం ఉంటుందో సమగ్ర ప్రణాళిక రచించాలి. ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ప్రస్తుత దురవస్థ. దేశంలో తెలంగాణలోనే ఖరీఫ్ సీజన్ అందరికంటే ముందుగానే ప్రారంభమవుతుంది. బోర్లు, నీటి వనరులు ఉన్నచోట జూన్ కన్నా ముందుగానే నారుమళ్లు తయారు చేస్తారు. అందువల్ల తక్కువలో తక్కువగా మే నెల నాటి నుంచే యూరియా సరఫరాపై దృష్టిపెట్టాలి. నెలవారీగా ఎన్ని టన్నులు కావాలో ముందుగానే తెలియజేస్తే కేంద్రానికి కూడా వెసులుబాటు ఉంటుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా అన్ని రాష్ట్రాలకు సర్దుబాటు చేయగలుగుతుంది. కానీ, రాష్ట్ర సర్కారు అలా చేయలేకపోయింది. తెలంగాణలో జూలై-ఆగస్టు నెలల్లో యూరియా వినియోగం అధికంగా ఉంటుంది. ఆగస్టు నెలలో ప్రతి జిల్లాలో కనీసం 10,000 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండేలా చూడాలి. కేసీఆర్ ప్రభుత్వం దాన్ని చేసి చూపింది కూడా. కానీ, ప్రస్తుతం 500-1000



మెట్రిక్ టన్నులకు మించి ఎక్కడా అందుబాటులో లేదు. కారణం.. ప్రణాళికా లోపం.

> యూరియా సరఫరాకు సమన్వయకర్తగా వ్యవహరించే మార్క్‌ఫెడ్ వద్ద ఎల్లప్పుడూ కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్ కింద నిల్వ చేయాలి. ప్రస్తుతం అది 23 వేల టన్నులకు మించి లేదు. కేంద్రానికి ఎంత ఇండెంట్ పెట్టాలి? ఏయే నెలల్లో ఎంతెంత తీసుకురావాలి? ఏయే జిల్లాలకు పంపాలి? రైలు వ్యాగన్ల అందుబాటు, లోడింగ్, అన్ లోడింగ్ తదితర అంశాలపై కేసీఆర్ సర్కారు స్పష్టమైన ప్లాన్ రూపొందించింది. దాన్ని ప్రస్తుతం పాలకులు అమలు చేయకపోవడంతోనే ఇన్ని సమస్యలు.

ఆగస్టు నాటికి 9.25 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం అందించాల్సి ఉండగా, ఈ ఏడాది మొత్తానికి 6.5 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే కేటాయించింది. ఇంతవరకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నులు అందింది. కేటాయింపుల్లోనే 2 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది. ఇచ్చిన దాన్నయినా తీసుకువచ్చే ఏర్పాట్లు కనిపించకపోవడంతో అదును దాటిపోతోందన్న భయం రైతుల్లో కనిపిస్తున్నది. అందుకే రైతులు రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారు.

'రెండు కోట్ల ఎకరాల మాగాణి తెలంగాణ' అన్నది కేసీఆర్ ప్రభుత్వం పెట్టుకున్న ఉదాత్త ఆశయం. దానిని అధిగమించిందే తప్ప, వెనకడుగు వేసింది లేదు. గతేడాది 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు వేయగా, ఈ సారి పంట విస్తీర్ణం ఏకంగా 22 లక్షల ఎకరాల మేర తగ్గింది. వర్షాలు ముంచెత్తిన ప్రస్తుత పరిస్థితిలోనూ సాగు విస్తీర్ణం తగ్గడం ఆశ్చర్యకరం. 44 లక్షల ఎకరాలకు కూడా యూరియా సరఫరా కావడం లేదు. ఇది ప్రభుత్వ తప్పిదం తప్ప మరొకటి కాదు. ఇక్కడే కేసీఆర్ యాదికి వస్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇదే సమయానికి రాష్ట్రంలోని అన్ని పంటలకు 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యేది. సరఫరా వ్యవస్థను ఆయన స్వయంగా ఎప్పటికప్పుడు రియల్ టైంలో పర్యవేక్షించేవారు. 2019లో జరిగిన సంఘటనలను ఒక్కసారి గుర్తుకుతెచ్చుకోవాలి. విశాఖపట్నం ఓడరేవు నుంచి లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించి మూడు రోజుల్లోనే తెలంగాణ అంతటా పంపిణీ చేయించారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులతో మాట్లాడి 25 స్పెషల్ గూడ్స్ రైళ్లు ఏర్పాటు చేయించారు. 4,000 లారీల ద్వారా పల్లెపల్లెకు పంపించారు. రైతులకు నష్టం, కష్టం కలగొద్దన్నది ఆయన నిరంతర తపన. ఏప్రిల్-మే నాటికే నిల్వలను సిద్ధం చేయించేవారు. అధికారులను ఢిల్లీకి పంపించి ఏ నెలలో ఎంత మేర పంపించాలన్న ప్రణాళికలు కేంద్రానికి అందేలా చూసేవారు. కేంద్రం నుంచి లిఖితపూర్వక హామీలూ పొందేవారు. అందుకే రైతులు కిరాణా షాపునకు వెళ్లి సరకులు తెచ్చుకున్న రీతిలో ఎరువులు కూడా తెచ్చుకునేవారు.

ఎరువులను పంపిణీ చేసే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను తగిన విధంగా సన్నద్ధం చేయకపోవడం మరో లోపం. ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్తే అవసరం లేని ఎరువులను కూడా అంటగడుతున్నారు. ఒకప్పుడు పొలం గట్ల మీద పడుకున్న రైతులు ఇప్పుడు షాపుల ముందు పడుకోవాల్సి వస్తున్నది. తగినంత యూరియాను అందజేసేందుకు కొత్తగా ప్రణాళికలు, వ్యూహాలు అవసరం లేదు. కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి, అమలు చేసిన విధానాలను అనుసరిస్తే చాలు. తగినంతగా ఇచ్చామని కేంద్రం, ఇవ్వలేదని రాష్ట్రం పరస్పరం ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ పోతే రైతులకు ఒరిగేదేమీ ఉండదు. యూరియా ఎంత అవసరం? ఉన్న నిల్వలు ఎంత? కేంద్రం నుంచి ఇంకెంత రావాల్సి ఉంది? వంటి కచ్చితమైన సమాచారాన్ని రైతుల ముందుంచాలి. ప్రస్తుత పరిస్థితిని అత్యవసరమైనదిగా పరిగణించి యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేయడంపై దృష్టి సారించాలి. అప్పుడే వారిలో ఆందోళన తగ్గుతుంది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)

గోదారి సంద్రానికి.. మన దారి బొంబాయికి



వి.ప్రకాశ్

> 'సస్యశ్యామల దేశం /అయినా నిత్యం క్షామం.../ఉప్పొంగే నదుల జీవజలాలు/ ఉప్పు సముద్రం పాలు/ యువకుల శక్తికి భవితవ్యానికి/ ఇక్కడ తిలోదకాలు..'

సినీ కవి ఆరుద్ర 1971లో పవిత్రబంధం సినిమా కోసం రాసిన ఈ పాట తెలంగాణ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లయినా దేశంలోని వర్షాధార (పెనిన్సులార్) నదుల్లో కనీసం సగం జలాలను కూడా సాగుకు మళ్లించకుండా సముద్రంపాలు చేస్తున్న నది గోదావరి, ఆ రాష్ట్రం పేరు తెలంగాణ! దేశంలో ప్రవహించే వర్షాధార జీవనదులన్నీ వేసవిలో ఎండిపోయి తమ 'సజీవ' స్వభావాన్ని కోల్పోయి వెక్కిరిస్తున్నా 'మనకు అండగా ఉన్నా'నంటూ కోట్లాది బతుకులకు భరోసా ఇస్తూ మహోధృతంగా ప్రవహించే గోదావరిని చూసి గర్వపడదామా? శతాబ్దాలుగా తలాపున పారుతున్న గోదారి నీళ్లను ఎండుతున్న మన చేనూ, చెలకలకూ మళ్లించుకోనందుకు సిగ్గుపడదామా? దశాబ్దాలుగా గోదారి జలాలు సముద్రం పాలవుతుంటే దిక్కులేక లక్షలాది ప్రజల దారి మాత్రం దుబాయి, బొంబాయి, బొగ్గుబాయి లేదా బస్తర్ అడవులకు.

గోదావరి జలాల వినియోగానికి తొలి ప్రయత్నాలు: గత శతాబ్దిలో ఒకే ఒక్కడు.. అప్పటి పాలకుని అండదండలు పుష్కలంగా ఉన్న గొప్ప ఇంజినీర్ మీర్ అహ్మద్ అలీ అలియాస్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహద్దూర్ (ఆయన జన్మదినమే తెలంగాణకు ఇంజినీర్స్ డే). ఆయన నిర్మించిన ప్రాజెక్టులు, పథకాలు, ప్రణాళికలు, మరమ్మతులు, చేసిన పనులు పరిశీలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. గోదావరి ఉపనది అయిన మంజీరా జలాలను మెతుకు సీమ బీళ్లకు మళ్లించడానికి తొలి ప్రయత్నమే ఘణపురం ఆనికట్. దీన్ని నిర్మించి మహబూబ్‌నగర్, ఆసిఫ్‌నగర్ కాల్వలతో వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేశారు. అదే మంజీరా నదిపై ఆసియా ఖండంలోనే ఎక్కడాలేని టెక్నాలజీని జర్మనీ వంటి దేశాల నుంచి తెప్పించి రెండు లక్షల డెబ్బై అయిదు వేల ఎకరాలకు నీరిచ్చే నిజాంసాగర్‌ను వందేండ్ల క్రితమే నిర్మించారు. అవే మంజీరా జలాలతో పోచారం ప్రాజెక్టుకు ప్రాణం పోశారు. మంజీరాలో ఇంకా మిగిలిన నీళ్లను సాగుకు మళ్లించడానికి 38 టీఎంసీల దేవునూరు బహుళార్థ సాధక ప్రాజెక్టుకు ప్రణాళికను సిద్ధం చేశారు. నిజాంసాగర్ వంటి గొప్ప ప్రాజెక్టుకు ఇసుక కొట్టుకురాకుండా నివారించాలనే గొప్ప సంకల్పం ఈ దేవునూరు ప్రాజెక్టు వెనుక ఉన్నది.

అతిపెద్ద గోదావరి ప్రాజెక్టు: గోదావరిలో లభ్యమవుతున్న అపారమైన జలరాశిని తెలంగాణలో అప్పటి ఎనిమిది జిల్లాల్లో ఆరు జిల్లాలకు మళ్లించడానికి 28 లక్షల ఎకరాలకు సాగునీరివ్వడానికి మూడు డ్యాములు, పలు కాల్వలు, ఆనికట్‌లతో గోదావరి బహుళార్థ సాధక ప్రాజెక్టుకు ప్రాణం పోయాలనుకున్నారు. ఈ ప్రాజెక్టులో అంతర్భాగమే పోచంపాడు ప్రాజెక్టు (ప్రస్తుత శ్రీరాంసాగర్).




నిర్మాణంపై కేఎల్ రావు అనుమానం: మద్రాసులోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్' సమావేశంలో 1958 ఆగస్టులో ప్రముఖ ఇంజినీర్ కె.ఎల్.రావు మాట్లాడారు. 'ఇరుగు పొరుగు ప్రాంతాల కన్నా తెలంగాణ అత్యధికంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతం. నీటిపారుదల వసతి పంజాబ్‌లో 32 శాతం, యూపీలో 25 శాతం ఉండగా తెలంగాణలో 10 శాతమే. దీనిలో కూడా కాల్వల కింది సాగు అతి స్వల్పం. నీటి వసతికి గొప్ప ఆధారం (గోదావరి, కృష్ణా) ఉండి, సారవంతమైన భూములుండి, తగినంత వర్షాపాతం ఉన్నా బీడు పడి తెలంగాణ పేదరికంలో మగ్గుతున్నది. ఈ వనరులేవీ ప్రజలకు ఉపయోగపడటం లేదు. బీడు భూములను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయగల సమగ్రమైన పోచంపాడు ప్రాజెక్టు నిర్మించకుండా తెలంగాణ అభివృద్ధి సాధ్యపడదు. ప్రస్తుతం దుర్భిక్ష ప్రాంతంగా ఉన్న తెలంగాణ పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణంతో భారతదేశానికే అతిగొప్ప ధాన్యాగారంగా విరాజిల్లుతుంది' అని ఆయన అన్నారు.

> మరో ఆసక్తికరమైన వ్యాఖ్య కూడా కె.ఎల్.రావు చేశారు. 'భారతదేశ వికాసానికి, తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి గోదావరి లోయలోని అన్ని ప్రాజెక్టులలోకెల్లా పోచంపాడు అత్యంత ప్రాధాన్యం కలది. 1794లో కావేరీ నదిపై ప్రస్తుతం ఉన్న కృష్ణరాజసాగర్ స్థలంలో ఒక డ్యాం నిర్మాణాన్ని మొదలుపెట్టిన సందర్భంగా టిప్పు సుల్తాన్ (అక్కడి రాజు) ఏ 'నమ్మకాన్ని' వ్యక్తపరిచాడో మనం అదే నమ్మకాన్ని ఏర్పరచుకుందాం. 'ప్రారంభం మాత్రం నా చేతిలో ఉన్నది. కానీ, దీన్ని పూర్తిచేసే బాధ్యత దేవునిపై ఉన్నది' అంటూ పోచంపాడు భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చెప్పకనే చెప్పారు కె.ఎల్.రావు (ఆధారం: తెలంగాణ రీజినల్ కమిటీ అంచనాల కమిటీ రిపోర్ట్ 1969-70, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ).

అలీనవాజ్ జంగ్ గోదావరి జలాల వినియోగం కోసం ప్రతిపాదించిన ప్రాజెక్టులలో లోయర్ పెన్‌గంగా, ప్రాణహిత కూడా ఉన్నాయి. రెండు వేల టీఎంసీల ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ ఆధునిక తెలంగాణ రూపశిల్పి సర్ సాలార్‌జంగ్ బ్రిటిష్ మిలిటరీ ఇంజినీర్ ఆర్థర్ కాటన్‌తో కలిసి నిర్మాణ పనులు ప్రారంభించి, విష జ్వరాలతో అడవిలో ఫ్రెంచ్ ఇంజినీర్లు మరణించడంతో 1858లో అర్ధాంతరంగా వదిలేసిన ఇచ్చంపల్లి బహుళార్థ సాధక ప్రాజెక్టు (136 మీటర్ల ఎత్తు, రెండు వేల టీఎంసీల నీటి నిల్వ) పథకం ఫైళ్లను బయటికి తీశారు. 1947లో నిజాంతో చర్చించి సముద్ర మట్టానికి 370 అడుగుల ఎత్తులో 295 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు అప్పుడు నీటిపారుదల కార్యదర్శిగా ఉన్న అలీ నవాజ్ జంగ్ బహద్దూర్.

తెలంగాణలో నదీజలాల వాటా కోసం వెల్లోడి కృషి: తెలంగాణలోని ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు పొందడానికి 1951 జూలై 27, 28 తేదీల్లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం నిర్వహించిన అంతర్రాష్ట్ర నదీజలాల సమావేశానికి తానే స్వయంగా హాజరై గోదావరిలో తెలంగాణకే 845.70 టీఎంసీల (మొత్తం కలిపి వెయ్యి టీఎంసీలు) గోదావరి జలాల కేటాయింపులను పొందినారు అప్పటి హైదరాబాద్ ముఖ్యమంత్రి ఎం.కె.వెల్లోడి (ఐసీఎస్ అధికారి). అప్పటికే మరో 150 టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణ ప్రాంతంలో శతాబ్దాల క్రితం నిర్మించిన చెరువులు, కుంటల ద్వారా వినియోగిస్తున్నారు. సుమారు వెయ్యి టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణలో వినియోగించే ప్రయత్నం నిజాం పాలనలోనే మొదలుకాగా ఆ పథకాలను, ప్రణాళికలను, అలీ నవాజ్ జంగ్, నిజాం కన్న కలలను, కోటి తెలంగాణ రైతుల ఆశలను, భవిష్యత్తును బూడిదపాలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం.

(వ్యాసకర్త: చైర్మన్, భారత వర్షాధార నదీ పరీవాహక ప్రాంతాల కౌన్సిల్)



భారత్‌తో స్నేహాన్ని కోల్పోవడం వైఫల్యమే!

రష్యా నుంచి భారతదేశమే కాదు, చైనా కూడా పెద్ద ఎత్తున చమురు కొనుగోలు చేస్తున్నది. కానీ, చైనాపై అమెరికా ఎలాంటి ఆంక్షలు విధించకపోవడమే విడ్డూరం. భారత్-అమెరికా సంబంధాలు విచ్ఛిన్న దశలో ఉన్నాయి. అమెరికా వీలైనంత త్వరగా వివాదాలను పరిష్కరించుకోవాలి. ఒకవేళ భారత్‌తో పూర్తిస్థాయి స్నేహాన్ని కోల్పోతే అమెరికా రక్షణపరంగా లక్ష్యసాధనలో విఫలమైనట్టే. అంతేకాదు, ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో అమెరికా గనుక ఉంటే, వెంటనే భారత్‌కు చేరువ కావాలి.

- నిక్కీ హేలీ, ఐరాసలో యూఎస్ మాజీ రాయబారి





సమస్యను వదిలి స్వార్థ రాజకీయం



బద్రినర్సన్

ఎంత పాత తెలుగు సినిమాలోనైనా నగలు తాకట్టు లేదా కొనే దుకాణాన్ని చూపే సన్నివేశంలో తలపై టోపీ పెట్టుకొని, వచ్చీ రాని తెలుగు మాట్లాడే మార్వాడీనే చూపిస్తారు. అంటే తెలుగు ప్రేక్షకుడు ఆ వ్యాపారంలో మరొకరిని అంగీకరించడనే భావన అప్పుడే సినిమావాళ్లలో ఏర్పడింది. మద్రాస్ వీధుల్లో చిత్రీకరించిన తెలుగు సినిమాలో ఇలా ఉందంటే సుమారు వందేండ్ల క్రితమే మార్వాడీలు ఈ రెండు రాష్ట్రాల్లో అలా స్థిరపడ్డారన్నమాట.

డబ్బు, పెట్టుబడితో ముడిపడి ఉన్న సకల వ్యాపారాల్లో వారు బ్రిటిష్ కాలంలోనే మార్వాడీలు దేశమంతా విస్తరించారు. తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఆ విస్తరణకు లోబడిన ప్రాంతాలే. యాభై, అరవై ఏండ్ల క్రితమే హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో 'మార్వాడీ భోజనాలయ్' ఉండేది. అందులో కేవలం ఉత్తరాది వంటకాలు వడ్డించినా అందరూ తినేవారు. ఆ హోటల్‌కు ఒక జాతిని తెలిపే పేరు పెట్టడంలో ఎన్నో అర్థాలున్నాయి.

ఇప్పుడైతే దేశంలో మార్వాడీ అంటే తెలియనివారు ఉండరని చెప్పవచ్చు. ఆ పదాన్ని కొన్ని సందర్భాల్లో విశేషణంగా కూడా వాడతారు. అధిక వడ్డీతో తీరని అప్పును 'అది మార్వాడీ వడ్డీ' అని చెప్పుకొంటారు. వ్యాపార విషయాల్లో సాటి మనుషులతో మార్వాడీ నిర్దయగా, నిరంకుశంగా ఉంటాడనడానికి ఇవి తార్కాణాలు. అయితే ఈ కారణాలతో జాతి మొత్తాన్ని ఒక్క గాటన కట్టలేము. ఎందుకంటే దేశంలో ఎన్నో పరిశ్రమలు స్థాపించిన బిర్లా, మిట్టల్, దాల్మియా, బజాజ్, జిందాల్ కుటుంబాలు కూడా మార్వాడీ సంతతే. అయినా సరే, దేశంలోని వివిధ ప్రాంతాల్లో మార్వాడీలకు వ్యతిరేకంగా లేవనెత్తిన ఉద్యమాలను కూడా తప్పుపట్టలేము. మార్వాడీల్లోని కొత్త తరం దూకుడు వల్ల కొంతకాలంగా స్థానికుల్లో అసహనం, వ్యతిరేకత గూడుకట్టుకున్నాయి. 'మా నేలపై మీ వ్యాపార పెత్తనమేమిటి?' అనే ప్రశ్నలు రాజుకుంటున్నాయి.

> అసోం రాష్ట్రంలో ఆగస్టు 13న ఒక మార్వాడీ యువకుడు 17 ఏండ్ల అస్సామీ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానిక అస్సామీ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. రాజీపడిన ఆ యువకుడి కుటుంబం మోకాళ్లపై కూర్చొని బహిరంగ క్షమాపణ చెప్పక తప్పలేదు. ఇంతటితో ఆగకుండా అస్సామీ సంఘాలు కొన్ని డిమాండ్లను కూడా మార్వాడీల ముందుంచాయి. స్థానికుల భూములు కొనవద్దని, దుకాణాల్లో 90 శాతం అస్సామీలకే ఉద్యోగాలు ఇవ్వాలని, దుకాణాల బోర్డులను హిందీలో కాకుండా స్థానిక భాషలో ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. అంటే ఆ సంఘటన మాధ్యమంగా స్థానికుల్లో ఉన్న ఇన్నేళ్ల అసహనం బయటపడింది.

2023 డిసెంబర్‌లో బెంగళూరులోని చిక్కపేటలో మార్వాడీలు దుకాణాల బోర్డు విషయంలో కన్నడ భాషను పట్టించుకోవడం లేదని, నామమాత్రంగా చిన్న అక్షరాలు వాడుతున్నారని కన్నడ సంఘాలు గొడవకు దిగాయి. చివరకు ఇంగ్లిషులో చిన్న, కన్నడంలో పెద్ద అక్షరాలతో దుకాణాల బోర్డులు మార్చక తప్పలేదు. ఇక్కడ కూడా ఇది కేవలం భాషకు సంబంధించిన చిన్న విషయంగా కొట్టిపారేయలేము. స్థానికులకు మార్వాడీల పట్ల ఉన్న వ్యతిరేకతను ఈ విధంగా వ్యక్తపరిచారని కూడా అనుకోవచ్చు. పదేండ్ల క్రితం ఒడిశాలో ఓ సంఘటన మూలంగా మార్వాడీల ఆస్తుల ధ్వంసమే జరిగింది. వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణకు వెళ్లిన యువకులతో ఓ మార్వాడీ దుకాణాదారు అవమానకరంగా మాట్లాడటంతో ఈ గొడవ మొదలైంది. దాంతో స్థానికులపై పట్టింపులేని మార్వాడీలు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలనే నినాదం మార్మోగింది. మొఘలుల కాలంలో ఆ ప్రాంతానికి వలస వచ్చిన మార్వాడీలు మొత్తం వ్యాపారాలను కైవసం చేసుకొని అధిక ధరలు, నాణ్యతలేని సరుకులతో ప్రజల రక్తాన్ని పీల్చుకుంటున్నారని స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సెగ బీహార్, పశ్చిమ బెంగాల్‌కు కూడా పాకే ప్రమాదాన్ని రాజకీయ ప్రమేయంతో నిలువరించారు.

2021లో మెదక్ జిల్లా తూప్రాన్‌లో 'మార్వాడీ హటావో, తూప్రాన్ బచావో' అనే ఆందోళన మొదలవగా స్థానిక అగర్వాల్ సంఘ నేతలు దీన్ని సామరస్యంగా పరిష్కరించారు. తెలంగాణ అభివృద్ధిలో తాము భాగమని, సమాజానికి తిరిగివ్వడం తమ బాధ్యత అని చెప్పి స్థానికులను వారు శాంతింపజేశారు. తిరిగి ఇప్పుడు అమనగల్‌లో మార్వాడీలకు వ్యతిరేకంగా ఆందోళన మొదలైంది. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి వచ్చినవారు స్థానికుల వ్యాపారాలను దెబ్బతీస్తున్నారు, సగానికి పైగా నాణ్యత లేని వస్తువులను అమ్ముతున్నారని వారు అంటున్నారు. నాసిరకం సరుకు తక్కువ ధరలకు అమ్మి, మడిగెల కిరాయిలు పెంచి స్థానిక వ్యాపారుల షాపులు మూతబడేలా చేస్తున్నారన్నది వారి వాదన. దీనికి నిరసనగా స్థానిక వ్యాపారస్థులు ఈ నెల 18న తలపెట్టిన అమనగల్ బంద్ అందరి దృష్టిలో పడింది. అయితే వివిధ కారణాల వల్ల బంద్‌ను వాయిదా వేసినట్టు వారు ప్రకటించారు.

ఈ మధ్య సికింద్రాబాద్‌లో పార్కింగ్ విషయంలో వచ్చిన గొడవలో మార్వాడీ వ్యక్తులు ఒక యువకుడిపై చేసిన దాడి మరో వివాదానికి మూలమైంది. వివిధ స్థానిక అస్తిత్వ సంఘాలు, ఉద్యమకారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి మొత్తం మార్వాడీ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు ఇస్తున్నారు. స్థానికుల్లో పెల్లుబుకిన ఈ విమర్శ, అసహనం నుంచి మార్వాడీలను కాపాడేందుకు బీజేపీ నేతలు, హిందుత్వవాద సంఘాలు ముందుకువచ్చాయి. మార్వాడీలపై అసహనానికి వాస్తవ కారణాలేంటి, వాటిని ఎలా సద్దుమణిగేలా చేయాలనే దిశలో బీజేపీ నేతలు ఆలోచించకుండా, వివాదాన్ని పెంచి స్వార్థ రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడానికి ప్రయత్నించడం విషాదకరం.

స్థానిక హిందూ సంఘాల పెద్దలు, బీజేపీ నేతలు కొందరు ఈ మార్వాడీ వ్యతిరేకతను పాకిస్థాన్ సృష్టి అంటున్నారు. కమ్యూనిస్టులు దీనికి వంతపాడుతున్నారని చెప్తున్నారు. రోహింగ్యాల ప్రస్తావన తెస్తున్నారు. ఈ మాటలతో అసలు సమస్యను పక్కదారి పట్టించడమే వారి ఉద్దేశం.



రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరు సొసైటీ వద్ద యూరియా కోసం చెప్పుల క్యూ



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

యూరియా కోసం నిరసన.. నిలదీత

ఎక్కడికక్కడ ఆందోళనలు, రాస్తారోకోలు

- యూరియా ఎందుకు ఇవ్వరని నిలదీత
- పోలీసులు అడ్డుకున్నా ఆగని నిరసనలు
- ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితులు
- మరిపెడలో సొమ్మసిల్లిన రైతు తలకు గాయం



ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సాంగిడిలో మాజీ మంత్రి జోగు రామన్నకు రోదిస్తూ పంట నష్టపోయినట్టు చెబుతున్న రైతు లచ్చన్న



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రం వద్ద క్యూలో గంటల తరబడి నిలబడటంతో నీరసించి కళ్లు తిరగడంతో కింద కూర్చున్న మహిళా రైతు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో గల సొసైటీ గోదాం వద్ద బారులు తీరిన రైతులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 21: తెలంగాణ వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పోరుబాట పట్టారు. యూరియా ఎందుకు ఇవ్వడంలేదంటూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గంటల కొద్ది రైతులు బారులు తీరారు. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ ఎదుట రహదారిపై అన్నదాతలు ధర్నా చేశారు. ప్రభుత్వం స్పందించాలని, యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

యూరియా అక్రమ రవాణా అడ్డగింత

పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి వంతెన, సుందిళ్ల బరాజ్ చెక్ పోస్టుల వద్ద ఇతర జిల్లాలకు తరలిస్తున్న 20 బస్తాల యూరియా, 20 బస్తాల 20-20 ఎరువులను అధికారులు పట్టుకున్నారు.

యూరియా కోసం పల్లెల మధ్య పంచాయితీ

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌కు పది రోజుల క్రితం 300 బ్యాగులు రావడంతో ఆ గ్రామానికి గతంలో అనుబంధంగా ఉండి, ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిన పోతిరెడ్డిపల్లి గ్రామస్థులకు యూరియా బస్తాలు ఇచ్చేది లేదని వెంకటాపూర్ రైతులు నిరాకరించారు. రైతుల మధ్య కొంత ఘర్షణ చోటుచేసుకోగా, అందులో కొందరికి మాత్రమే యూరియా బస్తాలు అందాయి. ఇటీవల తిమ్మాపూర్‌కు యూరియా బస్తాలు రావడంతో బొప్పాపూర్‌కు చెందిన కొందరు రైతులు అక్కడకు చేరుకోవడంతో తిమ్మాపూర్ రైతులు తమ గ్రామానికి ఇచ్చిన తర్వాతే ఇతర గ్రామాల వారికివ్వాలని చెప్పడంతో ఆవేదనతో వెనుదిరిగారు. బొప్పాపూర్‌కు 460 బస్తాల లోడు రాగా అందులో 240 బస్తాలు దింపి వెళ్దామనుకునే క్రమంలో రైతులు లారీని అడ్డగించి, తమను ఇతర గ్రామాల రైతులు రానివ్వడంలేదని, మొత్తం లోడు గ్రామంలోనే దించాలని పట్టుబట్టారు. అధికారులు స్పందించి రైతులను శాంతింపజేసి, లారీని అక్కడ నుంచి పంపించారు. పదిర గ్రామానికి యూరియా బస్తాలు వచ్చాయని పక్క గ్రామమైన హరిదాస్‌నగర్ రైతులు రావడంతో ముందుగా తమ గ్రామ రైతులకు ఇవ్వాలని చెప్పడంతో హరిదాస్‌నగర్ రైతులు ఇబ్బంది పడ్డారు. పదిర రైతులకు రెండు బస్తాల చొప్పున ఇచ్చిన తర్వాత మిగిలిన కొన్ని బస్తాలు హరిదాస్‌నగర్ ఇచ్చారు.

యూరియా కోసం వెళ్లి ప్రమాదానికి గురై!

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజ్మీరా బిచ్చానాయక్ గూడూరులో లైన్‌లో నిలబడ్డా యూరియా దొరకలేదు. చింతపల్లిలోని ఓ ప్రైవేట్ దుకాణంలో యూరియా కోసం బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఈదులపూసపల్లి సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడటంతో అతడి పక్కటెముకలకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు.

నర్సాపూర్‌లో రోడ్డెక్కిన రైతులు

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు రోజులుగా యూరియా దొరకడం లేదంటూ రోడ్డుపై బైఠాయించి, రాకపోకలను అడ్డుకున్నారు. నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో గంట పాటు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు చేరుకొని మధ్యాహ్నం వరకు యూరియా అందుబాటులోకి వస్తుందని నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. రైతు వేదికలో టోకెన్ తీసుకొని పీఏసీఎస్ వద్దకు పరుగులు తీశారు. ఒక్కొక్కరికి ఒక సంచి మాత్రమే యూరియా అందడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

నెత్తురు చిందించిన రైతు

మహబూబాబాద్ జిల్లా మరిపెడలో యూరియా కోసం ఓ రైతు నెత్తురు చిందించాల్సి వచ్చింది. యూరియా లోడ్ వచ్చిందని తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు మరిపెడ చేరుకున్నారు. ఆగ్రోస్ కేంద్రం మూసి ఉండడంతో గాంధీసెంటర్‌లో గంటపాటు ధర్నా చేశారు. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించి, ఆగ్రోస్ కేంద్రంను తెరిపించి.. క్యూ కట్టారు. చాలా సేపు లైన్‌లో నిల్చున్న మల్లమ్మకుంట తండాకు చెందిన వృద్ధుడు అజ్మీరా లక్కు మెట్లపై నుంచి కింద పడిపోవడంతో అతడి తలకు గాయాలయ్యాయి. లక్కును పోలీసులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లక్కుకు గతంలో పక్షవాతం వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పంటను కాపాడుకునేందుకు యూరియా బస్తా దక్కించుకోవాలనే ఆరాటంతో లక్కు కూడా క్యూలో నిల్చోవాల్సి వచ్చిందని ఆవేదనతో చెప్పారు.



మెదక్ జిల్లా నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు



నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలోని కొత్తపల్లి సహకార సంఘంలో బడికి వెళ్లే తన ఏడేండ్ల కుమారుడిని తీసుకొచ్చి ఓ రైతు క్యూలో నిలబెట్టారు. కొందరు కూలీలను తీసుకు వచ్చి రోజుకు రూ.50 చొప్పున చెల్లించి లైన్లో నిలబెడుతున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు



మంచిర్యాల జిల్లా చెన్నూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



మహబూబ్‌నగర్ ఎరువుల విక్రయ కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు



మహబూబాబాద్ జిల్లా మరిపెడలో యూరియా కోసం ఖమ్మం-వరంగల్ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు యూరియా కొరతపై విన్నవించేందుకు వచ్చిన రైతులను అడ్డగించిన పోలీసులు



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

చేతకాకుంటే దిగిపోండి!

- యూరియా ఇవ్వలేని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత? ఊడితే ఎంత?
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఓ రైతు ఆగ్రహం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



వీర్నపల్లి, ఆగస్టు 21 : రైతులకు సకాలంలో యూరియా అందించలేని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'యూరియా ఇవ్వలేని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత? ఊడితే ఎంత? చేతకాకుంటే దిగిపోండి' అంటూ మండిపడ్డాడు. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన రైతు పర్లపల్లి శ్రీశైలంకు వీర్నపల్లి శివారులో నాలుగెకరాలు భూమి ఉన్నది. అందులో వరి సాగు చేస్తున్నాడు. యూరియా కోసం 20 రోజులుగా తిరుగుతున్నాడు. మద్దిమల్ల, వీర్నపల్లి సొసైటీల వద్ద మూడు రోజులుగా లైన్ కట్టినా యూరియా దొరకలేదు. గురువారం బాబాయి చెరువుతండాలో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంపిణీ కేంద్రానికి వెళ్లి రెండు గంటలకు పైగా నిరీక్షించాడు. పది బస్తాలు అవసరముంటే రెండు బస్తాలే దొరికాయి. దీంతో ప్రభుత్వ తీరుపై ఆక్రోషాన్ని వ్యక్తంచేస్తూ ఓ వీడియో రికార్డు చేశాడు. 'కాంగ్రెస్‌లో ఉన్న కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతిపక్ష నాయకులను తిట్టడం తప్ప మరేం పనిలేదేమో వీళ్లకు. లారీ యూరియా వస్తే రైతులు ఎగబడి మనిషికో సంచి లాక్కుంటున్నరు. పంటలు వేసి రెండు నెలలు గడిచినా యూరియా సప్లై చేయలేకపోతున్నరు. సకాలంలో సప్లై చేయని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత? ఊడితే ఎంత? యూరియా అడిగితే గొడవ పెట్టడం, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను తిట్టడం తప్ప యూరియా సరఫరా చేయడం చేతకాదు' అంటూ మండిపడ్డాడు.



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్‌లో క్యూలో ఉంచిన పాసు బుక్కులు



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

యూరియా.. జీరో..!

మార్క్‌ఫెడ్ వద్ద అడుగంటిన యూరియా నిల్వలు

3 లక్షలు ఉండాల్సిన చోట 12 వేల టన్నులు మాత్రమే

- ముందస్తు నిల్వలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారుల వైఫల్యం
- గతంలో ఒక్క మార్క్‌ఫెడ్ వద్దే కనీసం 3 లక్షల టన్నుల నిల్వలు
- రూ. 1500 కోట్లు అదనంగా వెచ్చించి నిల్వ చేసిన బీఆర్ఎస్ సర్కారు
- ఆర్థిక భారం తగ్గించుకునేందుకు బఫర్ స్టాక్‌కు కాంగ్రెస్ కోత
- రాష్ట్రానికి వచ్చిన యూరియా రేకులను పక్క రాష్ట్రాలకు తరలింపు
- అధికారుల నిర్లక్ష్యంతో ఒక దశలో జీరోకు పడిపోయిన నిల్వలు
- ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న యూరియా 12,827 టన్నులే



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలకు బఫర్‌స్టాక్ లేకపోవడమే కారణమా? బఫర్‌స్టాక్ నిల్వ చేయడంలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు నిర్లక్ష్యం వహించారా? సర్కారు ఆదేశాలతో బఫర్‌స్టాక్‌లో కోత పెట్టారా? తెలంగాణకు వచ్చిన యూరియా రేకులను ఇతర రాష్ట్రాలకు తరలించారా? ఇదే ఇప్పుడు కొంపముంచిందా? అంటే అవుననే అంటున్నాయి వ్యవసాయ, మార్క్‌ఫెడ్ వర్గాలు. రైతులకు యూరియా కొరత రావొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు ముందస్తుగా యూరియా బఫర్‌స్టాక్ (ముందస్తు నిల్వ)ను నిల్వ చేసేది. సీజన్ ప్రారంభానికి ముందు ఒక్క మార్క్‌ఫెడ్ వద్దే కనీసం 3,4 లక్షల టన్నుల యూరియా బఫర్ ఉంచేవారు. ఇది కాకుండా ప్రైవేటు ఏజెన్సీల వద్ద మరో 2 లక్షల టన్నులు ఉండేలా చర్యలు తీసుకునేవారు. ఈ విధంగా సీజన్ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో మొత్తం సుమారు 5 లక్షల టన్నుల యూరియా బఫర్‌స్టాక్ ఉండేలా ప్రణాళిక రూపొందించి నిల్వ చేసేవారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి యూరియా రావడం ఆలస్యమైనా, ఇతర కారణాలతో కొరత ఏర్పడినా ఈ బఫర్‌స్టాక్ నుంచి రైతులకు పంపిణీ చేసి కొరతను అధిగమించేవారు. కానీ గతంలో ఎప్పుడూ జరగని విధంగా మార్క్‌ఫెడ్ వద్ద యూరియా బఫర్‌స్టాక్ నిండుకుంది. 3 లక్షల టన్నులకు పైగా ఉండాల్సిన బఫర్‌స్టాక్ 12వేల టన్నులకు పడిపోయింది. గత యాసంగి సీజన్ తర్వాత ఒక దశలో బఫర్‌స్టాక్ నిల్వలు దాదాపుగా జీరో అయినట్టు తెలిసింది. ఆ తర్వాత మళ్లీ జీరో నుంచి మొదలు పెట్టినట్టు సమాచారం. దీంతో వచ్చిన స్టాక్ వచ్చినట్టు రోజువారీగా ఊడ్చి పంపిణీ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు బఫర్‌స్టాక్ సంగతి దేవుడెరుగు రోజువారీ కావాల్సిన యూరియా సరఫరా చేయడమే గగనంగా మారింది.

మార్క్‌ఫెడ్ స్టాక్ ఒక్క రోజుకే

ఆకాశం నుంచి పాతాళానికి పడిపోయినట్టు మార్క్‌ఫెడ్ వద్ద యూరియా నిల్వలు అధఃపాతాళానికి చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 904 ప్యాక్స్‌లు, 350 హాకా, డీసీఎంఎస్ కేంద్రాలకు యూరియా సరఫరా చేసే మార్క్‌ఫెడ్ వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ కేవలం 12,827 టన్నులు మాత్రమే. మామూలుగా పంపిణీ చేస్తే ఇది ఒకే ఒక్క రోజులో ఖాళీ అయిపోతుంది. ఇక రాష్ట్రం మొత్తంలో ఈ నెల 21వ తేదీ వరకు ఉన్న యూరియా నిల్వ కేవలం 52,294 టన్నులు మాత్రమే. ఇందులో ప్రైవేటు వ్యాపారుల వద్ద 26,526 టన్నులు, సొసైటీల వద్ద 12,579 టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 12,827 టన్నులు, కంపెనీ గోదాముల్లో 362 టన్నులు ఉంది.

ఆర్థిక భారం.. బఫర్‌స్టాక్‌కు కోత

యూరియా బఫర్‌స్టాక్ నిర్వహించాలంటే ఆర్థిక భారాన్ని భరించాల్సి ఉంటుంది. ముందస్తుగా కంపెనీల నుంచి యూరియా కొనుగోలు చేయాలి. ఇందుకు అయిన ఆర్థిక భారాన్ని కనీసం నాలుగైదు నెలల పాటు మోయాలి. కనీసం 3 లక్షల టన్నుల యూరియాను బఫర్‌స్టాక్ పెట్టాలంటే ప్రభుత్వం ముందస్తుగా రూ. 1,500 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో కేసీఆర్ సర్కారు ఈ ఆర్థిక భారాన్ని భరించి యూరియాను బఫర్‌స్టాక్ పెట్టి రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక బఫర్‌స్టాక్ వల్ల సంస్థపై ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతో కోత పెట్టాలని అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసినట్టు మార్క్‌ఫెడ్ వర్గాలు తెలిపాయి. దీంతో అధికారులు సైతం ఇందుకు అనుగుణంగా బఫర్‌స్టాక్‌ను తగ్గిస్తూ వచ్చినట్టు తెలిసింది. బఫర్‌స్టాక్ తగ్గింపులో భాగంగా అధికారులు తెలంగాణకు వచ్చిన యూరియా రేకులను కూడా దించుకోలేదని తెలిసింది. దీంతో ఆ యూరియా రేకులను కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలించినట్టు గతంలో మార్క్‌ఫెడ్‌లో చర్చ జరిగింది. బఫర్‌స్టాక్ తగ్గించిన పాపానికి రెండు సీజన్లుగా యూరియా కొరత తీవ్రమైంది. ఓవైపు బఫర్‌స్టాక్ లేకపోవడం, మరోవైపు రావాల్సిన యూరియా రాకపోవడంతో విపత్కర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

బఫర్‌లేక.. రైతుల గోస

సర్కారు బాధ్యతారాహిత్యం రాష్ట్రంలో యూరియా సంక్షోభానికి కారణమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించి ముందు జాగ్రత్తగా బఫర్‌స్టాక్ మెయింటెన్ చేస్తే పరిస్థితి ఇలా ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారి నిర్లక్ష్యమే రైతులను ఇప్పుడు గోస పుచ్చుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

బఫర్‌స్టాక్ ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు

"యూరియా బఫర్‌స్టాక్ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఒకవేళ గతంలో మాదిరిగా బఫర్‌స్టాక్ ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రస్తుతం ఉన్నదానితో మేనేజ్ చేస్తున్నాం. సీజన్ ప్రారంభంలో కొంతమేర బఫర్‌స్టాక్ ఉన్నప్పటికీ షిప్‌ల ఆలస్యంతో క్రమంగా తగ్గుతూ వచ్చింది."

-పేరు చెప్పడానికి ఇష్టపడని మార్క్‌ఫెడ్ అధికారి

సీనియర్ అడ్వొకేట్ ప్రతాప్‌రెడ్డి మృతి

హైదరాబాద్ ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): హైకోర్టు సీనియర్ న్యాయవాది కే ప్రతాప్‌రెడ్డి (94) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లా పోతుగల్ గ్రామంలో 1931 ఏప్రిల్ 11న ఆయన జన్మించారు. ప్రతాప్‌రెడ్డి జనతా పార్టీ వ్యవస్థాపక సభ్యుడు. ఆ పార్టీ ఎంపీగా కూడా పోటీ చేశారు. ఉమ్మడి ఏపీ బార్‌కౌన్సిల్ సభ్యుడిగా, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యాసంస్థలను నెలకొల్పి విద్యాదానం చేశారు. ఆయన వద్ద దాదాపు 200 మంది న్యాయవాదులు జూనియర్లుగా పనిచేశారు. అలా పనిచేసిన వారిలో కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సైతం నియమితులయ్యారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసిన బీజేపీ

- రాష్ట్రపతి భవన్ సైతం పీఎంవో చెప్పినట్టు వింటున్నది
- సీపీఐ రాష్ట్ర మహాసభల్లో నారాయణ విమర్శ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): చట్టసభల సభ్యులు 30 రోజులు జైలులో ఉంటే వారి పదవులు రద్దయ్యే చట్టం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఒకవేళ అలాంటి చట్టం వస్తే దాదాపు రెండేండ్లు జైలులో ఉన్న అమిత్‌షా పదవినే ముందుగా రద్దు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. స్వయంప్రతిపత్తి గల రాజ్యాంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సీబీఐ, సీఐడీ, ఈడీ, న్యాయవ్యవస్థ, నీతిఆయోగ్ వంటి వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేయనివ్వడంలేదని విమర్శించారు. చివరకు ప్రధానమంత్రి కార్యాలయం ఏది చెప్తే రాష్ట్రపతి భవన్ అది చేసే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలో ఆయన మాట్లాడుతూ. పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేయడం ద్వారా దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు.

తూచ్...ఢిల్లీకి వెళ్లలే!

మొదటిపేజీ తరువాయి...

అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఢిల్లీ పర్యటన కోసం గురువారం రాష్ట్రంలోని పలు కార్యక్రమాలను కూడా రద్దు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో తన ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీకి ఎందుకు పోలేదనేది రాజకీయ వర్గాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని తానే నిలబెట్టించానని రేవంత్ ఘనంగా ప్రకటించుకున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం కూడా చేయించుకున్నారు. దీంతో జస్టిస్ రెడ్డి నామినేషన్ ఘట్టంలో రేవంత్ ప్రముఖంగా కనిపిస్తారని అందరూ అనుకున్నారు. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్తున్నట్టు ప్రకటించుకున్న ఆయన అకస్మాత్తుగా టూర్‌ను రద్దుచేసుకోవడం అనేక అనుమానాలకు దారితీస్తున్నది. గురువారం రాష్ట్రంలో కూడా ఆయన ఏ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు రాలేదా? లేక బీజేపీకి ఎదురు నిల్చున్నానని భయపడ్డారా?



లేదా సుదర్శన్‌రెడ్డి ఎంపికలో ఆయన పాత్ర లేదా? అనే ప్రశ్నలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపిక తనదేనని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఒకవేళ ఇదే నిజమైతే సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఆయన కచ్చితంగా హాజరుకావాలి. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి బదులుగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ కార్యక్రమానికి హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. సీఎం ఎందుకు ఢిల్లీ వెళ్లలేదు? కార్యక్రమానికి ఎందుకు డుమ్మా కొంటారనే అంశంపై తెగ చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రధాని మోదీకి తనపై కోపం రాకుండా ఉండేందుకే రేవంత్ చివరి నిమిషంలో ముఖం చాటేసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మోదీతో ఎందుకు పెట్టుకుంటున్నావు అంటూ తన శ్రేయోభిలాషులు ఫోన్ చేసి సున్నితంగా హెచ్చరించినట్టుగా తెలిసింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీతో ఢీ అంటే ఢీ అనే విధంగా ఎందుకు వెళుతున్నావని ప్రశ్నించినట్టుగా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వారి కంట్లో పడొద్దని, ఇది నీ రాజకీయ భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదని ఘాటుగా హెచ్చరించినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. తానేం తప్పు చేస్తున్నానని సదరు వ్యక్తిని ప్రశ్నించినట్టుగా తెలిసింది. తన పార్టీ తరఫున అభ్యర్థిని సూచించి, నిలబెట్టి ఆయన తరఫున ప్రచారం చేస్తున్నానని, ఇది తప్పెలా అవుతుందని ఆయన ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన సదరు శ్రేయోభిలాషి 'నీ దృష్టిలో ఇది తప్పుకాకపోవచ్చు. కానీ వారు మాత్రం తప్పుగా భావిస్తున్నారు. నువ్వు ఎక్కువ హడావుడి చేస్తున్నావని అనుకుంటున్నారు' అని చెప్పినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన వెనక్కి తగ్గి హఠాత్తుగా తన పర్యటనను రద్దు చేసుకున్నట్టు కాంగ్రెస్‌లో జోరుగా చర్చ జరుగుతున్నది.

రోడ్ల నష్టంపై నివేదిక రూపొందించండి

హ్యామ్ రోడ్లకు త్వరలో టెండర్ల ప్రక్రియ : కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఆర్‌అండ్‌బీశాఖ పరిధిలోని రోడ్ల నష్టంపై నివేదిక రూపొందించాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. వర్షాల వల్ల రోడ్లకు జరిగిన నష్టంపై గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతికొద్ది రోజుల్లోనే హ్యామ్ విధానం ద్వారా మెరుగైన, నాణ్యమైన రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. దీనికి త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వర్షాల వల్ల రోడ్లకు దాదాపు రూ. 1000 కోట్ల వరకు నష్టం జరిగినట్టు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఈఎన్సీ జయభారతి, సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞత చూపాలి

- ఉపరాష్ట్రపతిగా సుదర్శన్‌రెడ్డికి టీడీపీ మద్దతివ్వాలి: మల్లు రవి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఎన్టీఆర్-చంద్రబాబు మధ్య పార్టీ గుర్తు కోసం కేసు నడిచిన సమయంలో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పట్ల ఇప్పుడు చంద్రబాబునాయుడు కృతజ్ఞత చూపాల్సిన సమయం వచ్చిందని తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్, ఎంపీ మల్లు రవి సూచించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. జడ్జిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్నో కీలక తీర్పులు చెప్పారని గుర్తుచేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. తెలుగు ఎంపీలంతా ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికే మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎంపీ మల్లు రవి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డికి ఏ పార్టీలోనూ సభ్యత్వం లేదని, రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఇండియా కూటమి ఆయనను అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో విప్ ఉండదని, అం దువల్ల స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం ఉంటుందని అన్నారు.

కలెక్టరేట్‌లో గుండెపోటుతో రైతు మృతి

సిద్దిపేట, ఆగస్టు 21 : భూపరిహారం కోసం సిద్దిపేట కలెక్టరేట్‌కు వచ్చిన ఓ రైతు గుండెపోటుతో కన్నుమూశాడు. వివరాలిలా.. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన రైతు గుండాల బాలకిట్టు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అదనపు టీఎంసీ కోసం నిర్మిస్తున్న 100 మీటర్ల కెనాల్‌లో తనకున్న రెండున్నర ఎకరాల భూమి కోల్పోతున్నాడు. ఈ క్రమంలో అధికారులు సర్వే చేసి బాలకిట్టుకు చెందిన భూమిలో మార్కింగ్ చేశారు. బాలకిట్టు తనకు భూపరిహారం చెల్లించాలని ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను కలిసి మొరపెట్టుకున్నాడు. తనకు రావాల్సిన పరిహారం చెక్కు ఇవ్వాలని గురువారం ఉదయం 10 గంటలకు సిద్దిపేట కలెక్టరేట్‌కు వచ్చాడు. అప్పటి నుంచి కలెక్టరేట్‌లోనే ఉన్న బాలకిట్టు మూత్ర విసర్జనకు కలెక్టరేట్ ఆవరణలో పొదల వైపు వెళ్లి అక్కడే గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే రైతును అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు. తన రెండెకరాల భూమికి ఎకరాకు రూ. 14.50 లక్షల చొప్పున రూ.29 లక్షల పరిహారం కోసం కలెక్టరేట్‌కు వెళ్లాడు.

ఆరోగ్యశ్రీ, జర్నలిస్టు హెల్త్‌స్కీం నిలిపివేత

- 31నుంచి అమల్లోకి : టీఏఎన్‌హెచ్ఏ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ సేవలను ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి నిలిపివేయనున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ అసోసియేషన్(టీఏఎన్‌హెచ్ఏ) అధ్యక్షుడు వడ్డిరాజు రాకేశ్ గురువారం ప్రకటించారు. గత జనవరిలో ప్రభుత్వంతో జరిగిన చర్చల సందర్భంగా.. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు సీఈవోకు లేఖ రాస్తూ.. ఈ ట్రస్టు సేవల ద్వారా ప్రభుత్వం దాదాపు రూ.1,400 కోట్ల వరకు బకాయి పడిందని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ శాఖలో భారీగా కమిషనర్ల బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): మున్సిపల్‌శాఖలో భారీగా కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పారిపాలన, పట్టాణాభివృద్ధి కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 47మందిని పలు చోట్లకు బదిలీ చేయగా, కొందరిని మున్సిపల్ కమిషనర్లుగా నియమిస్తూ ఆమె ఆదేశాలు ఇచ్చారు. ఈ బదిలీల్లో వెయిటింగ్‌లోని 29 మందికి పోస్టింగ్ లభించింది. కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించారు.

రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోండి

డీజీపీని కోరిన అగర్వాల్ సమాజ్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): మార్వాడీ సమాజంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా గురువారం డీజీపీ జి తేందర్‌ను కోరారు. మార్వాడీ సమాజంపై విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే చర్యలకు వ్యతిరేకంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని అన్నారు. అగర్వాల్, మార్వాడీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అపెక్స్ బాడీ అయిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ తరఫున రాసిన లేఖను డీజీపీకి సమర్పించారు.

జర్నలిస్టుల రివ్యూ పిటిషన్ తిరస్కరణ

- సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిర్ణయం
- ప్రత్యామ్నాయ మార్గంలో అక్కడే స్థలాలివ్వాలి
- ఇతర జర్నలిస్టులకు న్యాసిటీలో ఇండ్ల స్థలాలివ్వాలి
- సీఎం మాట నిలబెట్టుకోవాలి: టీయూడబ్ల్యూజే



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఇండ్ల స్థలాల విషయంలో దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపును గత ఏడాది సుప్రీంకోర్టు రద్దుచేయగా, జర్నలిస్టులు రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం పిటిషన్‌ను తిరస్కరించింది. జర్నలిస్టుల సొసైటీ తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా సహా 8 మంది న్యాయవాదులు వాదనలు వినిపించారు. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ ధర్మాసనం స్పందిస్తూ.. రివ్యూ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించింది.

సుప్రీంకోర్టు నిర్ణయం బాధాకరం: టీయూడబ్ల్యూజే

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు రివ్యూ పిటిషన్‌ను తిరస్కరించడం అత్యంత బాధాకరమైన విషయమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం పేర్కొంది. దాదాపు 18 ఏండ్లుగా కోటి ఆశలతో ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు సుప్రీంకోర్టు నిర్ణయం తీవ్ర నిరాశను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాల క్రితమే కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించిన జేఎన్‌జే సొసైటీ సభ్యులకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వెంటనే అదేచోట ఇండ్ల స్థలాలు ఇప్పించే బాధ్యతను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి దానిని అమలుచేయడం ద్వారా ఈ ఇండ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ సొసైటీ సభ్యులకు ఇండ్ల స్థలాలు కేటాయించడం ద్వారా మార్గం సుగమం చేయడంతోపాటు ఇతర జర్నలిస్టులకు సైతం ప్రస్తుత ముఖ్యమంత్రి మాట ఇచ్చిన విధంగా న్యాసిటీలో ఇండ్ల స్థలాలను కేటాయించి, వారి సొంతింటి కలను సాకారం చేయాలని కోరారు. గత 30 ఏండ్లుగా హైదరాబాద్ నగరంలో జర్నలిజం వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న జర్నలిస్టులు ప్రభుత్వం ద్వారా ఇండ్ల స్థలాలు పొందలేక, ఉంటున్న ఇండ్లకు అద్దెలు చెల్లించలేక అపసోపాలు పడుతున్నారని వివరించారు. దీనిని ప్రధాన సమస్యగా గుర్తించి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందించి నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు.

కులం పేరుతో దాడి చేస్తే చర్యలుండవా?

- దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు చేయండి
- గద్వాల డీఎస్పీకి ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశాలు
- ఘటనపై గద్వాల కలెక్టర్, ఎస్పీలకు సైతం నోటీసులు



ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తున్న పెద్ద ధన్వాడ ఇథనాల్ బాధితులు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'అమాయకులపైన అణగారిన వర్గాలపై కులం పేరుతో దాడిచేస్తే చర్యలు తీసుకోరా?' అని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులపై దాడులు చేస్తే కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ బాధితులు, దాడికి గురైన దళితులు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి తమపై జరిగిన దాడి గురించి వివరించారు. పెద్ద ధన్వాడలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం గాయత్రి రెన్యూవబుల్ అల్లాయిడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత జూన్ 3న కంపెనీ సీఈవో, ప్రైవేట్ బౌన్సర్ల సాయంతో పనులు ప్రారంభించడానికి వచ్చారని తెలిపారు. జూన్ 4న పెద్ద ధన్వాడ గ్రామస్థులంతా ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా రోడ్డుపై ధర్నాకు దిగడంతో, సీఈవో బీ మంజునాథ్, బౌన్సర్లు బాధితులను కులం పేరుతో దుర్భాషలాడుతూ దాడి చేయడంతో తలలు పగిలి, 10 కుట్లు పడ్డాయని మరియమ్మ అనే దళిత మహిళ కమిషన్ చైర్మన్‌ను గోడు వెళ్లబోసుకుంది. అనంతరం రాజోలి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని, 60 రోజులవుతున్నా చర్యలు తీసుకోకుండా తిరిగి గ్రామ రైతులపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితుల గోడు విన్న కమిషన్ చైర్మన్ ఈ ఘటనపై ఇంతవరకు తీసుకున్న ఏటీఆర్‌ను పంపాలని కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను ఆదేశించారు. కంపెనీ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గద్వాల డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యే విజయుడు, బాధితులు మరియమ్మ, భాస్కర్, మోశన్నరాజు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల నిలిపివేత హక్కుల ఉల్లంఘనే

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 21: ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉందనే సాకుతో విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ పేర్కొన్నది. ఈమేరకు గురువారం కమిషన్‌లో దాఖలైన 4775/2025 కేసును కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో తగిన ఉత్తర్వులను జారీ చేస్తూ కేసును ముగించారు. హెచ్ఆర్సీ 3772/2025 వంగల శృతి కేసులో జారీ చేసిన మునుపటి ఉత్తర్వులను, యూజీసీ మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ.. ఇలాంటి పద్ధతులు హక్కుల ఉల్లంఘనకు దారితీస్తాయని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం విద్యాహక్కును అడ్డుకోవడమేనని కమిషన్ స్పష్టంచేసింది. సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన 17మంది బీఫార్మసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉందని ఒరిజినల్ టీసీ, స్టడీ సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యం చట్టవిరుద్ధంగా నిలిపివేయడంతో విద్యార్థుల ఉన్నత విద్యావకాశాలు ప్రమాదంలో పడ్డాయని పేర్కొన్నది. సర్టిఫికెట్లను వెంటనే విద్యార్థులకు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ కార్మికులు గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బస్‌భవన్ వద్ద శాంతియుత ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందించారు. – చిక్కడపల్లి



బెల్లంపల్లి జాతీయ రహదారిపై చిందులు వేస్తున్న ఎమ్మెల్యే పీఏలు కాంగ్రెస్ నాయకులు

మద్యం మత్తులో ఎమ్మెల్యే పీఏల చిందులు

సోషల్ మీడియాలో వీడియో వైరల్

బెల్లంపల్లి, ఆగస్టు 21 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏలు, కాంగ్రెస్ నాయకులు జాతీయ రహదారిపై మద్యం మత్తులో డ్యాన్సులు చేసిన వీడియో సోషల్ మీడియాలో గురువారం చక్కర్లు కొట్టింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికార పీఏ రామకృష్ణ, అనధికార పీఏ గడ్డం ప్రసాద్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు రమేశ్, శ్యాం, డ్రైవర్లు మోసిన్, శేఖర్ బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా వద్ద జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారులో పాటలు పెట్టుకుని మద్యం తాగుతూ కేకలు వేస్తూ చిందులు వేశారు. బాధ్యతాయుతమైన పీఏ పదవిలో ఉండి ఇలా రోడ్లపై డ్యాన్సులు చేస్తూ వాహనదారులను ఇబ్బంది పెట్టడంపై పట్టణవాసులు సోషల్‌మీడియాలో తిట్ల వర్షం కురిపించారు. సమీప బంధువు, సన్నిహితుడు కావడంతోనే పీఏను మందలించి వదిలివేస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించవద్దని ప్రకటనలు గుప్పించి సామాన్య జనంపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు ఈ వ్యవహారంపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు.

గ్రే మార్కెట్‌కు చెక్!

ప్రీ-ఐపీవో షేర్ ట్రేడింగ్ కోసం ఓ రెగ్యులేటెడ్ వేదిక ● ఈక్విటీ డెరివేటివ్‌ల టెన్యూర్ పొడిగింపు? ● సెబీ యోచన



ముంబై/న్యూఢిల్లీ, ఆగస్టు 21: ప్రస్తుతం అనధికారికంగా జరుగుతున్న ఆర్థిక సెక్యూరిటీల విపణి (గ్రే మార్కెట్) కార్యకలాపాలకు చెక్ పెట్టే దిశగా మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ అడుగులు వేస్తున్నది. ఈ క్రమంలోనే ప్రీ-ఐపీవో (ముందస్తు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) షేర్ ట్రేడింగ్ కోసం ఓ రెగ్యులేటెడ్ వేదికను పరిచయం చేయనున్నామన్న సంకేతాలను గురువారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే ఇచ్చారు. ఈ రెగ్యులేటెడ్ ప్లాట్‌ఫామ్.. ఇప్పుడున్న అన్‌రెగ్యులేటెడ్ ప్లాట్‌ఫామ్స్ వేదికగా గ్రే మార్కెట్‌లో జరుగుతున్న లావాదేవీలను బాగా తగ్గించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఐపీవో అలాట్‌మెంట్, లిస్టింగ్ మధ్య ఉండే 3 రోజుల వ్యవధిలో అధికారికంగా షేర్ల ట్రేడింగ్‌కు మదుపరులకు అనుమతి లభించే వీలు కూడా లేకపోలేదన్నారు. ఫిక్కీ క్యాపిటల్ మార్కెట్ కాన్ఫరెన్స్ 2025లో పాండే మాట్లాడుతూ.. మదుపరులు తమ పెట్టుబడులపై ఓ నిర్ణయానికి రావడానికి ప్రీ-లిస్టింగ్ సమాచారం అన్నివేళలా చాలదన్నారు. అందుకే మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం క్యాపిటల్ మార్కెట్‌ను మరింత సురక్షితం చేయడానికి ప్రీ-ఐపీవో కంపెనీలు సైతం కొన్ని నిబంధనలకు లోబడి ట్రేడింగ్ చేసుకునేందుకు వీలుగా ఓ రెగ్యులేటెట్ వేదికను పైలట్ ప్రాజెక్టుగా తీసుకురావాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఇది అందుబాటులోకి వస్తే నియంత్రణ లేని వేదికలపై అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్‌కు అడ్డుకట్ట పడుతుందన్నారు. ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్ కోసం ఐపీవో ముగిసిన తర్వాత, ట్రేడింగ్ మొదలవడానికి మధ్య కనీసం మూడు ట్రేడింగ్ డేస్ వ్యత్యాసం ఉంటున్నది. ఈ సమయంలోనే గ్రే మార్కెట్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇవి ఇన్వెస్టర్లకు రిస్క్ అని సెబీ చెప్తున్నది. అయినా ఏమాత్రం ఆగడం లేదు. పైగా పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి ఐపీవోలూ వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 70కిపైగా పబ్లిక్ ఇష్యూలు వచ్చినట్టు సమాచారం. ఈ నెలలోనే 11 సంస్థలు ఐపీవోల్ని తెచ్చాయి. వచ్చే వారం మరికొన్ని రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఓ రెగ్యులేటెడ్ ప్లాట్‌ఫామ్‌ను సెబీనే తేవాలని భావిస్తున్నది.

డెరివేటివ్‌ల టెన్యూర్‌పై..

ఈక్విటీ డెరివేటివ్‌ల ప్రొడక్ట్స్ మెచ్యూరిటీ, టెన్యూర్‌ను పెంచాలని సెబీ చూస్తున్నది. దీని వల్ల సదరు ప్రొడక్ట్స్‌ల్లో ట్రేడింగ్‌ను అదుపు చేయవచ్చని భావిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) వ్యక్తిగత ట్రేడర్లలో 91 శాతం మంది నష్టాలనే ఎదుర్కొన్నారు. దీంతో క్యాష్ ఈక్విటీ మార్కెట్ల బలోపేతానికి ఉన్న మార్గాలను అన్వేషించే పనిలో సెబీ పడింది. ఇందులో భాగంగానే మరింత కాలపరిమితి ఉండే ప్రొడక్ట్స్ ద్వారా డెరివేటివ్‌ల నాణ్యతను పెంచాలనుకుంటున్నది. 'ప్రభావవంతమైన హెడ్జింగ్, లాంగ్-టర్మ్ ఇన్వెస్టింగ్‌కు వీలుగా మరింత లాభసాటిగా డెరివేటివ్ ప్రొడక్ట్స్ మెచ్యూరిటీకి భాగస్వాముల అభిప్రాయాలను తీసుకుంటాం' అని పాండే తెలిపారు.

కార్వీ కేసులో క్లెయిములకు అవకాశం

కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ మోసం కేసులో మదుపరులు తమ క్లెయిములను దాఖలు చేయడానికున్న గడువును సెబీ ఈ ఏడాది డిసెంబర్ వరకు పొడిగించింది. 2020 నవంబర్ 23న కార్వీని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఓ డిఫాల్టర్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కార్వీ బాధిత మదుపరుల నుంచి క్లెయిముల దాఖలుకు అవకాశం ఇచ్చింది. అయితే ఈ ఏడాది జూన్ 2తోనే ఈ గడువు తీరిపోయింది. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 31దాకా దాన్ని పెంచుతున్నట్టు సెబీ తాజాగా తెలిపింది. ఇంకా తమ క్లెయిములను సమర్పించని ఇన్వెస్టర్లు ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఓ ప్రకటనలో కోరింది. అలాగే మరిన్ని వివరాల కోసం ఎన్ఎస్ఈని దాని టోల్-ఫ్రీ నెంబర్ 1800 266 0050 ద్వారా సంప్రదించవచ్చని, లేదా defaultisc@nse.co.inకు ఈ-మెయిల్స్ పంపవచ్చని సూచించింది. ఇక పవర్ ఆఫ్ అటార్నీని దుర్వినియోగం చేస్తూ ఇన్వెస్టర్ల సొమ్మును పక్కదారి పట్టించిన ఈ కేసులో కార్వీ సీఎండీ సీ పార్థసారథిని 2023 ఏప్రిల్‌లోనే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి ఏడేండ్లపాటు సెబీ నిషేధించిన సంగతి విదితమే. రూ.21 కోట్ల జరిమానాను కూడా విధించింది.

జీఎస్టీ స్లాబుల కోతకు జీవోఎం ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 21: జీఎస్టీ స్లాబుల తగ్గింపునకు మరో ముందడుగుపడింది. రెండు స్లాబ్‌ల తగ్గింపునకు జీవోఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న నాలుగు స్లాబులను రెండింటి తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ఏర్పాటైన మంత్రుల బృందం అనుమతినిచ్చింది. దీంతో 12, 28 శాతం స్లాబులను ఎత్తివేసి కేవలం 5, 18 శాతం స్లాబులు మాత్రమే ఉండనున్నాయి. ఈ జీవోఎంకు బీహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితోపాటు ఆరుగురు సభ్యులుగా ఉన్నారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణలో భాగంగా కేంద్రం కేవలం రెండు స్లాబులను ప్రతిపాదించిందని, దీనికి జీవోఎం ఆమోదం తెలిపిందని సామ్రాట్ చౌదరి తెలిపారు.

నిధుల వేటలో జీఎమ్మార్

హైదరాబాద్, ఆగస్టు 21: జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమైంది. సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా రూ.5 వేల కోట్ల నిధుల సేకరణకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. న్యూఢిల్లీలో ఉన్న ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కార్గొ సిటీ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి సంస్థ ప్రత్యేక పర్పస్ వెహికల్ ను ఏర్పాటు చేయడానికి బోర్డు అనుమతినిచ్చింది. ఒకేసారి లేదా పలు వాయిదాల్లో సేకరించాలని సంస్థ యోచిస్తున్నది. దీంతోపాటు విదేశీ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్లను జారీ చేయడం ద్వారా నిధులను సేకరించాలనుకుంటున్నది.

'ఫాల్కన్' కేసులో సీఏ అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ కుంభకోణంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) శరద్ చంద్ర తోష్నివాల్‌ను అరెస్టు చేసినట్టు గురువారం ప్రకటించారు. అమర్ దీప్‌కుమార్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇతరులపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ అరెస్టు జరిగింది. ఈ కేసులో అధిక రాబడుల ఆశజూపి అమాయక పెట్టుబడిదారులను మోసం చేశారని దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. కాగా, తోష్నివాల్‌ను ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

ఆర్థిక ప్లానింగ్‌లో ముందంజ

- రాష్ట్రంలో 94 శాతం మంది మొగ్గు
- ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 21: దీర్ఘకాలికంగా ఆర్థిక ప్లానింగ్ వేసుకునేవారి జాబితాలో తెలంగాణ ముందువరుసలో నిలిచింది. ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ(ఐఏసీ-లైఫ్), ఐఎంఆర్‌బీ కాంతార సంయుక్తంగా నిర్వహించిన నివేదికలో పలు విషయాలను వెల్లడించింది. సర్వేలో పాల్గొన్నవారిలో 94 శాతం మంది ఆర్థిక ప్రణాళికలు వేసుకోనుండగా, 87 శాతం మంది లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్ ప్లాన్లను తీసుకోవడానికి మొగ్గుచూపారు. హైదరాబాద్ ప్రాంతంలో ఆర్థిక పొదుపు, బీమా పాలసీలపై అధిక అనుభవం ఉన్నది.

- 100 శాతం మందికి లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలతో పొదుపు, భద్రత కూడా
- 90 శాతం మంది ప్రజలు జీవిత బీమా పాలసీల గురించి టీవీల ద్వారానే తెలుసుకున్నారంట. వీరిలో 56 శాతం మంది బీమా ఏజెంట్ల నుంచి సమాచారాన్ని సేకరించారు.
- వచ్చే మూడు నెలల్లో జీవిత బీమా పాలసీలు కొనుగోలు చేయడానికి 38 శాతం మంది ఉత్సుకతను చూపారు.
- లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్లతో పొదుపుపై 78 శాతం మందికి అవగాహన ఉన్నది.
- 54 శాతం కుటుంబాలు చిన్న పిల్లలకు కూడా పాలసీలు తీసుకున్నారు.



రక్షణ, ప్రణాళిక, ముందస్తు పదవీ విరమణకు విలువనిచ్చే ఆర్థికంగా స్పృహ కలిగిన తెలంగాణ ప్రతిబింబిస్తున్నది. జీవిత బీమాను కొనుగోలు చేయడానికి మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక సంపద సృష్టికి ఉపయోగించడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నారు.

- వెంకటాచలం, ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ(ఐఏసీ-లైఫ్) కో-చైర్‌పర్సన్

అపోలోలో తగ్గిన ప్రమోటర్ల వాటా

హైదరాబాద్, ఆగస్టు 21: అపోలో హాస్పిటల్స్‌లో ప్రమోటర్లు తమ వాటాను తగ్గించుకున్నారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సునీత రెడ్డి తన వాటాల్లో 1.25 శాతం వాటాను విక్రయించడంతో రూ.1,395 కోట్ల నిధులు సమకూరాయి. బ్లాక్‌డీల్ ద్వారా జరిగిన ఈ విక్రయంతో సంస్థలో సునీత రెడ్డి వాటా 3.36 శాతం నుంచి 2.11 శాతానికి తగ్గింది. ఒక్కో షేరు రూ.7,747 చొప్పున 18 లక్షల షేర్లను విక్రయించది. ఇంట్రాడేలో రికార్డు స్థాయికి చేరుకున్న కంపెనీ షేరు చివరకు రూ.7,920 వద్ద ముగిసింది. తొలి త్రైమాసికానికిగాను రూ.5,842 కోట్ల ఆదాయంపై రూ.433 కోట్ల నికర లాభాన్ని గడించింది.



హైదరాబాద్ మియాపూర్‌లోని ఓ ఇంటి ఆవరణలో అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న ఒకే కుటుంబానికి చెందిన మృతదేహాలు

ఒకే కుటుంబంలో ఐదుగురు అనుమానాస్పద మృతి

మియాపూర్, ఆగస్టు 21: ఒకే కుటుంబంలో ఐదుగురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకున్నది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్తామహబూబ్‌పేట్‌లో ఉప్పరి లక్ష్మయ్య(60), ఆయన భార్య వెంకటమ్మ(55), కుమారుడు భగవత్ నివసిస్తున్నారు. లక్ష్మయ్య కూలీగా, వెంకటమ్మ పాఠశాల బస్సు అటెండర్‌గా, కుమారుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ముగ్గురు కుమార్తెలకు లక్ష్మయ్య వివాహం చేశాడు. రెండో కూతురు కవిత, అల్లుడు అనిల్, వీరి కుమారుడు యువాన్ష్ లంగర్ హౌజ్‌లో నివాసం ఉంటున్నారు. కూలీ పనులు చేసుకునే అల్లుడు అనిల్ కొంతకాలంగా ఉపాధి లభించక నాలుగైదు రోజుల క్రితం మక్తా మహబూబ్‌పేటలోని మామ ఇంటికి సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం అనిల్ భార్య కవిత, కుమారుడు యువాన్ష్‌తో కలిసి అనిల్ తన మామ లక్ష్మయ్య ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం పూర్తి చేసుకుని నిద్రకు ఉపక్రమించారు. ఉదయం ఎంత పిలిచినా తలుపు తీయకపోవటంతో సమీప బంధువులు బలవంతంగా తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి లక్ష్మయ్య, వెంకటమ్మ, అనిల్, కవిత, యువాన్ష్ విగత జీవులుగా పడి ఉన్నారు. భోజనంలో విష పదార్థం కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

డెంగీతో ఇద్దరు చిన్నారుల మృతి

- జనగామ, మానుకోటలో విషాదం



జోగు సాత్విక, డీ సాత్విక (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్/తొర్రూరు, ఆగస్టు 21: డెంగీ జ్వరంతో జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లికి చెందిన జోగు శంకర్, సంధ్య దంపతులకు 20 నెలల కూతురు జోగు సాత్విక ఉన్నది. రాఖీ పౌర్ణమికి ముందు రోజు సాత్వికకు జ్వరం రావడంతో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చూపించగా, టైఫాయిడ్ ఉన్నట్టు తేలింది. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు పాపకు డెంగీ సోకిందని, లివర్ దెబ్బతిన్నట్టు తెలిపారు. సాత్విక చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. అలాగే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు బుచ్చిమల్లు, కవిత దంపతుల చిన్న కూతురు ధర్మారపు సాత్విక (9) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. పలు దవాఖానల్లో వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు బంద్

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో భవిష్యత్‌లో ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవని కేంద్ర క్రీడాశాఖ స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ తటస్థ వేదికల్లోనూ పాక్‌తో ద్వైపాక్షిక క్రీడా టోర్నీలు ఆడేది లేదంటూ కుండబద్దలు కొట్టింది. పాకిస్థాన్‌తో అంతర్జాతీయ సంబంధాల విషయంలో కొత్త పాలసీని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆసియాకప్‌లో ఆడేందుకు టీమ్‌ఇండియాకు అనుమతిచ్చింది. కొత్త పాలసీ ప్రకారం భారత ప్లేయర్లు పాక్‌కు వెళ్లేందుకు, వారు ఇక్కడికి వచ్చేందుకు ఎలాంటి అవకాశం ఉండబోదని క్రీడా శాఖ వర్గాలు పేర్కొన్నాయి. 'పలు దేశాలు పోటీపడే క్రీడాటోర్నీల్లో పాక్‌కు భారత ప్లేయర్లు వెళ్లాలంటే అప్పుడున్న పరిస్థితులను సమీక్షిస్తాం. ప్లేయర్ల భద్రతకు ప్రాధాన్యమిస్తూ నిర్ణయం తీసుకుంటాం'అని క్రీడాశాఖ అధికారి ఒకరు తెలిపారు. పాలసీకి సంబంధించిన వివరాలను క్రీడాశాఖ తమ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే.

ఫైనల్లో కాజల్



సమ్కోవో(బల్గేరియా): అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ కాజల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల 72కిలోల సెమీస్ పోరులో కాజల్ 13-6తో జాస్మైన్ డోలెరస్(అమెరికా)పై అలవోక విజయం సాధించింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లోనూ కైర్కుల్ షర్శబయేవా(కిర్గిస్థాన్)ను 7-0తో కాజల్ చిత్తు చేసింది. బౌట్ బౌట్‌కు తన ఆధిపత్యాన్ని పెంచుకుంటూ పోయిన కాజల్ టోర్నీలో కనీసం రజతం ఖాయం చేసుకుంది. మహిళల 50కిలోల సెమీస్‌లో శృతి..రీనా ఓగావ(జపాన్) చేతిలో ఓడి కాంస్య పతక పోరుకు సిద్ధమైంది. 53కిలోల సెమీస్ పోరులో సారిక..అనస్తియా పోల్స్కా(ఉక్రెయిన్)పై ఓడి కాంస్యం కోసం బరిలోకి దిగనుంది.

అభినవ్ పసిడి ధమాకా

యశస్వికి రజతం, ఏషియన్ షూటింగ్ టోర్నీ



షిమ్కెంట్(కజకిస్థాన్): ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన పురుషుల జూనియర్ 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో భారత యువ షూటర్ అభినవ్‌షా 250.4 పాయింట్లతో స్వర్ణ పతకంతో మెరిశాడు. ఇదే విభాగంలో లీ హ్యున్సె(కొరియా, 250.3), సిహాన్(చైనా, 229.2) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకోగా, హిమాంశు (206.6) నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకం చేజార్చుకున్నాడు. అదే జోరు కొనసాగిస్తూ పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ ఫైనల్లో సురేశ్ నరేన్, హిమాంశు, అభినవ్‌షాతో కూడిన భారత త్రయం 1890.1 పాయింట్లతో పసిడి దక్కించుకుంది. ఇదే కేటగిరీలో చైనా (1885.1), కొరియా (1882.9) వరుసగా రజత, కాంస్యం సొంతం చేసుకున్నాయి. మహిళల జూనియర్ స్కీట్ ఫైనల్లో మాన్సి రఘువంశీ 53-52తో భారత్‌కే చెందిన యశస్వి రాథోడ్‌పై గెలిచి పసిడి పతకంతో మెరిసింది. ఇదే విభాగంలో లిదియా బషరోవా(కజకిస్థాన్, 40) కాంస్యం ఖాతాలో వేసుకుంది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన తుది పోరులో మాన్సి, యశస్వి అద్భుత ప్రదర్శన కనబరిచారు. మహిళల స్కీట్ జూనియర్ తుది పోరులో యశస్వి, మాన్సి, అగ్రిమ బృందం రజతం ఖాతాలో వేసుకుంది. పురుషుల స్కీట్ జూనియర్ ఫైనల్లో హర్మెహర్ సింగ్(52), జ్యోతిరాధిత్యసింగ్(43) రజత, కాంస్యాలు గెలుచుకున్నారు.

సలీమా సారథ్యంలో..

ఆసియా టోర్నీకి భారత జట్టు



న్యూఢిల్లీ: హంగ్జౌ(చైనా) వేదికగా సెప్టెంబర్ 5 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఆసియా కప్ టోర్నీ కోసం భారత మహిళల హాకీ జట్టును ప్రకటించారు. గురువారం సమావేశమైన హాకీ ఇండియా(హెచ్‌ఐ) సెలెక్షన్ కమిటీ స్టార్ మిడ్‌ఫీల్డర్ సలీమా టెటె సారథ్యంలో 20 మందితో కూడిన టీమ్‌ను ఎంపిక చేసింది. పూల్-బిలో భారత్‌తో పాటు జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్ ఉన్నాయి. తమ తొలి మ్యాచ్‌లో సెప్టెంబర్ 5న థాయ్‌లాండ్‌తో టీమ్‌ఇండియా తలపడుతుంది . ఆ తర్వాత జపాన్, సింగపూర్‌తో ఆడుతుంది. ఆసియా కప్ టోర్నీకి జట్టు ఎంపికపై చీఫ్ కోచ్ హరేంద్రసింగ్ సంతోషం వ్యక్తం చేశారు. అనువజ్ఞులు, యువ ప్లేయర్లతో జట్టు సమతూకంగా కనిపిస్తున్నదని అన్నారు. ఆసియా టోర్నీ కోసం అన్ని విధాలుగా సిద్ధమయ్యామని పేర్కొన్నారు. ఆసియా కప్ టైటిల్ గెలిచిన జట్టు వచ్చే ఏడాది జరిగే హాకీ ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది.

అయ్యర్‌కు అన్యాయం!

ఆసియాకప్ టోర్నీకి ఎంపిక చేయకపోవడంపై విమర్శలు • సోషల్ మీడియాలో మద్దతుగా సందేశాలు




> భారత టీ20 జట్టు ఎంపికయ్యేందుకు శ్రేయాస్ ఇంకా ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఐపీఎల్‌లో ఢిల్లీ నుంచి కోల్‌కతా, కోల్‌కతా నుంచి పంజాబ్ ఇలా ప్రతీ సీజన్‌కు మెరుగైన ఫలితాలు రాబడుతున్నాడు. అతన్ని భారత కెప్టెన్‌గా చేయమని నేను కోరడం లేదు. కానీ జట్టులో తీసుకోమంటున్నాను.
>
> **-సంతోష్ అయ్యర్, శ్రేయాస్ తండ్రి**

ముంబై: యూఏఈలో జరుగనున్న ఆసియా కప్ టోర్నీకి శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 12 ఏండ్ల విరామం తర్వాత భారత్..ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ గెలువడంలో కీలకంగా వ్యవహరించిన అయ్యర్‌ను పక్కకు పెట్టడంపై బీసీసీఐ వైఖరిని తప్పుబడుతున్నారు. దీనికి తోడు ఇటీవలే ముగిసిన ఐపీఎల్‌లోనూ పంజాబ్ కింగ్స్‌ను తన నాయకత్వ శైలితో ఫైనల్‌కు చేర్చిన అయ్యర్‌కు తగిన న్యాయం జరుగలేదంటూ అటు మాజీ క్రికెటర్లు మద్దతుగా నిలువగా, పలువురు సోషల్‌మీడియాలో తమదైన శైలిలో బీసీసీఐ ఎంపిక ప్రక్రియను విమర్శిస్తున్నారు. తనదైన రోజున మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలుపు తిప్పే సత్తా ఉన్న ఈ స్టార్ బ్యాటర్‌ను తప్పించడానికి గల కారణాలు ఏంటో బోర్డు పెద్దలు స్పష్టం చేయాలని సోషల్‌మీడియా ఖాతాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మూడు రోజుల క్రితం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలెక్షన్ కమిటీ సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్‌గా, శుభ్‌మన్‌గిల్ వైస్ కెప్టెన్‌గా నియమిస్తూ 15 మందితో జట్టును ఎంపిక చేసింది. అందరూ ఊహించినట్లుగానే గిల్‌ను భవిష్యత్ టీ20 కెప్టెన్‌గా భావిస్తున్న బీసీసీఐ అందుకు తగ్గట్లు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, సూపర్‌ఫామ్‌లో ఉన్న అయ్యర్‌ను మాత్రం అసలు పరిగణనలోకి తీసుకోలేదు. శ్రేయాస్‌ను ఎంపిక చేయకపోవడంపై అగార్కర్ స్పందిస్తూ ప్రస్తుతం జట్టులో ఎవరిని తీసివేసే పరిస్థితి లేదని, మరికొన్ని రోజులు అయ్యర్ వేచిచూడాలని చావు కబురు చల్లగా చెప్పాడు. దీనిపై సోషల్‌మీడియాలో అగార్కర్, బోర్డు వైఖరిపై తారాస్థాయిలో ట్రోల్స్ చేశారు. మాజీ క్రికెటర్లు రవిచంద్రన్ అశ్విన్, ఇర్ఫాన్ పఠాన్, అభిషేక్ నాయర్, ఎమ్మెస్కే ప్రసాద్..అయ్యర్‌కు మద్దతుగా గళం విప్పారు. టీ20ల్లో మెరుగైన రికార్డు ఉన్న అయ్యర్ ఎందుకు తప్పించారో చెప్పాలంటూ ప్రశ్నించారు.

17 కాకుండా 15 మందితో: ఏషియన్ క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) నిబంధనల ప్రకారం వాస్తవానికి 17 మంది ప్లేయర్లతో జట్టును ప్రకటించేందుకు అవకాశముంది. టోర్నీలో పోటీపడే జట్లు 17 మంది ఎంపిక చేసుకోవచ్చని నిబంధనలు ఉన్నా..బీసీసీఐ అందుకు భిన్నంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టులో 17 మంది ప్లేయర్లకు తోడు 8 మంది సహాయక సిబ్బందితో మొత్తంగా 25 మంది ఉండవచ్చని ఏసీసీ నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ఇదే టోర్నీలో పోటీపడుతున్న పాకిస్థాన్, హాంకాంగ్ 17 మందితో జట్టును ప్రకటించగా, 15 మందిని ఎంపిక చేసిన బీసీసీఐ కనీసం స్టాండ్‌బై ప్లేయర్ల జాబితాలోనూ అయ్యర్‌కు అవకాశమివ్వకపోవడం గమనార్హం. '17 మందితో జట్టును ప్రకటించే అవకాశమున్నప్పుడు ఎందుకు బీసీసీఐ సద్వినియోగం చేసుకోలేదు. మరో ఇద్దరు ప్లేయర్లతో ఆడేందుకు ఆస్కారముండేది'అని ప్రసాద్ అన్నాడు.

భారత్ 'ఏ' 93/5



షెఫాలీవర్మ (35)

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఏ'తో గురువారం మొదలైన అనధికారిక తొలి టెస్టులో భారత 'ఏ' మహిళల జట్టు ఘోరంగా తడబడింది. వర్షం అంతరాయం మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఏ' 23.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. వన్డే ప్రపంచకప్ టోర్నీకి దూరమైన హార్డ్‌హిట్టర్ షెఫాలీవర్మ(35) ఫర్వాలేదనిపించింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ జార్జియా ప్రెస్ట్‌విడ్జ్(3/25) ధాటికి నందిని కశ్యప్(0), ధారా గుజ్జర్(0) పరుగుల ఖాతా తెరువకపోగా, తేజాస్ హసన్‌బిస్(9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. అయితే రాఘవి బిస్త్(26 నాటౌట్), తనుశ్రీ సర్కార్(13) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు కలిసి స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. రాఘవితో పాటు కెప్టెన్ రాధాయాదవ్(8 నాటౌట్) ప్రస్తుతం క్రీజులో ఉన్నారు.

ముంబై కెప్టెన్సీకి రహానే గుడ్‌బై



ముంబై: దేశవాళీ సీజన్‌కు ముందు ముంబై క్రికెట్ జట్టుకు ఓ కుదుపు! తన నాయకత్వ శైలితో ముంబైని రంజీ విజేతగా నిలుపడంతో పలు టైటిళ్లు అందించిన వెటరన్ క్రికెటర్ అజింక్యా రహానే కెప్టెన్సీ బాధ్యతల నుంచి అనూహ్యంగా తప్పుకున్నాడు. ఈ విషయాన్ని గురువారం ఎక్స్ ద్వారా వెల్లడించాడు. 'ముంబై జట్టుకి నాయకత్వం వహించడం, మ్యాచ్‌లు గెలిపించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. దేశవాళీ సీజన్ సమీపిస్తున్న వేళ..ముంబైకి మరో కొత్త కెప్టెన్ తీర్చిదిద్దేందుకు ఇదే సరైన సమయమని భావించాను. అందుకే కెప్టెన్సీ బాధ్యతల్లో కొనసాగవద్దని నిర్ణయించుకున్నాను. ముంబై మరిన్ని టైటిళ్లు గెలువడంలో కీలకంగా వ్యవహరిస్తాను' అని రహానే పేర్కొన్నాడు.

అజయ్‌సింగ్ హ్యాట్రిక్

భారత బాక్సింగ్ అధ్యక్షుడిగా ఎన్నిక

గురుగ్రామ్: భారత బాక్సింగ్ అసోసియేషన్(బీఎఫ్‌ఐ)లో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన తెరపడింది. హోరాహోరీగా సాగిన బీఎఫ్‌ఐ ఎన్నికల్లో అజయ్‌సింగ్ హ్యాట్రిక్ విజయంతో ముచ్చటగా మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్నాడు. వాయిదా పడుతూ వచ్చిన అసోసియేషన్ ఎన్నికల్లో అజయ్ సింగ్ 40-26 తేడాతో ప్రత్యర్థి జస్‌లాల్ ప్రధాన్‌పై విజయం సాధించాడు. ప్రధాన కార్యదర్శిగా ప్రమోద్‌కుమార్, కోశాధికారిగా పోన్ భాస్కరన్ ఎన్నికయ్యారు.

అస్మదీయుడికి అందలం

తన క్లబ్ ఆఫీస్‌బేరర్‌కు సీఈవో పదవి


హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షుడు దల్జీత్‌సింగ్ లీలలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఉల్లంఘనల పర్వం కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే ఫోర్జరీ కేసులో పలువురు ఆఫీస్ బేరర్లు జైలు శిక్ష అనుభవిస్తుండగా, తాత్కాలిక అధ్యక్షుడిగా గద్దెనెక్కిన దల్జీత్‌సింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూనే ఉన్నాడు. అసోసియేషన్ రూల్స్‌కు విరుద్ధంగా వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎమ్) నిర్వహణ, 57 క్లబ్‌లపై మళ్లీ నిషేధంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న దల్జీత్‌సింగ్ మరో నిర్వాకానికి తెరతీశాడు. హెచ్‌సీఏ వ్యవహారాల పర్యవేక్షణకు హైకోర్టు ఏకసభ్య కమిటీ నియమించినా..తాను మాత్రం అడ్డదారుల్లో అస్మదీయులను అందలం ఎక్కిస్తున్నాడు. ఓవైపు సీఈవో పదవి కోసం ఇంటర్వ్యూలు జరుగుతుండగా, ఇది వరకు తన కుటుంబానికి చెందిన క్లబ్‌లో ఆఫీస్ బేరర్‌గా పనిచేసిన ఇంతియాజ్‌ఖాన్‌ను తాత్కాలిక సీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చాడు. అయితే ఇంతియాజ్‌కు సుదీర్ఘ అనుభవం ఉందని పేర్కొన్న దల్జీత్.. తన క్లబ్‌లో ఆఫీస్ బేరర్ అన్న విషయాన్ని బయటకు పొక్కనీయలేదు.

హెచ్‌సీఏ రూల్స్‌కు ఇది విరుద్ధం: శ్రీధర్

హెచ్‌సీఏ తాత్కాలిక సీఈవో నియామకం పూర్తిగా అసోసియేషన్ రూల్స్‌కు విరుద్ధమని మాజీ కార్యవర్గ సభ్యుడు చిట్టి శ్రీధర్ పేర్కొన్నాడు. దల్జీత్‌సింగ్‌కు చెందిన అమీర్‌పేట, ఖల్సా క్రికెట్ క్లబ్‌లలో సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన ఇంతియాజ్‌ఖాన్‌ను సీఈవో చేసి పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడ్డాడు.

ఫస్ట్ లుక్ రిలీజ్ వెనుక భారీ ప్లాన్?



రాజమౌళి సినిమాలే కాదు, ప్రమోషన్లు కూడా భిన్నంగా ఉంటాయి. నిర్మాణంలో ఉండగానే ప్రమోషన్స్‌తో సినిమాపై హైప్ తీసుకొస్తారాయన. అయితే.. ప్రస్తుతం చేస్తున్న 'SSMB 29' విషయంలో మాత్రం ప్రమోషన్ ఊసే లేకుండా, చడీచప్పుడు చేయకుండా వేగంగా షూటింగ్ చేసుకుంటూపోతున్నారాయన. నిజానికి ఈ నెల 9న మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు చెందిన ఏదైనా అప్‌డేట్ వస్తుందేమోనని సగటు ప్రేక్షకుడు సైతం ఎదురుచూశాడు. కానీ అలా జరగలేదు. కేవలం ప్రీ లుక్ విడుదల చేసి, ఫస్ట్ లుక్ నవంబర్‌లో వస్తుందని ప్రకటించారు. దీంతో అంతా సూపర్‌స్టార్ లుక్ కోసం వెయిట్ చేస్తున్నారు. అయితే.. నవంబర్‌లో మహేష్ ఫస్ట్ లుక్ రిలీజ్ వెనుక పెద్ద ప్లానే ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. డిసెంబర్ 19న 'అవతార్: ది ఫైర్ అండ్ యాష్' మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నవంబర్‌లో డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ ఇండియాకు రానున్నారని సమాచారం. అలా వచ్చిన కామెరూన్ చేత మహేష్ ఫస్ట్‌లుక్‌తోపాటు 'SSMB 29' గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేశారని ఫిల్మ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జక్కన్న ప్లాన్ మామూలుగా లేదుగా అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

సమ్మె విరమిస్తున్నాం..

ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రకటన ● ప్రభుత్వ జోక్యంతో కథ సుఖాంతం ● నేటి నుంచి షూటింగులు షురూ

గత 18 రోజులుగా మూసివున్న సినీస్టూడియోల గేట్లు తెరుచుకోనున్నాయి. షూటింగుల లేక మూగబోయిన నగారాలు మళ్లీ మోగనున్నాయి.. ఆర్క్ లైట్ల కాంతులతో షూటింగ్ లొకేషన్లు కళకళలాడనున్నాయి. 'కెమెరా రోలింగ్.. యాక్షన్..' అనే శబ్దాలతో స్టూడియోలు దద్దరిల్లనున్నాయి. ఎట్టకేలకు కార్మిక సంఘాలు సమ్మెకు స్వస్తి పలికాయి. ప్రభుత్వ జోక్యంతో మొత్తంగా కథ సుఖాంతమైంది. స్తంభించిన సినీ పరిశ్రమ మళ్లీ కళకళలాడనుంది. గురువారం హైదరాబాద్ చిక్కడపల్లి కార్మికశాఖ కార్యాలయంలో ఫిల్మ్‌ఛాంబర్, నిర్మాతలు, ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లతో 8గంటలపాటు కార్మికశాఖ అదనపు కమీషర్ గంగాధర్ జరిపిన సుదీర్ఘ చర్చలు సఫలమయ్యాయి. చర్చల అనంతరం సమ్మెను విరమిస్తున్నట్టు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మీడియా సాక్షిగా ప్రకటించారు. ముందు అనుకున్న ఒప్పందం ప్రకారం వేతనాలను 30శాతం పెంచాలని నిర్మాతలను కార్మిక సంఘాలు అడగ్గా.. చివరకు 22.5శాతం పెంచేందుకు నిర్మాతలు అంగీకరించినట్టు కార్మికశాఖ అదనపు కమీషనర్ గంగాధర్ తెలియజేశారు. దిన వేతనం రోజుకు రెండువేలు లోపు తీసుకునే కార్మికులకు తొలి ఏడాది 12.5 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం.. మొత్తంగా 22.5 శాతం వేతనాలను పెంచేందుకు నిర్మాతలు అంగీకరించారని గంగాధర్ వివరించారు. అలాగే.. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ కాల్‌షీట్‌కు కూడా ఫెడరేషన్ అంగీకరించిందని గంగాధర్ తెలిపారు. ఆదివారం పనిచేస్తే రెట్టింపు వేతనం ఇవ్వడం నిర్మాతలకు భారంగా మారిన నేపథ్యంలో ఇక నుంచి ఆదివారం పనిచేస్తే 1.5 వేతనం మాత్రమే ఇవ్వడం జరుగుతుందనీ గంగాధర్ పేర్కొన్నారు. నిర్మాతలకు, ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కూ మధ్య ఇకపై ఎలాంటి వివాదాలు, సమస్యలూ తలెత్తకుండా ఉండేందుకు స్వయంగా ప్రభుత్వమే ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నదని. ఇకనుంచి సినిమా పరిశ్రమకు సంబంధించిన ఏ సమస్య ఎదురైనా అటు నిర్మాతలుకానీ, ఇటు కార్మికులు కానీ ఆ కమిటీని సంప్రదించవచ్చని కార్మికశాఖ అదనపు కమీషనర్ గంగాధర్ తెలిపారు. ప్రస్తుతం నిర్మాతలకు, కార్మిక సంఘాలకూ మధ్య కొన్ని సమస్యలు ఇంకా మిగిలివున్నాయని, వాటిపై ఈ కమిటీనే నెలరోజుల్లో ఓ నివేదిక ఇస్తుందని గంగాధర్ అన్నారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మాట్లాడుతూ ' మా సమస్యలకు పరిష్కారం ప్రభుత్వ జోక్యం వల్లనే సాధ్యమైంది. ఇరువర్గాలనూ సమన్వయపరచడంలో కార్మిక శాఖ చొరవ చూపించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మా సమస్యల్లో కొన్ని మాత్రమే పరిష్కారమయ్యాయి. మిగిలివున్న సమస్యలను ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కమిటీనే పరిష్కరిస్తుందని నమ్ముతున్నాం. యూనియన్‌లో అందరినీ అన్ని రకాలుగా తృప్తి పరచలేం. వారందరికీ నచ్చజెబుతాం. రేపట్నుంచి షూటింగుల్లో పాల్గొంటాం. నేటితో బంద్‌కు స్వస్తి పలుకుతున్నాం.' అని ప్రకటించారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, దామోదరప్రసాద్, ఫెడరేషన్ కార్యదర్శి అమ్మిరాజు, పలువురు నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు ఈ పాల్గొన్నారు.



వచ్చే ఏడాది వేసవిలో విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు అంటే అభిమానులకు పండుగ రోజే. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ రోజున ఫ్యాన్స్ చేసే హంగామా అంతాఇంతాకాదు. వారందరి ఆనందాన్ని రెట్టింపు చేస్తూ మెగా అప్‌డేట్‌ని 'విశ్వంభర' టీమ్ విడుదల చేసింది. ఈ సినిమా కోసం కోట్లాదిమంది మెగాస్టార్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. వచ్చే ఏడాది వేసవిలో 'విశ్వంభర'ను విడుదల చేయనున్నట్టు గురువారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియోలో చిరంజీవి మాట్లాడుతూ 'మీ అందరి ముందుకు ఇలా రావడానికి కారణం 'విశ్వంభర'. ఈ సినిమా ఆలస్యం మీకు ఇబ్బందిగా అనిపించొచ్చు. అయితే.. ఈ అలస్యం సముచితమని నేను భావిస్తున్నా. ఎందుకంటే ఈ సినిమా సెకండాఫ్ అంతా వీఎఫ్‌ఎక్స్, గ్రాఫిక్స్ పైనే ఆధారపడి ఉంది. అత్యున్నతమైన ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మీకు అందివ్వాలన్నదే మా ప్రయత్నం. ఇక సినిమా విషయానికొస్తే.. ఓ అద్భుతమైన చందమామకథలా ఉంటుంది. చిన్నపిల్లలకు బాగా నచ్చుతుంది. ముఖ్యంగా పెద్దవాళ్లలో ఉండే చిన్నపిల్లలకు ఇంకా నచ్చుతుంది.' అని తెలిపారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, అషికా రంగనాథ్, కునాల్ కపూర్, మౌనీరాయ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.



సంఖ్య తగ్గినా నాణ్యత తగ్గదు..

నటిగా ఓ వెలుగు వెలిగిన సమంత.. ఇప్పుడు నిర్మాతగా కూడా బిజీ అవుతున్నారు. రీసెంట్‌గా 'శుభం'తో ఆమె సక్సెస్ అందుకున్నారు. సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పతాకంపై ఆమె నటిస్తూ నిర్మిస్తున్న 'రక్తబ్రహ్మండ్' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇకపై సెలక్టీవ్‌గా సినిమాలు చేయాలని ఈ అందాలభామ నిర్ణయించుకున్నారట. ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన ఈ అందం.. ఆ మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఎన్ని సినిమాలు చేశామనేది ముఖ్యం కాదు.. ఎన్ని మంచి సినిమాలు చేశామనేది ముఖ్యం. ఇకపై మనసుకు నచ్చిన కథల్లోనే నటిస్తా. ఒకేసారి అయిదారు సినిమాలు ఇక చేయను. శరీరం చెప్పేది అందరం వినాలి. శారీరక, మానసిక ఆరోగ్యమే మనిషికి ముఖ్యం. అయితే.. ప్రాజెక్టుల సంఖ్య తగ్గినా.. నాణ్యత విషయంలో మాత్రం రాజీ పడను.' అని తెలిపారు సమంత.

రామ్ ఎనర్జిటిక్ అవతారం



హీరో రామ్ పోతినేని నటిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్‌బాబు.పి దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ని గురువారం అధికారికంగా మేకర్స్ తెలియజేశారు. నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్‌డేట్ పోస్టర్‌లో రామ్ స్టైలిష్‌గా ఎనర్జిటిక్ అవతారంలో కనిపిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావురమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్, ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్ అండ్ మెర్విన్, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టి.సిరీస్ ఫిల్మ్స్.

యువతరానికి నచ్చే కథతో



టి.డి.ఆర్ సినిమాస్ సంస్థ తొలి ప్రయత్నంగా నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. హీరోహీరోయిన్లు పవన్ కేసరి, కావ్యా కల్యాణ్‌రామ్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ ఇవ్వగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ అబ్బరాజు, ప్రశాంత్ దిమ్మెల, అడిదాల విజయ్‌పాల్‌రెడ్డి స్క్రిప్ట్‌ని దర్శకుడు కుంచెం శంకర్‌కి అందించారు. ఈ సినిమాలో నటిస్తున్నందుకు హీరోహీరోయిన్లు పవన్ కేసరి, కావ్య కల్యాణ్‌రామ్ ఆనందం వ్యక్తం చేశారు. శంకర్ మంచి కథతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నారని, విజయ్ బుల్గానిన్ అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారని నిర్మాతలు తలారి దినకరణ్‌రెడ్డి, తలారి హేమావతిరెడ్డి అన్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని దర్శకుడు తెలిపారు. సంగీతదర్శకుడు విజయ్ బుల్గానిన్ కూడా మాట్లాడారు. సుగుణ, సుప్రియ, దివిజ ప్రభాకర్, మోయిన్ తదితరులు ఇతర పాత్రధారులు.



హానెస్ట్‌గా తీసిన సినిమాలు అరుదుగా వస్తాయి..

'పరదా చాలా కొత్త కథ. తెలుగు సినిమాలోనే కాదు.. ఇండియన్ సినిమాలోనూ ఇది అరుదైన కథ. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు ఒక ఛాలెంజ్‌గా అనిపించింది. ప్రీమియర్స్ చూసిన చాలామంది నేను కళ్లతోనే కాదు, బాడీ లాంగ్వేజ్, వాయిస్‌తో కూడా యాక్ట్ చేయగలనని అంటుంటే చెప్పలేనంత ఆనందమేసింది.' అని అనుపమ పరమేశ్వరన్ అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకుడు. శ్రీనివాసులు పి.వి, శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మాతలు. నేడు(శుక్రవారం) ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం అనుపమ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. 'ఒక యాక్టర్‌కి ఇలాంటి హానెస్ట్‌గా తీసిన సినిమాలు అరుదుగా దొరుకుతాయి. నేను ఎంతో కనెక్టయిన కథ ఇది. ఒక అమ్మాయి మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలదు. సెలబ్రేట్ చేసుకునే సినిమాలతో పాటు ఇలా ఆలోచింపజేసే సినిమాలు కూడా రావాలి. మేము నిజాయితీగా ఓ ప్రయత్నం చేశాం. ఆడియన్స్ యాక్సెప్ట్ చేస్తారని నమ్మకంతో ఉన్నాం.' అని అనుపమ ఆశాభావం వెలిబుచ్చారు. 'పరదా' ఒక బోల్డ్ అటెంప్ట్ అనీ, ఈ సినిమా చూస్తున్నప్పుడు ఒక్క సెకండ్ ఆలోచించగలిగినా అది నేను సక్సెస్‌గా భావిస్తానని అనుపమ చెప్పారు. 'దర్శన, సంగీతలతో కలిసి నటించడం ఓ గొప్ప ఎక్స్‌పీరియన్స్. గోపీసుందర్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలం. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా 'పరదా''. అని అనుపమ పరమేశ్వరన్ అన్నారు.



భద్రకాళి స్వరాలాపన

హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న పవర్‌ఫుల్ ఎంటర్టైనర్ 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకుడు. రామాంజనేయులు జవ్వాజీ నిర్మాత. సెప్టెంబర్ 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని వారు అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ సినిమా తొలిపాటను విడుదల చేశారు. 'మారెనా..' అంటూ సాగిన ఈ ప్రేమగీతాన్ని భాష్యశ్రీ రాయగా, విజయ్ ఆంటోనీ స్వరపరిచారు. అభిజిత్ అనిల్ కుమార్ ఆలపించారు. యువతకు నచ్చేలా ఈ పాట చిత్రీకరణ సాగింది. విజయ్ ఆంటోనీ 'మార్గన్' చిత్రాన్ని తెలుగులో విడుదల చేసిన ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో విడుదల చేస్తున్నది. వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: షెల్లీ కాలిస్ట్, సమర్పణ: విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని.

కథే హీరోగా ఆత్మకథ



జెమినీ సురేశ్, అఖిల నాయర్ జంటగా 'ఆత్మకథ' పేరుతో ఓ చిత్రం రూపొందుతున్నది. శ్రీనివాస్ గుండ్రెడ్డి దర్శకుడు. వారాహి ఎంటర్టైన్మెంట్ ప్రై.లిమిటెడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో జెమినీ సురేశ్ తల్లి జెమిని సుబ్బలక్ష్మి క్లాప్ ఇవ్వగా, టి.ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్ కెమెరా స్విచాన్ చేశారు. సినిమా బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులంతా ఆకాంక్షించారు. '18ఏండ్ల నా కల నేటికి నెరవేరుతున్నది. ఒక మంచి కథతో ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నాను. ఆ అవకాశం ఈ 'ఆత్మకథ' చిత్రంతో దక్కింది.' అని జెమినీ సురేశ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో భాగమైనందుకు కథానాయిక అఖిల సంతోషం వెలిబుచ్చారు. కథే ఈ సినిమాకు హీరో అని, జెమినీ సురేశ్, సమ్మెట గాంధీ ఈ కథకు రెండు పిల్లర్స్ వంటివారని దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి తెలిపారు. ఇంకా సమ్మెట గాంధీ, సంగీత దర్శకుడు శ్రేయాస్ కూడా మాట్లాడారు. బలగం విజయలక్ష్మి, చిన్ను, ధనరాజ్, తాగుబోతు రమేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.వి.గోపి.



ఇది నా తొమ్మిదేళ్ల కల

విజయరామరాజు టైటిల్‌రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకుడు. శ్రీని గుబ్బల నిర్మాత. విడుదలకు ముందే 46 అంతర్జాతీయ అవార్డులు అందుకున్న ఈ చిత్రం ఈ నెల 29న థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇది తన తొమ్మిదేళ్ల కల అని, మా టీమ్ చేసిన ఆరేళ్ల హార్డ్ వర్క్ 29న అంతా చూడబోతున్నారని, ఒక డెబ్యూ డైరెక్టర్‌కి ఎంత ఫ్రీడమ్ ఇవ్వాలో అంతకంటే ఎక్కువే తనకు నిర్మాత ఇచ్చారని, హీరో విజయరామరాజు ప్రాణం పెట్టి పనిచేశారని, ఈ సినిమా టీమ్ వర్కనీ, సాంకేతికంగా సినిమా అద్భుతంగా ఉంటుందని దర్శకుడు విక్రాంత్ రుద్ర చెప్పారు. ఈ సినిమానే తమను ముందుకు తీసుకెళ్లిందని, తన కెరీర్‌లోనే ఇది బెస్ట్ మూవీ అని హీరో విజయరామరాజు అన్నారు. ఇంకా కథానాయిక సిజా రోజ్, నిర్మాత శ్రీని గుబ్బల, నటులు అజయ్, దయానందరెడ్డి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకాటి, సంగీతం: విఘ్నేష్ భాస్కరన్.

దరిద్రపుగొట్టు.. అసమర్థ పాలన

- సీఎం రేవంత్‌రెడ్డిపై ఎక్స్ వేదికగా కేటీఆర్ విసుర్లు



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూరియా కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనను ఎక్స్ వేదికగా ఎండగట్టారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పీఏసీఎస్‌లో ఉంచిన చెప్పుల క్యూ వద్ద అలసిపోయి నిద్రిస్తున్న రైతు ఫొటోను ట్యాగ్ చేసిన కేటీఆర్.. ఎరువుల కోసం అన్నదాతలు పడుతున్న కష్టాలను కండ్లకు కట్టారు. 'రేవంత్‌డ్డీ.. నీ దరిద్రపుగొట్టు పాలనకు దక్కిన అసమర్థ ఆస్కార్ అవార్డు ఇది. ఈ ఫొటోను ఫ్రేమ్ కట్టించుకుంటావో, మెడలో వేసుకొని ఊరేగుతావో నీ ఇష్టం'అని ఎద్దేవా చేశారు. 'చేతగాని పాలనతో అన్నదాతలను అప్పుల పాలు చేసిన పాలకులను చూశాం కానీ, చెప్పుల పాలు చేసిన చెత్త రికార్డు నీదే' అని దెప్పిపొడిచారు. బస్తా యూరియా కోసం రైతు బతుకును బజారున పడేశావంటూ నిప్పులు చెరిగారు. కాయకష్టం చేసి అందరి కడుపునింపే అన్నదాతను పాదరక్షల పాల్జేసిన నీ పాపం ఊరికేపోదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు

ఎరువుల సంక్షోభాన్ని పరిష్కరించండి

- తెలంగాణకు యూరియా సరఫరా చేయండి
- కేంద్ర మంత్రి నడ్డాకు ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు వినతి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రోజురోజుకూ తీవ్రతర మవుతున్న ఎరువుల సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను పార్లమెంట్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు. యూరియా కోసం తెలంగాణ రైతులు పడుతున్న కష్టాలను ఏకరువుపెట్టారు. వెంటనే తెలంగాణ సాగు అవసరాలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తక్షణమే 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపించేందుకు అంగీకరించినట్టు వెల్లడించారు.

పార్లమెంట్‌లో రాజీలేని పోరాటం

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేసిందని పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. గురువారం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. మార్పు తెస్తామని పదే పదే చెప్పిన కాంగ్రెస్ డొల్లతనం యూరియా కొరతతో తేలిపోయిందని ఎద్దేవాచేశారు. ఏపీ సర్కారు నిర్మిస్తున్న బనకచర్లను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందని స్పష్టంచేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోటాపై కాంగ్రెస్ నాటకాన్ని పార్లమెంట్ సాక్షిగా ఎత్తిచూపామని వెల్లడించారు.

కాంగ్రెస్ పాలనలో తీరని వ్యథ: ఎర్రబెల్లి



పర్వతగిరి, ఆగస్టు 21: 'అయ్యా.. యూరియా కోసం అరిగోస పడుతున్నం.. పొద్దటి నుంచి తిండి లేకుండా లైన్‌లో నిల్చున్నం.. ఎరువు ఎప్పుడిస్తారోనని పడిగాపులు కాస్తున్నం.. నాలుగు రోజులుగా తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా దొరకలేదు.. దయచేసి మాకు యూరియా ఇప్పించండి సారూ' అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముందు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కష్టాలను అర్థం చేసుకుంటలేడు.. వచ్చే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరిలో పలు కార్యక్రమాలకు హాజరై వెళ్తుండగా ఎర్రబెల్లితో రైతులు ఆవేదనను చెప్పుకున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులకు సరిపడా యూరియా అందడంతో నిశ్చింతగా ఉన్నామని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతకు కష్టాలు తీరని వ్యథగా మిగిలాయని మండిపడ్డారు.

సర్కారుకు ప్రణాళిక లేదు: రెడ్యానాయక్

కురవి, ఆగస్టు 21: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ముందస్తు ప్రణాళిక లేదు.. వ్యవసాయంపై ముఖ్యమంత్రి, మంత్రులకు పరిజ్ఞానం లేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లా కురవిలోని సొసైటీ ఆధ్వర్యంలో యూరియా బస్తాల కోసం సంత ఆవరణలో ఉన్న రైతులతో రెడ్యానాయక్ మాట్లాడారు. వ్యవసాయ అధికారి నర్సింహారావు, రూరల్ సీఐ సర్వయ్యను అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. కురవి సొసైటీకి 444 బస్తాలు వస్తే.. 2000 మంది రైతులు పడిగాపులు కాస్తున్నారని, ఓట్లేయించుకుని గెలిచిన నాయకులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. దేశంలో యూరియా లేకపోవడం కాదని, సీఎంకి అవగాహన లేకపోవడం వల్లనే రైతులు గోస పడుతున్నారని మండిపడ్డారు.

కొరత బాధ్యత కేంద్రానిదే: పొంగులేటి



కూసుమంచి, ఆగస్టు 21: రాష్ట్రంలో యూరియా కొరత బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యూరియా కోసం సీఎంతోపాటు ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారని చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం పొంగులేటి విలేకరులతో మాట్లాడారు. వచ్చిన యూరియాను సక్రమంగా పంపిణీ చేయడంతోపాటు ఎలాంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఎవరైనా తప్పు చేస్తే కేసులు పెడుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోజుకు రెండుసార్లు యూరియాపై సమీక్ష చేస్తున్నారని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

నాడు కేసీఆర్ యూరియా తెప్పించారిలా..

- ఎరువులపై మాజీ సీఎం కేసీఆర్ సమీక్ష వీడియో వైరల్
- యూరియా తెప్పించిన తీరుపై ప్రశంసలు
- అధికారులకు ఆదేశాలు ఇచ్చిన తీరు భేష్
- గ్రామాలకు లారీలతో సరఫరాకు సూచనలు



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): ఎరువులను తెప్పించడం కోసం నాడు కేసీఆర్ చేసిన సమీక్ష వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సమీక్షలో ఎరువులు తెప్పించేందుకు కేసీఆర్ పడిన తపన, చూపిన చొరవపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'ఇది కదా.. రైతులపై ప్రేమంటే, ఇది కదా... ముందుచూపంటే. ఇది కదా.. నాయకుడి లక్షణమంటే' అంటూ అభినందిస్తున్నారు. ఈ సమీక్షలో కేసీఆర్ ఎరువులను సకాలంలో రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి.. ఎవరి బాధ్యత వారికి అప్పగిస్తూ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. విదేశాల నుంచి షిప్‌ల ద్వారా వచ్చే యూరియాను వెంటనే రైళ్లు ఏర్పాటు చేసి తెలంగాణకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులతో మాట్లాడి అవసరమైన గూడ్స్ రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దీంతో రైల్వేశాఖ ప్రత్యేకంగా 25 గూడ్స్ రైళ్లు ఏర్పాటు చేసింది. గూడ్స్ రైళ్లకు షిప్‌ల నుంచి యూరియా ఎక్కించేందుకు అవసరమైన లారీలను సమకూర్చాల్సిందిగా నాటి ఏపీ మంత్రి పేర్ని నానికి ఫోన్ చేసి మాట్లాడారు. స్పందించిన నాని.. అవసరమైన లారీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే షిప్‌ల నుంచి సకాలంలో మనకు కేటాయించిన కోటా యూరియాను తీసుకునేందుకు ప్రతీ పోర్టుకు వ్యవసాయశాఖలోని ఒక సీనియర్ అధికారిని పంపించాలని ఆదేశించారు. ఈ విధంగా రెండు మూడు రోజుల్లోనే లక్ష టన్నుల యూరియాను రాష్ట్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇక రాష్ట్రానికి వచ్చిన యూరియాను నేరుగా గ్రామాలకు తరలించాలని ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాలతో నాడు అధికారులు ఏకంగా 4వేల లారీలను సిద్ధం చేయడం గమనార్హం. ఈ విధంగా సకాలంలో యూరియాను తెప్పించి.. రైతులకు సరఫరా చేసి కొరత, ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. యూరియా తెప్పించేందుకు కేసీఆర్ చేసిన కృషిపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పదేండ్లలో ఎక్కడా యూరియా కొరత అనే మాట వినిపించకుండా నాటి సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారు. సీజన్ ప్రారంభమైందంటే ప్రతీక్షణం యూరియా నిల్వలపై సమీక్షించేవారు. సీజన్‌కు ముందే బఫర్‌స్టాక్ ఉండేలా చర్యలు తీసుకునేవారు. తద్వారా ఎక్కడా యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితి ఉండడం గమనార్హం. ఎక్కడ చూసినా యూరియా కొరతే. ఒక్క బస్తా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచే ఎరువుల దుకాణాల ముందు బారులు తీరుతున్నారు.

ప్రభుత్వ పెద్దలా.. పెత్తందారులా?

- అన్నదాతలంటే అలుసా? రైతులంటే గౌరవం లేదా..?
- కర్షకులపై వాడు.. వాడు అంటూ అవమానకర వ్యాఖ్యలు
- కడుపుమండి రోడ్డెక్కితే రాజకీయాలు అంటగడతారా?
- ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలపై తెలంగాణ వాదుల ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించడం పాలకుల బాధ్యత. రాజ్యాంగానికి లోబడి పాలన సాగించడం విద్యుక్త ధర్మం. కానీ పాలకులంటే ప్రజల భుజాలపై ఊరేగే పెత్తందారుల్లా, ప్రజలను బానిసలుగా చూసే మనస్తత్వంతో కొందరు అమాత్యులుగా అందలమెక్కి రాజ్యమేలుతున్నారు. ప్రజలే యజమానులు, పాలకులు సేవకులు అని మర్చిపోయి... చిన్నంతరం, పెద్దంతరం లేకుండా నవ్విపోదురుగాక నాకేంటి..! అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం రైతులు విలవిల్లాడిపోతుంటే ఏలికలు చేసిన ఎక్కిరింతలు చూసి.. తెలంగాణవాదులు, నెటిజన్లు... 'వీళ్లా మన పాలకులు..?' అని చీదరించుకుంటున్నారు. ఓ మంత్రి మాట్లాడుతూ 'నాకు తెలిసీ బజారెక్కేవాడు పొలంలో ఉండేవాడు కాదు... నిజంగా యూరియా కోసం వచ్చిన వాడు, పాపం.. కొనుక్కొని వెళ్తున్నాడు. ఆడితో గొడవ లేదు మాకు' ఇదీ.. ఒక మంత్రి మాట. 'అసలేం మాటలవి? అన్నదాతను పట్టుకొని వాడు.. వీడు... ఆడు.. అనడం ఏమిటి? ఇంత అహంకారమా? ఇంత నోటి దురుసా? అతడి కండ్లకు మనుషులు కనిపించరా?' అని నెటిజన్లు నిప్పులు చెరుగుతున్నారు. పెద్ద మోతుబరి రైతు అని చెప్పుకుని తిరిగే ఆ మంత్రికి.. సాటి రైతులంటేనే కాదు.. అధికారులంటే కూడా లెక్కేలేదు. అతడు ఏమన్నాడో చూద్దాం. 'కాళేశ్వరం పంపులు ఆన్‌చేసేవోడు ఒకడుంటాడు. వాడే పంపులు ఆన్ చేస్తాడు' అదీ ఆయన భాష. మంత్రిగారి భాషా వ్యాకరణంలో వాడు, వీడు తప్ప.. అతడు, ఆయన, వారు, వీరు అనేవి ఉండనే ఉండవు అని నెటిజన్ల నుంచి సెటైర్లు పేలుతున్నాయి.

ఎవరూ ఏమీ తక్కువ కాదులే!

రాష్ట్రంలో ఆ మోతుబరి మంత్రే కాదు.. మిగిలిన మంత్రులు కూడా పెత్తందారీతనానికి ఏమీ తీసిపోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎరువుల కోసం ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా.. వారి దగ్గరకు వెళ్లి సర్ది చెప్పిన మంత్రి లేరు. క్యూలైన్లలో కావాలనే చెప్పులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారంటాడు ఇంకో మంత్రి. క్యూ అంటే పొద్దున ఉండాలి కానీ.. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు ఏమిటి? అంటాడు మరో మంత్రి. ఎరువులు తేవడం చేతకాదు కానీ అడిగిన రైతు మీదికి లాఠీలు లేపడమే మంత్రులకు తెలిసిన పని అని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

క్యూలైన్లలో నిల్చున్న వాళ్లు రైతులే కాదు!

- రాజకీయనేతలు ప్రేరేపిస్తేనే రైతుల క్యూలు, ఆందోళనలు
- తెలంగాణలోనే యూరియా కొరత ఉన్నట్టు ప్రచారం: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యూరియా కోసం క్యూలైన్లలో నిల్చున్నవారెవరూ రైతులు కాదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిజంగా యూరియా అవసరమున్న వాళ్లంతా తీసుకుని వెళ్తున్నారని చెప్పారు. రైతులు చేస్తున్న ఆందోళనలన్నీ రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉందని, కానీ ఒక్క తెలంగాణలోనే ఉన్నట్టు కొందరు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో కేంద్రం విఫలమైందని తెలిపారు. కానీ దీన్ని కప్పిపుచ్చుకునేలా కేంద్ర మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. చైనా నుంచి దిగుమతి కావల్సిన యూరియా తెప్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలిసేలా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు తుమ్మల సూచించారు. అలాగే ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను కూడా రైతులకు అమ్మే విధంగా చూడాలని, క్యూలైన్ లేకుండా చూడాలని సూచించారు. ఎవరైనా ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరకు అమ్మినట్టయితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా అమ్మకాలలో పాస్‌బుక్ అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. నానో యూరియాపై అవగాహన పెంచాలన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నరు: సీఎం



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కొందరు కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎరువుల కోసం చాలామంది క్యూలైన్లలో నిలబడ్డట్టు పేపర్లు, టీవీల్లో ఫొటోలు, వీడియోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఎరువుల కొరతపై ఇటీవల రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఎరువులు దొరకడంలేదని, తక్కువ ఉన్నాయని భయపెట్టడంతో రైతులు తెల్లవారగానే దుకాణాలు, పీఏసీఎస్‌లు, పంచాయతీల ఎదుట బారులు తీరుతున్నారని చెప్పారు. చాలా మంది నెటిజన్లు ఆధారాలతో కూడిన చిత్రాలు చూపుతూ సెటైర్లు వేస్తున్నారు. సీఎం తప్పుదోవ పట్టించారని చెప్తున్నారు.

'నమస్తే తెలంగాణ'పై పొన్నం నిందలు

- క్షేత్రస్థాయి వాస్తవాలను, రైతు గోసను కండ్లకు కడుతుండటమే నేరమట!
- యూరియా కొరత తీర్చడానికి బదులు పత్రిక, టీన్యూస్‌పై ఉల్టా నిందలు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారంటూ అక్కసు



కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 21: రాష్ట్రంలో వరి నాట్లు వేసుకుని... యూరియా కోసం రైతులు ఆరాటపడుతున్నరు. సొసైటీ, పంచాయతీ ఆఫీసుల వద్ద పడిగాపులుకాస్తున్నరు. కొన్నిచోట్ల ఒక్కో రైతుకు ఒక్కటే సంచి ఇస్తుంటే.. మరికొన్నిచోట్ల అది కూడా దొరక్క రైతులు ఉట్టిచేతులతో ఇంటిబాట పడుతున్నారు. యూరియా లోడు ఎప్పుడు వస్తుందో తెలియక... తెల్లవారుజాము నుంచే నిద్రాహారాలు మానుకుని నిరీక్షిస్తున్నారు. గంటల తరబడి నిలబడలేక, వర్షంలో తడుస్తూ నిరీక్షించలేక... వయసు సహకరించని రైతులు.. క్యూలో పాస్‌పుస్తకాలు పెడుతున్నారు. ఇదంతా కొందరు ప్రభుత్వ పెద్దలకు సహించడంలేదు. బాధను భరించలేక రైతులు బజారెక్కితే... అమాత్యులు తమ కిరీటాలు నేలకూలినట్టు అవమానంగా భావిస్తున్నారు. ఆందోళనలు కేవలం కొన్ని పత్రికలు, టీవీలు సృష్టిగా అభివర్ణిస్తున్నారు. గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను గమనిస్తే 'బీఆర్ఎస్ నాయకులు కొంత మంది జమై.. యూరియా కోసం క్యూలో చెప్పులు పెట్టి.. రైతుల్లో ఆందోళన కలిగిస్తూ.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు' అని ఆరోపించారు. సర్కారును బదనాం చేయడమే లక్ష్యంగా... ప్రత్యేక ఎజెండా పెట్టుకొని 'నమస్తే తెలంగాణ' క్యూలైన్‌లో చెప్పులు పెట్టిన ఫొటోలు ప్రచురిస్తూ వార్తలు రాస్తుండగా, టీన్యూస్ ఆ దృశ్యాలు చూపించి రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నదని విమర్శించారు. గురువారం కరీంనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యూరియా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుందని, ఇది పూర్తిగా కేంద్ర రసాయనాల వ్యవహారాల శాఖ పరిధిలోకి వస్తుందని స్పష్టంచేశారు. కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, కేంద్ర మంత్రులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన మంచి పేరును జీర్ణించుకోలేక.. బీఆర్ఎస్ ప్రత్యేక ఎజెండా పెట్టుకొని ఇదంతా చేస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ వాళ్లే చెప్పులు పెట్టి, ఫొటోలు తీసిన ఘటనలు ఉన్నాయని చెప్పారు. 'అంటే.. రాష్ట్రంలో యూరియా కొరత లేదా?' అని విలేకరులు ప్రశ్నించగా.. కొరత ఉన్న మాట వాస్తవమేనని, కేంద్రం నుంచి రావాల్సిన యూరియాలో 60 శాతమే వచ్చిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రావాల్సినంత యూరియా రాకపోవడం వల్ల ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మానవత్వంతో తెలంగాణ రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయాలని కోరారు. కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ రైతులు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నారని తెలిపారు. కాబట్టి బండి సంజయ్ కూడా సమాధానం చెప్పాల్సి ఉంటుందని డిమాండ్ చేశారు.



కాంగ్రెసొచ్చింది... క్యూలైన్లు తెచ్చింది: జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం రైతుల క్యూలైన్లు చూశాం.. తెల్లవారుజాము నుంచే బారులు తీరేవారు. లైన్లలో గంటల తరబడి నిలబడలేక చెప్పులను క్యూలైన్‌లో పెట్టేవారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చింది. మళ్లీ క్యూలైన్లను తెచ్చింది' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ హయంలో పదేండ్లు రాష్ట్రంలో ఎక్కడా కూడా ఎరువుల కొరత అనేది కనిపించలేదని, క్యూలైన్లు లేవని గుర్తుచేశారు. సోయిలేని సీఎం, కొందరు మంత్రుల కమీషన్ల దందా యూరియా కొరతకు కారణమని ఆరోపించారు.



చేతకాని పాలన వల్లే యూరియా కొరత: సత్యవతి

నర్సింహులపేట, ఆగస్టు 21: సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై కనీస అవగాహన, ప్రభుత్వంపై పట్టు లేవని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు చేతకాని పాలన వల్లే రాష్ట్రంలో యూరియా కొరత వచ్చిందని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని పీఏసీఎస్ గోదాం వద్ద గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరి ఉండగా ఆమె వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నాట్లు పూర్తి చేసుకున్న రైతులకు యూరియా అవసరముందనే అవగాహనలేని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల దురదృష్టకరమని మండిపడ్డారు.



అసమర్థ కాంగ్రెస్ సర్కారు: మాలోత్ కవిత

మరిపెడ, ఆగస్టు 21: మహబూబాబాద్ జిల్లా ఎల్లంపేటలో యూరియా కోసం రైతులు ధర్నా చేయగా మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ది అసమర్థ పాలన అని విమర్శించారు. రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. ప్రభుత్వానికి రైతుల సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ రైతులు రోడ్డెక్కిన ఘటనలు లేవని తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వ ఏజెంట్‌గా కలెక్టర్: సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట, ఆగస్టు 21: వరంగల్ జిల్లా కలెక్టర్ కాంగ్రెస్ ప్రభుత్వ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. గురువారం చెన్నారావుపేటలోని సహకార సంఘంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి పడిగాపులు కాశారు. యూరియాను కొద్ది మందికే ఇవ్వగా సుమారు 300 మంది రైతులకు అందకపోవడంతో వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతులను శాంతింపచేశారు. సుదర్శన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ యూరియా కొరత లేదన్న కలెక్టర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.



రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: చిరుమర్తి

నకిరేకల్, ఆగస్టు 21: తెలంగాణ రైతన్నలకు యూరియా ఇవ్వలేని సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సొసైటీలకు వెళ్లే దమ్ముందా? అని ప్రశ్నించారు. రైతుల సహనాన్ని పరీక్షించొద్దని, యూరియా కోసం పడికాపులు కాస్తున్న రైతుల ముందుకు వెళ్లి నిలబడితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, మంత్రులను తరిమి తరిమి కొడతారని చెప్పారు. గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని తాటికల్ పీఏసీఎస్ గోదాములో యూరియా స్టాక్‌ను పరిశీలించారు. అక్కడే యూరియా కోసం బారులు తీరిన రైతులతో మాట్లాడారు.

రైతులకు పొన్నం క్షమాపణ చెప్పాలి

- యూరియా కొరతకు బీఆర్ఎస్సే కారణమని ఎలా మాట్లాడ్తరు?
- కేసీఆర్ సర్కార్ హయాంలో లేని కొరత.. ఇప్పుడెందుకు వచ్చింది?
- బీఆర్ఎస్ నేత రావుల ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో యూరియా కొరతతో అన్నదాతలు అరిగోస పడుతుంటే.. ఆ కొరతకు కారణం బీఆర్ఎస్సే అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారని, ఈ విషయంలో ఆయన రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'కేసీఆర్ సర్కార్ హయాంలో లేని కొరత.. ఇప్పుడెందుకు వచ్చింది. రైతులకు యూరియా అందించలేని ప్రభుత్వాన్ని దద్దమ్మ అని కాకుండా ఇంకేమి అంటారు. యూరియాపై ముందస్తు ప్రణాళికలు లేకుండా చేతులు ముడుచుకుని కూర్చున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది చేతకాని తనం కాదా?. యూరియా కోసం కేసీఆర్ హయాంలో రైతుల క్యూలైన్లు ఎప్పుడైనా చూశారా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. కృత్రిమ కొరత అంటున్నారు కదా.. మంత్రులు పొన్నం, పొంగులేటి యూరియా పంపిణీ కేంద్రాలకు వచ్చి చూడాలని రావుల సవాల్ విసిరారు.

రాష్ట్రంలో యూరియా కొరతకు కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వం థర్డ్‌గ్రేడ్ ప్రభుత్వం కాదా? బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేముంది? అని రావుల శ్రీధర్‌రెడ్డి నిలదీశారు. మంత్రి పొన్నం.. కేటీఆర్‌ది డర్టీ మైండ్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వాస్తవంగా చెప్పాలంటే.. రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులది అసలైన డర్టీ మైండ్ అని నిప్పులు చెరిగారు. ఏదైనా మాట్లాడేటప్పుడు ఇంగితం ప్రదర్శించాలని మంత్రి పొన్నంకు హితవు పలికారు.

మంత్రుల ప్రచారంతోనే కృత్రిమ కొరత: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సరిపడా యూరియా లేదంటూ మంత్రుల ప్రచారంతోనే కృత్రిమ కొరత ఏర్పడిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కొరత ఉందనే కారణంతో అక్రమంగా స్టోర్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 11 ఏండ్లలో ఏనాడూ యూరియా కొరత లేదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రంలో యూరియా నిల్వలు ఏమయ్యాయో తెలియడం లేదని అనుమానం వ్యక్తంచేశారు.